జనవరి
2018

141

సంపుటి : 12 సంచిక : 9 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

ఆంధ్ర ప్రదేశ్‌లో పోరాటాల ఉధృతి
వెలుతురు కోసం చీకటివైపు చూశాం
చైనా ఆధునికాభివృద్ధికి సిపిసి కృషి
సామాజిక సమస్యలు-సైద్ధాంతిక స్పష్టత
మళ్లీ ఏకధృవ ప్రపంచం కోసం కలలు
విఫలమైన ఆధార్
అక్టోబర్ విప్లవం - జాతీయోద్యమం
సామాజికాభివృద్ధిలో వెనుకబడ్డ గుజరాత్
అక్బర్‌ను దోషిగా చిత్రిస్తున్న సంఘ్ పరివార్
సామాజిక వెనుకబాటును బట్టి రిజర్వేషన్లు ఉండాలి
ఆదర్శ కమ్యూనిస్టు అన్నే అనసూయ

**నివాళి**

# ఆదర్శ కమ్యూనిస్టు
# అన్నే అనసూయ

**యు. రామకృష్ణ**



అంతరాలు లేని సమాజం ఆమె స్వప్నం.. అందరికీ సమానావకాశాలు ఆమె లక్ష్యం.. ఉద్యమమే ఆమెకు ప్రాణం.. ఉద్యమ విస్తరణే ఆమెకు పండుగ.. ఆమె అంకిత భావం అణువణువూ నింపుకున్న కార్యకర్త.. ప్రజల పట్ల అమితమైన ప్రేమ, నమ్మకం ఉన్న నేత.. మంచిని స్వప్నిస్తూ.. మంచిని మాట్లాడుతూ.. మంచి కోసం పోరాడిన వనిత.. అజ్ఞాత జీవితం.. జైలు జీవితం గడిపారు.. జైల్లో ఖైదీల హక్కుల కోసమూ పోరాటం నిర్వహించారు.. ఇలా ఆమె తన జీవితాన్ని సార్థకం చేసుకున్న కమ్యూనిస్టు. ఆమే కామ్రేడ్ అన్నే అనసూయ. స్వాతంత్ర్య సమర యోధుడు, సిపిఎం సీనియర్ నేత, కీర్తిశేషులు అన్నే వెంకటేశ్వరరావు జీవిత సహచరి. 2017 డిసెంబరు 2వ తేదీన కన్నుమూశారు. ఆమెకు నివాళిగా ఈ వ్యాసం..

కామ్రేడ్ అనసూయ కృష్ణాజిల్లాలోని నాటి విజయవాడ తాలూకా ఈడ్పుగల్లులో సుంకర రామచంద్రరావు, కోటమ్మ దంపతులకు జన్మించారు. ఆమె ఐదో తరగతి వరకూ చదివింది. తన 13వ ఏటనే స్వాతంత్ర్యోద్యమం పట్ల ఆకర్షితురాలైంది. తండ్రీ సోదరులంతా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం ఆమెలో అభ్యుదయ భావాలను నింపింది. ఒక సందర్భంలో మహాత్మా గాంధీ తమ ప్రాంతానికి వచ్చినప్పుడు స్వాతంత్ర్యోద్యమానికి విరాళంగా తన మెడలోని బంగారు గొలుసును ఇచ్చి అందరినీ ఆకర్షించారు. దేశం స్వాతంత్ర్యం సాధించాలని, భారతీయుల బానిసత్వ సంకెళు తెగిపోవాలని ఆ బాలిక కోరుకుంది. గాంధీకి నగలు ఇచ్చిన తరువాత ఆమె జీవితాంతం నగలను ధరించనే లేదు. గొప్ప నాటకకర్త సుంకర సత్యనారాయణ, కమ్యూనిస్టు నాయకుడు వీరభద్రరావు ఆమె సోదరులే. ఇంట్లో రోజూ పీడిత ప్రజల గురించీ, వారి విముక్తి గురించీ చర్చలు నడిచేవి. అనసూయ శ్రద్ధగా వాటిని ఆలకిస్తూ ఉండేది. అంతేకాదు ఇంట్లో ఉన్న అభ్యుదయ సాహిత్యం చదువుతూ తన ఆలోచనలను, అవగాహనను పెంచుకొంది.

ఆమె పదమూడో ఏటనే తండ్రి రామచంద్రరావు కమ్యూనిస్టు పార్టీ రాజకీయ పాఠశాలకు పంపించారు. అలా కమ్యూనిస్టు ఉద్యమంతో ఆమె మమేకమయ్యారు. కొన్నాళ్లకు స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు, గన్నవరం తాలూకా ఆత్కూరు గ్రామానికి చెందిన అన్నే వెంకటేశ్వరరావుతో పరిచయమేర్పడింది. వారిద్దరూ ఇష్టపడి పెద్దలను సంప్రదించి వివాహం చేసుకున్నారు. 1946లో ఆ దంపతులు ఏలూరుకు నివాసం మార్చారు. భర్త వెంకటేశ్వరరావుతో కలిసి కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో జరిగిన అనేక పోరాటాల్లో ఆమె పాల్గొన్నారు. ఆ సమయంలోనే కామ్రేడ్స్ మానికొండ సూర్యావతి, బండారు అచ్చమాంబలతో పరిచయమేర్పడింది.

ఒక పక్క ఆకలి, అన్నార్తులు లేని సమాజం రావాలని కోరుకుంటూనే మరోపక్క సమాజంలోని దురాచారాలపై అలుపెరుగని పోరాటం చేశారు. ఆ కాలంలో ఆడపిల్లలను చాలా చులకనగా చూసేవారు. ఆమె వాటిపై పోరాటం సాగించారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఆనాటి స్త్రీలలో అవగాహన కలిగించేవారు. నిందించినా, దాడులు చేసినా ఆమె భయపడలేదు. కొంతమంది వితంతువులకు పునర్వివాహాలు కూడా జరిపించారు.

ఆ రోజుల్లో తెలంగాణాలో భూమి కోసం, భుక్తి కోసం, బానిసత్వ విముక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటం జరుగుతోంది. ఆ సమయంలో ఆంధ్రావనిలో మహిళలు కూడా తమ వంతు పాత్ర నిర్వహించడానికి ముందడుగు వేస్తూ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో 1948 జూన్ 12న పోలీసులు అనసూయను అరెస్టు చేశారు. అప్పుడామెకు మూడేళ్ల కుమార్తె కల్పన, ఎనిమిది నెలల బాబు రవి ఉన్నారు. ఆ పిల్లలిద్దరినీ తనతో రాయవెల్లూరు జైలుకు తీసుకు పోయేందుకు పోలీసులు అంగీకరించలేదు. పిల్లలు తన వద్దే ఉండాలని మేజిస్ట్రేట్ వద్ద వాదించి మరీ తనతోపాటు జైలుకు తీసుకువెళ్లింది. జైలులో అప్పటికే తమిళనాడుకు చెందిన కమ్యూనిస్టు నాయకులు, మహిళా సంఘ అధ్యక్షులు కె.పి.జానకి అమ్మాళ్, మణి అమ్మాళ్, కమల అమ్మాళ్ తదితరులు ఉన్నారు. అనసూయకు తెలుగు తప్ప ఏ భాషా రాదు. జానకి అమ్మాళ్ వచ్చీరాని తెలుగులో అనసూయతో మాట్లాడేది. కొంతకాలానికి నలు గురు బిడ్డల తల్లి వాలమద్రు సుబ్బమ్మగారిని జైలుకు తీసుకువచ్చారు. ఇంటి ముందు సుత్తీ-కొడవలి గుర్తుగల ముగ్గు వేసినందుకు ఆమెను జైలుకు డిటెన్యూగా తీసుకు వచ్చారు. మరో 15 రోజులకు మానికొండ సూర్యావతిని కూడా అదే జైలుకు తీసుకు వచ్చారు. కొద్ది రోజుల్లోనే తమిళనాడు మహిళా నేతలు ఆంధ్ర మహిళా నేతలతో కలిసి పోయారు. జానకీ అమ్మాళ్ కొన్ని సర్క్యులర్స్‌ను అరవంలోనూ, వచ్చీరాని తెలుగులోనూ ఆంధ్ర మహిళా సంఘం నేతలకు వివరించేవారు. జైళ్లలో కూడా హక్కుల కోసం పోరాటాలు చేయాలని ఆ సర్క్యులర్స్‌లో ఉండేది. సర్క్యులర్ ప్రకారంగా సూర్యావతి నేతృత్వంలో అనసూయ తదితరులు మొట్టమొదట జైల్లో తమతోపాటు ఉన్న పిల్లలకు కూడా రేషన్ ఇవ్వాలని పోరాటం ప్రారంభించారు. అనసూయతోపాటు జైలు కొచ్చిన ఆమె పిల్లలిద్దరికీ రేషన్ ఇవ్వాలని, లేకుంటే నిరశన వ్రతం చేస్తామని ప్రభుత్వానికి పిటిషన్ పంపారు. అలా ఆరు రోజులపాటు నిరశన వ్రతం చేశాక ప్రభుత్వం దిగివచ్చి అనసూయ బిడ్డలిద్దరికీ రేషన్ ఇచ్చేందుకు అంగీకరించింది.

జైల్లో మే దినోత్సవాన్ని జరపాలనుకున్నారు. పార్టీపై నిషేధం ఉంది. తమిళనాడు కామ్రేడ్స్‌తోపాటు సూర్యావతి, అనసూయ తదితరులు మే దినోత్సవాన్ని జరిపి తీరాలనుకున్నారు. కానీ జెండా లేదు. ఎలా? సూర్యావతి ఎర్రరంగు వస్త్రం, అనసూయ తెల్ల వస్త్రం తెప్పించారు. జానకి అమ్మాళ్ వాటితో రహస్యంగా జెండాను తయారు చేశారు. మే డే రోజున

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ఆదర్శ కమ్యూనిస్టు అన్నే అనసూయ
యు. రామకృష్ణ ............... 2

2. ఆంధ్ర ప్రదేశ్‌లో పోరాటాల ఉధృతి .. 4

3. వెలుతురు కోసం చీకటివైపు చూశాం
ఇరినా మాలెంకో్.............. 8

4. చైనా ఆధునికాభివృద్ధికి సిపిసి కృషి
ఎం.వి.ఎస్. శర్మ............ 12

5. సామాజిక సమస్యలు-సైద్ధాంతిక స్పష్టత
ఎస్. వీరయ్య ............... 14

6. మళ్లీ ఏకధృవ ప్రపంచం కోసం కలలు
ఎస్. వెంకట్రావు ............ 16

7. విఫలమైన ఆధార్
జీన్ డ్రెజ్, రితికా ఖేరీ,
నజీర్ ఖలీద్, అన్‌మోల్ సోమంచి 20

8. అక్టోబర్ విప్లవం - జాతీయోద్యమం
ఆర్. విజయకుమారి........ 23

9. సామాజికాభివృద్ధిలో వెనుకబడ్డ గుజరాత్
టికె రాజాలక్ష్మి, అక్షయ్ దేశ్‌మానే 25

10. అక్బర్‌ను దోషిగా చిత్రిస్తున్న సంఘ్ పరివార్
జియా ఉస్ సలామ్ ........ 30

11. సామాజిక వెనుకబాటును బట్టి రిజర్వేషన్లు ఉండాలి
బి.వి. రాఘవులు ............ 33



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:
**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటోరియల్ 9490099333**
**మేనేజర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# రోబోలు

కృత్రిమ మేధస్సు గల రోబోల యుగం రాబోతోందని, దీంతో సమాజం పెనుమార్పులకు లోనవుతుందని నిపుణుల చెబుతున్నారు. నిజానికి చాలా కాలం క్రితమే రోబోల తయారీ ప్రారంభమైంది. ఆధునిక పరిశ్రమల్లో వీటిని వినియోగిస్తున్నారు కూడా. కానీ ఇప్పుడు కృత్రిమ మేధస్సు సృష్టిలో వస్తున్న అభివృద్ధి మూలంగా మానవులు చేసే అన్ని రకాల ఉత్పాదక పనులు చేసే రోబోలు తయారుకాబోతున్నాయి. మానవులకు ప్రతిరూపాలను మానవుడు తయారు చేసుకుంటాడని చెబుతున్నారు. ఈ కృత్రిమ మేధస్సు అమర్చిన రోబోలు ఫ్యాక్టరీలలో, ఆఫీసుల్లో, వీధుల్లో, ఇళ్లల్లో, సైన్యంలో... ఒకటేమిటి అన్ని రంగాల్లో మనిషి చేసే పనులన్నిటినీ చేస్తాయి. ఈ పరిణామాన్ని స్వాగతించేవారు కొందరైతే దీని వల్ల ఎదురయ్యే ప్రమాదం గురించి మరి కొందరు హెచ్చరిస్తున్నారు.

ప్రమాదాలు రెండు రకాలు. ఒకటి కృత్రిమ మేధస్సు, సృష్టి కర్తకే... అంటే మనిషికే ఎదురు తిరిగితే? అది మనిషికి ఎదురుతిరిగే అవకాశం ఉందని ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ కూడా హెచ్చరించారు. రెండవది, హ్యూమనాయిడ్ రోబోలు అని పిలిచే ఈ కృత్రిమ మేధ కలిగిన రోబోల వల్ల మనషులకు ఉపాధి లేకుండా పోయే అవకాశం ఉంది. కృత్రిమ మేధస్సు ఐటి రంగంలో ఇప్పటికే వేల మంది ఉద్యోగాలు ఊడగొడుతోంది. హ్యూమనాయిడ్ రోబోలను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసి అన్ని రంగాల్లో ప్రవేశపెడితే అప్పుడు మనిషికి పనిలేకుండా పోతుంది కదా! అప్పుడేం చేయాలి?

దీనివల్ల ప్రమాదం ఏమీ లేదని కార్పొరేట్ మేధావులు భరోసా ఇస్తున్నారు. ఒకటి, యువకులు కొత్త టెకాలజీలను నేర్చుకుంటే కొత్త రకం ఉద్యోగాలు వస్తాయి. అంటే కృత్రిమ మేధస్సు అన్ని రకాల పనులు చేసి పెడుతుంటే వాటిని నిర్వహించే పనులను మనుషులు చేస్తారు. అటువంటి టెక్నాలజీలను నేర్చుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు వస్తాయి. రెండవది, ఐటి రంగం విస్తరణ వల్ల కొత్త ఉపాధి అవకాశాలు వచ్చినట్లే కృత్రిమ మేధస్సు విస్తరణ వల్ల కూడా కొత్త ఉద్యోగాలు, ఇప్పటికన్నా ఎక్కువ వేతనాలు వచ్చే ఉద్యోగాలు వస్తాయి....ఈ మేధావులు చెబుతున్న దాన్లో ఒక సమస్య ఉంది. కొత్త టెకాలజీలను నేర్చుకుంటే కొద్దిమందికి ఉద్యోగాలు రావచ్చు. కానీ కోట్ల మంది ఉపాధి కోల్పోతారు. ఉత్పత్తి కార్యకలాపాలన్నీ మనుషులు నిర్వహిస్తుంటేనే నేడు నిరుద్యోగం ప్రబలిపోయింది. రేపు ఆ కార్యకలాపాలు రోబోలు చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు.

రానున్న కొత్త టెక్నాలజీ ఇప్పటిలాగే కార్పొరేట్ల చేతుల్లోనే ఉంటే జరిగే పరిణామం ఏమిటి? ఉత్పత్తి బ్రహ్మాండంగా జరుగుతుంది. కానీ దాన్ని కొనే వారు నిరుద్యోగులైపోతారు. సంక్షోభం ఇప్పటికన్నా బాగా ముదురుతుంది. పోనీ అందరికీ ఉద్యోగాలిద్దామంటే కొత్త టెక్నాలజీ అభివృద్ధినే ఆపేయాల్సి ఉంటుంది. ఆ పని పెట్టుబడిదారులు చేయరు.

అందువల్ల కొత్త టెక్నాలజీ కొత్త పరిష్కారం కోరుతోంది. అది కార్మికవర్గానికి కొత్త అవకాశాలు సృష్టిస్తోంది. ఉత్పత్తి సాధనాలను శ్రామిక వర్గం స్వాధీనం చేసుకోవడమే ఆ పరిష్కాం. అప్పుడు ఇబ్బడి ముబ్బడిగా అయ్యే ఉత్పత్తి అంతా శ్రామికులకు చెందుతుంది. వారి అవసరాలు తీరుస్తుంది. కొత్త టెక్నాలజీ వారి శ్రమ కాలాన్ని బాగా తగ్గిస్తుంది. కనుక వారికి సాంస్కృతికంగా, మానసికంగా వికసించడానికి కావలసినంత సమయం లభిస్తుంది.

కాబట్టి కొత్త టెక్నాలజీ విప్లవానికి కొత్త అవకాశాలు సృష్టిస్తుంది. కార్మికవర్గం దానికి సిద్ధం కావాలి!


**చందా వివరాలు**
విడిప్రతిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**సిపిఐ(ఎం) మహాసభల దిశగా...**

# ఆంధ్ర ప్రదేశ్‌లో పోరాటాల ఉధృతి



కొవ్వాడ అణు విద్యుత్ కేంద్ర వ్యతిరేక పోరాటం

ఆంధ్ర ప్రదేశ్‌లో గత మహాసభ నుండి నేటివరకు సిపియం పార్టీ కోల్‌కత ప్లీనం వెలుగులో ప్రజాఉద్యమాలకు, పోరాటాలకు తీవ్రంగా ప్రయత్నించింది. తుందుర్రు, కంసాలిబేతపూడి, జొన్నల గర్వు గ్రామాల మధ్య తుందుర్రు మెగా ఆక్వా ఫుడ్స్ నిర్మించడం వలన తీవ్రమైన కాలుష్య సమస్య ఉత్పన్నం అవుతుందని ప్రజలు వ్యతిరేకించారు. ఈగ్రామాలే కాక తీరప్రాంత మత్స్యకార గ్రామాల ప్రజలు మరింత నష్టపోతారు. 2015 నవంబర్ 17న ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. 2016 జనవరి 22న 1500 మంది ప్రజలతో కలిసి ఫ్యాక్టరీ పనులు నిలిపివేశారు. తీవ్రమైన లాఠీచార్జి చేసి 70 మందిని గాయపర్చారు. 60 మందిపై 307 సెక్షన్లతో సహా అనేక సెక్షన్లతో క్రిమినల్ కేసులు పెట్టారు. 9 మందిని 35 రోజులు జైల్లో పెట్టారు. సంవత్సరాల తరబడి సెక్షన్ 30 మరియు 144 లను అమలు జరుపుతున్నారు. భారీ ఎత్తున పోలీసులను మోహరించి చంద్ర బాబు ప్రభుత్వం ప్రజలపై నిర్బంధం విధించినా సిపియం పార్టీ ప్రజల మద్దతుతో నిరంతరం కార్యక్రమాలు చేస్తూనే ఉన్నది. అనేక విధాల ప్రజలను చైతన్య పర్చి ఉద్యమాన్ని నడుపుతున్నది. ప్రజలు మొక్కవోని పట్టుదలతో, ముఖ్యంగా మహిళలు ముందుండి పోరాడుతున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు గ్రామం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని దళితులు ప్రతిష్టించడాన్ని అగ్రకుల దురహంకారులు సహించలేకపోయారు. అత్యంత దుర్మార్గంగా సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. ఈ కులవివక్షకు వ్యతిరేకంగా దళితులు చేస్తున్న ఉద్యమంలో సిపియం పార్టీ భాగస్వామి అయ్యింది. క్రమేణా అన్ని దళిత సంఘాలు ఉద్యమంలో భాగస్వాములు కావడంతో ఉద్యమం విశాలమైంది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దళిత శోషణ్ ముక్తిమంచ్ అఖిల భారత నాయకులు వి.శ్రీనివాసరావు గార్లు ఉద్యమంలో పాల్గొన్నారు. జిల్లావ్యాపిత ఉద్యమంగా మారింది. రాష్ట్ర వ్యాపిత సంఘీభావం వ్యక్తమయింది. సిపియం కార్యకర్తలు రోజుల తరబడి గ్రామంలో ఉండి ప్రజలకు అండగా నిలిచారు. ప్రభుత్వం నష్టనివారణా చర్యల్లో భాగంగా మంత్రుల బృందం, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ల పర్యటనలు చేశారు. కౌలు భూములు తిరిగి ఇవ్వకపోయినా నష్టపరిహారం చెల్లింపు, కొన్ని అభివృద్ధి, సంక్షేమ చర్యలు తీసుకుంది. ఉద్యమం పాక్షికంగా విజయం సాధించింది. విశాల సంఘీభావమే ఉద్యమ విజయంలో కీలకం.

తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం పంపాదిపేటలో దివీస్ మందుల కంపెనీని నిర్మించడానికి పూనుకున్నారు. కంపెనీ వలన చుట్టు పక్కల తీవ్రమైన కాలుష్యం వెదజల్లబడుతుంది. సముద్రంలో మత్స్య సంపద నశించిపోతుంది. చుట్టూ ఉన్న హేచరీస్ దెబ్బతిని కార్మికులు ఉపాధి కోల్పోతారు. భూసేకరణ వలన మూడు గ్రామాల రైతులు భూములు కోల్పోతారు. వ్యవసాయ కార్మికులకు పనులు పోతాయి. నష్టపోయే ప్రజలందరినీ సిపియం పార్టీ నాయకత్వం సమీకరించి 2016 ఆగస్టు నుండి 2017 మార్చి వరకు పోరాడింది. సిపియం తగిన ఎత్తుగడలతో ఎప్పటికప్పుడు పోలీసుల వ్యూహాలను చిత్తు చేస్తూ, ప్రజలను సమీకరించి సమరశీల పోరాటం చేసింది. చివరికి ఫ్యాక్టరీ నిర్మాణం ఆగింది. ప్రజల మధ్యనే ఉండి ప్రజలను చైతన్యపరిస్తే పోలీసు నిర్బంధాన్ని సైతం తట్టుకుని విజయం సాధించగలమని ఈ పోరాటం రుజువు చేసింది.

శ్రీకాకుళం జిల్లా వంశధార ఫేజ్ 2 ప్రాజెక్టు నిర్మాణం 2005లో ప్రారంభించారు. 11వేల కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. కానీ ప్రభుత్వం 12 ఏళ్ళ కాలంలో 3600 మందికే పునరావాస కాలనీల్లో ఇళ్ళ స్థలాలు కేటాయించింది. మిగతా నిర్వాసితులంతా ఆపీసుల చుట్టూ తిరిగారు. ప్రభుత్వ పట్టించుకోలేదు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. ప్రజలు నిరాశానిస్పృహల్లో ఉన్న పరిస్థితుల్లో సిపియం నాయకత్వం గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని ప్రజలను కదిలించే ప్రయత్నం చేసింది. పార్టీలపైన, నాయకులపైన ప్రజలు విశ్వాసం కోల్పోయి ఉన్నారు. అయినా సిపియం నాయకత్వం పట్టువదలకుండా గ్రామాల్లో ప్రజలను కలుసుకుని, వారికి విశ్వాసం కల్గించే ప్రయత్నం చేసింది. ఆరు నెలల పాటు చేసిన కృషి ఫలితంగా 1000మంది నిర్వాసితులు కదిలి, పునరావాసం పూర్తయ్యేంతవరకు పనులు జరగనిచ్చేది లేదని ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. అయినా 3 నెలలు చంద్రబాబు ప్రభుత్వం స్పందించలేదు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండానే, నిర్వాసితులతో చర్చించకుండానే చంద్రబాబు ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 28న 1000 మంది పోలీసుల పహారాలో పనులు ప్రారంభించింది. సిపియం నాయకత్వం గ్రామాలకు వెళ్లి ప్రజలను కదిలించడంతో మరురోజు 29న 2500 మంది నిర్వాసిత ప్రజలు కర్రలు, బరిసెలతో ప్రాజెక్టు

పనులు అడ్డుకునేందుకు బయలేర్దగా పనులు చేస్తున్న కాంట్రాక్టరు, పర్యవేక్షిస్తున్న ఇరిగేషన్ అధికారులు పారిపోయారు. ప్రభుత్వంలో కదలిక వచ్చింది. జులైలో 7600 మందికి 421 కోట్లు ఆర్&ఆర్ ప్యాకేజి ప్రభుత్వం ప్రకటిం చింది. అది చట్టవిరుద్ధమైనా దీర్ఘకాలం వేచి చూస్తున్న ప్రజలు దాన్ని అంగీకరించారు. ఇదిగో, అదిగో ఈ నెల, ఆ నెల అంటూ 2017 జనవరి వరకు ప్రకటించిన ప్యాకేజి ఇవ్వనేలేదు. దాంతో ఆగ్రహం చెందిన నిర్వాసితులు 8 వేలమంది కర్రలు, బరిసెలతో కదిలి మొత్తం కాంట్రాక్టరు ఆస్థులన్నీ ధ్వంసం చేసి ప్రభుత్వానికి తడాఖా చూపించారు. చంద్రబాబు నిర్వాసితులకు క్షమాపణలు చెప్పి వెంటనే 421 కోట్లు విడుదల చేశారు. సమరశీల పోరాటాలతో, ఐక్యతతో ప్రజలు సాధించిన ఘనవిజయం ఇది. నిర్వాసితులపై కక్షబూనిన చంద్రబాబు ప్రభుత్వం ప్రలోభపెట్టి, భయపెట్టి స్థానిక టిడిపి నాయకులను లొంగదీసుకుని 3 వేలమంది పోలీసులను 3 నెలలు మోహరించి ప్రజలను నిర్బంధించి చివరికి ఇళ్ళను కిరాతకంగా కూలగొట్టింది. నిర్వాసితుల సంఘం నాయకునిపై 14 కేసులు బనాయించి రౌడీషీట్‌ను తెరచింది. 7గురు సిపియం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మరో 8 మంది పూర్తికాలం కార్యకర్తలను దాదాపు 45 రోజులు జైళ్ళలో నిర్బంధించింది. 50 మంది నిర్వాసితులను కూడా జైల్లో పెట్టింది.

అయినా ఉద్యమాన్ని మొక్కవోని పట్టుదలతో సిపియం నాయకత్వం నడిపింది. నిర్వాసిత గ్రామాల్లో పర్యటనకు వచ్చిన సిపియం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులను రెండు రోజులు నిర్బంధించింది. సిపియం, సిపిఐ పార్లమెంటు సభ్యులు పర్యటించి నిర్వాసితుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరనుండి ఇప్పటివరకూ శ్రీకాకుళం జిల్లాలో సెక్షన్ 30 అమలులో ఉంది. వంశధార గ్రామాల్లో సెక్షన్ 144 అమలులో ఉంది. సిపియం పార్టీ నాయకులు, కార్యకర్తలు హిరమండలానికి వెళ్ళకుండా నిషేధం విధించారు. సమస్య తీవ్రతను గుర్తించి ప్రజలు కదిలేంతవరకు కృషి చేస్తే ప్రజలు కదులుతారని వంశధార రుజువు చేసింది. ప్రజలు ఐక్యంగా వుంటే విజయం తథ్యం. విడిపోతే ఓటమి తప్పదనే గుణపాఠం నేర్పింది. బూర్జువా పార్టీ నాయకులు ప్రలోభాలకు, ఒత్తిడిలకు లొంగిపోతారని తేలింది.

**“స్కూళ్ళలో, కాలేజిల్లో, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఆఫీసుల్లో అధికార్లు, ఉద్యోగులు, డాక్టర్లు, సిబ్బందిని కొంతమేరకు నియమించింది. ఆర్డీవో ఆఫీసును తెరిచింది. బస్సులు కొంత మేరకు పెంచింది. చింతూరులో ఐటిడిఎను ఏర్పరచింది. నిరాశ నిస్పృహల్లో వున్న ప్రజలను కదిలించి పోరాడితే సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ ఉద్యమం తెలియజెప్పింది.”**



విశాఖ మన్యంలో బాక్సైట్ వ్యతిరేక పోరాటం

రాష్ట్ర విభజనతో కూనవరం, చింతూరు, వి.ఆర్.పురం, ఎటపాక, కుకనూరు, వేలేరుపాడు మండలాలు తెలంగాణ నుండి ఎపికి బదిలీ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులంతా తెలంగాణకు వెళ్ళిపోయారు. చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో స్కూళ్ళలో టీచర్లు, కాలేజిల్లో లెక్చరర్లు, ఆఫీసులో అధికార్లు, ఉద్యోగులు, డాక్టర్లు మొత్తం ఖాళీ. ప్రజల కష్టాలకు అంతులేదు. చెప్పుకునే దిక్కులేదు.. సరిగ్గా ఈ నేపథ్యంలో సిపియం నాయకత్వం పర్యటించి సమస్యల తీవ్రతను గుర్తించి పోరాటాలకు పిలుపునిచ్చింది. 2015 ఆగస్టు నుండి ప్రజలను కదిలించి బంద్‌లతో సహా అనేక రూపాల్లో పోరాటాలు చేయటంతో ప్రభుత్వంలో కొంత కదలిక వచ్చింది. స్కూళ్ళలో, కాలేజిల్లో, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఆఫీసుల్లో అధికార్లు, ఉద్యోగులు, డాక్టర్లు, సిబ్బందిని కొంతమేరకు నియమించింది. ఆర్డీవో ఆఫీసును తెరిచింది. బస్సులు కొంత మేరకు పెంచింది. చింతూరులో ఐటిడిఎను ఏర్పరచింది. నిరాశ నిస్పృహల్లో వున్న ప్రజలను కదిలించి పోరాడితే సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ ఉద్యమం తెలియజెప్పింది.

పోలవరం ప్రాజెక్టులో 396 గ్రామాల్లో దాదాపు 2 లక్షల మంది ప్రజలు 80 వేల కుటుంబాలు మునిగిపోతాయి. నేటికీ 14 గ్రామాల్లో 2000 కుటుంబాలకు కూడా కాలనీలు నిర్మించలేదు. భూమికి భూమి ఇవ్వలేదు. భూమికి పరిహారం ఇవ్వలేదు. ఎల్‌టిఆర్ భూములనే నిర్వాసితుల పునరావాసానికి కేటాయిస్తున్నది. ప్రభుత్వ భూమికి, పోడు భూమికి పరిహారం ఇవ్వలేదు. 2013కి ముందు సేకరించిన భూమికి 2013చట్టం వర్తించదని ప్రకటించింది. కాలువలకు సేకరించే భూములకు ఎకరాకు 30 లక్షల నుండి 52 లక్షలు చెల్లిస్తున్న ప్రభుత్వం ముంపు భూమికి మాత్రం 6.5 లక్షలే ఇస్తానన్నది. పది, ఇరవై గ్రామాలు మునిగే పెద్దగెద్ద, తోటపల్లి, పులిచింతల, వెలుగొండ, వంశధారలో పునరావాసం కల్పించలేని ప్రభుత్వం 2018/19 నాటికి 80 వేల కుటుంబాలకు పునరావాసం కల్పించడం కల్ల. గనుక ప్రజలు కదిలి పోరాడి సాధించుకోవాలని సిపియం చైతన్యపర్చేందుకు కృషి చేసింది. 400 మంది నిర్వాసితులతో పోలవరం పనులు 4 గంటలు అడ్డుకున్నాం. సిపియం నాయకత్వం 25 రోజులు 280 గ్రామాల్లో పాదయాత్ర చేసి చింతూరులో 8వేల మందితో సభ జరిపింది. ఈ సభలో కా॥ బృందాకరత్ పాల్గొన్నారు. 7 వేలమందితో చట్టి హైవేను దిగ్బంధం చేసింది. ప్రజల్లో

> **"కా॥ బృందాకరత్, బివి.రాఘవులు, మధుగార్లు పర్యటించి ప్రజలకు ధైర్యం కల్పించారు. ఫలితంగా 2500 ఎకరాలకు పరిమితమైంది. మొదట ఎకరాకు 10 లక్షలిస్తామన్నది తరువాత 30 లక్షలకు పెంచింది. వై.ఎస్.ఆర్ పార్టీ నిర్బంధానికి నిల బడలేకపోయింది. ప్రజలు తిరగబడితే రాయితీలు సాధించవచ్చునని అనుభవం వచ్చింది."**



దేవరపల్లిలో దళితుల భూముల్లో తవ్విన చెరువును పూడుస్తున్న నాయకులు

కదలిక తెచ్చింది. అన్ని పార్టీల వెనుక ఉన్న ప్రజలను కదిలించే ప్రయత్నం చేసింది. ఫలితంగా 6.5 లక్షలు ఇస్తామన్న పరిహారం 10.5 లక్షలకు పెంచింది. పునరావాసం సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వద్ద తగిన ప్రణాళిక లేదు. ఈ నేపథ్యంలో ప్రజలను కదిలించి మరింత సమర శీలంగా పోరాడాల్సి ఉందని పార్టీ గుర్తించింది. ఆ దిశలో అన్ని యత్నాలు చేస్తున్నది.

ప్రకాశం జిల్లా వెలుగొండ నిర్వాసితుల పునరావాసానికై ప్రకాశం జిల్లా కమిటీ అనేక కార్యక్రమాలు, పోరాటాలు చేసింది. అధికార్లు హామీలు ఇస్తున్నా ఎటువంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేదు. కడప జిల్లా గండికోట నిర్వాసితులకు పునరావాస కాలనీలు ఏర్పాటు చేయలేదు. గ్రామాలు ఖాళీ చేయలేదు. ఇళ్ళలో నిర్వాసితులు నివాసం వుండగానే చంద్రబాబు ప్రభుత్వం ప్రాజెక్టులో నీళ్ళు పెట్టేసింది. నిర్వాసితులు హైదరాబాద్ – కడప హైవేను 2 రోజులు దిగ్బంధిస్తే తప్ప ప్రభుత్వం ప్యాకేజి ప్రకటించలేదు. ఈ దిగ్బంధంలో పార్టీ నాయకత్వం అగ్రభాగాన నిలిచింది. నిర్వాసిత ప్రజలు పోరాడితే పునరావాసం, నష్టపరిహారం లేకుంటే జల సమాధేనని ఈ అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.

భోగాపురం ఎయిర్‌పోర్టు కొరకు చంద్రబాబు ప్రభుత్వం 15 లక్షల ఎకరాల భూమిని సేకరించేందుకు సిద్ధమైంది. బలవంతంగా భూములు లాక్కునేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. సిపియం కలుగజేసుకుని జిల్లాలో పూర్తి కాలం కార్యకర్తలందరినీ సమీకరించి ప్రజల్లో ప్రచారం చేసి పోరాడింది. కా॥ బృందాకరత్, బివి.రాఘవులు, మధుగార్లు పర్యటించి ప్రజలకు ధైర్యం కల్పించారు. ఫలితంగా 2500 ఎకరాలకు పరిమితమైంది. మొదట ఎకరాకు 10 లక్షలిస్తామన్నది తరువాత 30 లక్షలకు పెంచింది. వై.ఎస్.ఆర్ పార్టీ నిర్బంధానికి నిలబడలేకపోయింది. ప్రజలు తిరగబడితే రాయితీలు సాధించవచ్చునని అనుభవం వచ్చింది.

బందరు పోర్టుకు 30 వేల ఎకరాల భూ మిని ప్రభుత్వం సేకరించడానికి పూనుకున్నది. అన్ని పార్టీలతో అఖిలపక్షంగా ఏర్పడి ప్రభుత్వ భూముల్లోనే పోర్టు నిర్మించాలని, ఇండస్ట్రియల్ కారిడార్ అంగీకరించమని డిమాండ్ చేయడం జరిగింది. పేదల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములకు నష్టపరిహారం ఇచ్చి తీసుకోవాలని సిపియం డిమాండ్ చేసింది. శ్రీకాకుళం జిల్లాలో భావనపాడు పోర్టు నిర్మిస్తామని ప్రభుత్వ ప్రకటనతో సిపియం కదిలి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. ప్రజలు ప్రతిఘటించారు.

అనంతపురం జిల్లా ఎన్‌పి కుంట, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో ప్రభుత్వం సోలార్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టింది. నష్టపరిహారం చెల్లించకుండా పనులు ప్రారంభించడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు ఆందోళన చేస్తున్నారు. సిపియం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి కా॥ ప్రకాష్ కరత్ ఆ రెండు ప్రాంతాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం పోలీసులు అడుగడుగునా ఆటంకాలు కల్పిం చినా పర్యటన జయప్రదంగా జరిగింది. దీంతో భూములు కోల్పోయిన రైతులు, ప్రజలలో విశ్వాసం పెరిగింది.

శ్రీకాకుళం జిల్లా పోలాకిలో థర్మల్ ప్లాంట్‌కు బలవంతపు భూసేకరణకు చంద్రబాబు ప్రభుత్వం పూనుకోగా సిపియం ప్రజలను కదిలించి పోరాడింది. రాష్ట్ర కార్యదర్శి పర్యటనకు వచ్చిన సందర్భంలో అక్రమ అరెస్టు చేసింది. నిరసన తెలియజేసిన నాయకులు, కార్యకర్తలు 50 మందిపై అక్రమ కేసులు బనాయించింది. పోరాటాల ఫలితంగా ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గింది. మరలా ప్రభుత్వం భూసేకరణకు పూనుకొంటే అడ్డుకునేందుకు పార్టీ సిద్ధంగా ఉండాలి.

విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం బోడికొండ, బడిదేవర కొండల్లో గ్రానైట్ త్రవ్వకాల వలన 20 గిరిజన గ్రామాలు, మైదానప్రాంతంలోని మరో 20 గ్రామాలకు సాగునీరు సమస్య ఉత్పన్నం అవుతుంది. సిపియం చొరవ తీసుకుని వామపక్ష పార్టీలను కలుపుకుని పోరాడింది. ప్రజలు గ్రానైట్ యంత్రాలను ధ్వంసం చేశారు. పార్టీ డివిజన్ కార్యదర్శితో సహా 10మందిపై కేసులు పెట్టి జైలులో పెట్టారు. సభలు, సంఘీభావ సభలు తదితర అనేక రూపాల్లో ప్రచారం జరిగింది. గ్రానైట్ తవ్వకాలు ఆగాయి.

కర్నూలు జిల్లాలో శకునాల, గనిలో పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం బలవంతపు భూసేకరణను పార్టీ అడ్డుకుంది. కా॥ బి.వి. రాఘవులు, పి.మధు గార్లు పర్యటించారు. పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. ప్రకాశం జిల్లా పర్చూరు మండలం దేవరపల్లి గ్రామంలో 70 ఏళ్ళుగా దళితుల సాగులో ఉ

న్న భూమిని చెరువు భూమిగా నిర్ణయించి త్రవ్వేసిన నేపధ్యంలో సిపియం ముందుండి దళితులందరినీ సమీకరించి పోరాడింది. పోలీసు చెక్‌పోస్టులు పెట్టినా సిపియం నాయకత్వం ప్రత్యక్షంగా అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఉద్యమానికి విశాలమైన సంఘీభావం కూడ గట్టడంతో ఇరుకున పడ్డ ప్రభుత్వం వెనక్కు తగ్గింది.

అనంతపురం జిల్లాలో దళిత స్మశాన స్థలాల సమస్యలపై మే 16న తహసీల్దార్ కార్యాలయాల ముందు ''చావు డప్పు'' కార్యక్రమాన్ని 42 మండలాల్లో నిర్వహించారు. ఇందులో 184 గ్రామాల నుండి 1236 మంది పాల్గొన్నారు. 120 డప్పులతో కొత్తవారు పాల్గొన్నారు. 4 మండలాల్లో దండోరా సంఘం మద్ధతుగా పాల్గొన్నది. మన ఆందోళనల వల్ల స్మశాన స్థలాలు చూపేందుకు ఆర్ఐ సర్వేలకు నిర్ణీత సమయం ప్రకటించాడు. ఈ సమస్యపై జాయింట్ కలెక్టర్ తహసీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించాడు. ఇదే సమస్యపై మే 27, 28 తేదీల్లో ఆర్డీవో ఆఫీసుల ముందు సామూహిక నిరవధిక దీక్ష చేపట్టారు. వరుస కార్యక్రమాల మూలంగా కొన్ని ఫలితాలు సాధించుకోగలిగాం.

> ❝ప్రజలకు సమస్య ఉన్నప్పుడు పార్టీలతో నిమిత్తం లేకుండా పోరాటాల్లోకి వస్తారని ఈ పోరాటాలన్నింటి అనుభవం. పార్టీ లేకపోయినా ప్రజల సమస్యలపై పట్టుదలతో ప్రజలు కదిలేంత వరకూ కృషి చేస్తే ప్రజలు కదిలి పోరాడుతారని వంశధార నిర్వాసిత పోరాటం అనుభవం.❞



అనంతపురం సోలార్ ప్లాంట్ వ్యతిరేక పోరాటం

చిత్తూరు జిల్లా మహాభారతంలో దళితులను భాగస్వాములను కానివ్వకుండా చేసి అగ్రకుల దురహంకారులు వివక్షను చూపుతున్నారు. వివక్షను ఎదుర్కోవాలని సిపియం నిర్ణయించింది. 3 నెలలపాటు ప్రజలను చైతన్యపర్చి కూడగట్టే ప్రయత్నం చేసింది. అఖిల భారత నాయకత్వంతోపాటు రాష్ట్ర నాయకత్వం అనేక జిల్లాలనుండి సిపియం కార్యకర్తలను కదిలించి పోరాడింది. ఫలితంగా అధికారులు దిగివచ్చి మహాభారతంలో దళితులను భాగస్వాములుగా చేస్తామని ఒప్పందానికి వచ్చారు. సామాజిక న్యాయం కోసం సిపియం చేస్తున్న కృషిని చిత్తూరు జిల్లా దళితులు కొనియాడారు.

ఆక్వా చెరువుల సమస్యపై తూర్పు కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో విశాలమైన, సమరశీలమైన ఉద్యమం నడిచింది. అక్రమ రొయ్యల చెరువులను రద్దు చేయాలనీ, దళితుల నుండి అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూములను వారికి ఇచ్చేయాలనీ, ఆక్వా కాలుష్యాన్ని నివారించాలని పార్టీ ఉద్యమించింది. ఆక్వా వలన పేదలు పనులు కోల్పోయారు. భూములు చౌడుదేరుతున్నాయి. తాగునీరే లేని పరిస్థితి దాపురించింది. అన్ని విధాల వినాశకరమైన ఆక్వా సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. మన ఉద్యమం ఫలితంగా అక్రమ చెరువులకు గండ్లు కొట్టేందుకు అధికారులే పూనుకోవలసి వచ్చింది.

బాక్సైట్ మైనింగ్ చేయనని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 97 జీవో ఇచ్చి బాక్సైట్ మైనింగ్‌కు పూనుకున్నారు. వెంటనే సిపియం స్పందించి గిరిజనులను పెద్ద యెత్తున కదిలించి పోరాడింది. కా॥ బృందా కరత్ కూడా వేలాదిమందితో జరిగిన చింతపల్లి సభకు హాజరయ్యారు. గిరిజన ప్రజలనుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో చంద్రబాబు ప్రభుత్వం తాత్కాలికంగా జీవోను ప్రక్కన పెట్టింది. మరల అనుకూల పరిస్థితుల్లో అదే జీవోను ముందుకు తెస్తుంది. సదా అప్రమత్తంగా ఉండాలని సిపియం ప్రజలకు పిలుపునిస్తున్నది.

స్థానిక సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటాలు, ఉద్యమాలు పార్టీకి ప్రజల్లో గుర్తింపు పెరగటానికి, పలుకుబడి విస్తరణకు తోడ్పడ్డాయి. ఉద్యమ సంబంధాలను పార్టీ, సంఘాల నిర్మాణంలో ఇముడ్చుకునే కృషి చేయాల్సి వుంది. రాజకీయ, సిద్ధాంత ప్రచారం జోడించి ప్రజా పునాదిగా మల్చుకునే కృషి చేయాలి.

ప్రజలకు సమస్య ఉన్నప్పుడు పార్టీలతో నిమిత్తం లేకుండా పోరాటాల్లోకి వస్తారని ఈ పోరాటాలన్నింటి అనుభవం. పార్టీ లేకపోయినా ప్రజల సమస్యలపై పట్టుదలతో ప్రజలు కదిలేంత వరకూ కృషి చేస్తే ప్రజలు కదిలి పోరాడుతారని వంశధార నిర్వాసిత పోరాటం అనుభవం. ప్రజలు పోరాడుతున్న సమస్యల్లో పార్టీ జోక్యం చేసుకుంటే పోరాటాన్ని సమరశీలంగా మార్చవచ్చని తుందుర్రు, తొండంగి అనుభవం. సర్వే చేసి సమస్యను గుర్తించి ప్రజలను కదిలించి పోరాడవచ్చునని మహాభారతం రుజువు చేసింది. ప్రజల మద్దతు ఉన్నంతకాలం ప్రభుత్వం మన జోలికి రాలేదని అన్ని సందర్భాలలోనూ రుజువవుతున్నది. మనకు సంబంధాలు లేవు గనుక ఏమీ చేయలేమనే ఆలోచన తప్పని రుజుయ్యింది. ఈ అనుభవాలను గమనంలో ఉంచుకుని ప్రజాపోరాటాలను సృష్టించగలం. రాబోయే కాలంలో కార్యకర్తలు మరిన్ని స్థానిక సమస్యలను తీసుకుని పోరాటాలను విస్తరించాల్సి వుంది. వచ్చే పార్టీ మహాసభల్లో ఈ అనుభవాలను సమీక్షించుకొని, గుణపాఠాలు తీసి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేయడం జరుగుతుంది. ❊

# వెలుతురు కోసం చీకటివైపు చూశాం

**ఇరినా మాలెంకో**



సోవియట్ రచయిత్రి

**(ఇరినా మాలెంకో సోవియట్ రచయిత్రి. అక్టోబరు విప్లవ శత వార్షికోత్సవ సందర్భంగా సెప్టెంబరు 23, 2017న అమ్ స్టర్ డ్యామ్‌లో ఆమె చేసిన ప్రసంగ పాఠం ఈ దిగువనిస్తున్నాను. సోవియట్ యూనియన్ కూలిపోతున్నప్పుడు ఆమె రష్యాలో యూనివర్సిటీలో చదువుతోంది. కూలిపోయిన తర్వాత ఐర్లాండు, నెదర్లాండులాంటి పెట్టుబడిదారీ దేశాలలో చదువుకుంది. ఆ విధంగా ఆమె 'రెండు ప్రపంచాలూ' చూసింది. ఈ రెండు ప్రపంచాలను పోలుస్తూ, సోవియట్ యూనియన్‌లోని జీవితాన్ని వర్ణిస్తూ ఆమె 'సోవియటికా' అనే పుస్తకం రాసింది. మూడు భాగాలుగా ఉన్న ఈ పుస్తకం దాదాపు 1500 పేజీలుంటుంది. మొదటి భాగం ఇంగ్లీషులోకి అనువదించబడింది. నెట్‌లో ఉచితంగా డౌన్లోడు చేసుకోవచ్చు)**

నేను సోవియట్ యూనియన్ లో పుట్టి పెరిగాను కాని దీని పూర్తి అర్థం ఏమిటో, ప్రాముఖ్యత ఏమిటో, నా దేశం, మా సోషలిస్టు జీవన విధానం నాశనమయ్యేవరకూ నేను గుర్తించలేదు. నేనూ నా తరం, ఎక్కడో కాకుండా సోవియట్ యూనియన్‌లో, ముందూ వెనుకా కాకుండా ఆ కాలంలో, పుట్టడం నిజంగా ఎంత అదృష్టమో అర్థం చేసుకోవడానికి నాకు మరి కొన్ని సంవత్సరాలు పట్టింది. నా దేశం అదృశ్య మైనా నేనింకా ఒక సోవియట్ వ్యక్తినేననీ సోవి యట్ వ్యక్తిగానే ఉంటాననీ అర్థం చేసు కోవడానికి మరికొంత కాలం పట్టింది. ఇప్పుడు నేను నెర వేర్చాల్సిన బాధ్యత ఒకటుంది: యు.యస్.యస్. ఆర్ లో సోషలిస్టు జీవిత వాస్తవాల గురించి యువతరానికి చెప్పాలి. ప్రపంచంలో ఇంకా మిగిలి ఉన్న సోషలిస్టు దేశాలకూ ప్రపంచంలో సోషలిజం కోసం ఇంకా పోరాటం చేస్తున్న వారికీ సాధ్యమైన సహాయం చెయ్యాలి. ఇది మా పవిత్ర కర్తవ్యంగా నేను భావిస్తున్నాను. ఎందుకంటే 20 సంవత్సరాల క్రితం మేం మా సోషలిజాన్ని సరిగ్గా కాపాడుకోలేదు, మేం సాధించినదంతా కోల్పోయాం. నా దేశం తనకు స్నేహితులుగా ఉంటున్న వారికీ, ఇతర దేశాల లోని మిత్రులకూ ద్రోహం చేసింది, ఇంకా చేస్తూనే ఉంది. ఎవరో ఒకరు విషయాలను సరిదిద్దాలి. సామాన్య సోవియట్ వ్యక్తి గడిపిన సామాన్య సోవియట్ సోషలిస్టు జీవితం గురించి నేను 2008–2009 సంవత్సరాలలో ఒక పుస్తకం రాయడం ఈ కర్తవ్య పాలనలో మొదటి అడుగు మాత్రమే.

నేను మా విప్లవం 50వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సంవత్సరంలో పుట్టాను. అప్పుడు ఎవ్వరూ, ఎంత భయంకరమైన పీడకలలో కూడా మరో 25 సంవత్సరాలు ముగియకుండానే సోవియట్ యూనియన్ అంత మైపోతుందని ఊహించలేదు. జీవితం చాలా ప్రశాంతంగా, సురక్షితంగా ఉండేది. నా తల్లి దండ్రులకు నేనొక్కత్తేనే బిడ్డను. మాస్కోకు సమీ పంలో అంతా పెద్దా కాని అంత చిన్నా కాని ఒక పారిశ్రామిక పట్టణంలో నేను పెరిగాను.

మా పూర్వీకులంతా లోహ కార్మికులు, ఆయుధాలు తయారు చేసేవారు. మా కుటుంబం అనేక తరాలుగా అక్కడే ఉంది. సోషలిస్టు విప్లవం ప్రసాదించిన అవకాశాల కారణంగా మా తల్లిదండ్రుల తరం మా కుటుంబంలో తొలిసారిగా ఇంజినీర్లయ్యారు. సోషలిజంలో విజయాలు పూర్తిగా శక్తిసామర్థ్యాల మీదా కష్టపడి పని చెయ్యడం మీదా ఆధారపడి ఉండేవి. విప్లవానికి ముందు మా అమ్మమ్మ అన్న 9 సంవత్సరాల వయసులో ఒక ఫ్యాక్టరీలో పని చెయ్యడం మొదలు పెట్టాడు. మా కాలంలో బాల కార్మికులు అనే వారు ఉంటారని మేం ఊహించనుకూడా ఊహించలేకపోయాం. అతను 17 సంవత్సరాల వయసులో బోల్షివిక్ పార్టీలో చేరాడు. పార్టీలో చేరడానికి ముందు కూడా 1905 నాటి మొదటి రష్యన్ విప్లవంలో మా అమ్మమ్మ అమ్మ సోదరులిద్దరూ కూడా పాల్గొన్నారు. ఫ్యాక్టరీ యజమాని ఇంటి కిటికీ అద్దాలు పగుల గొట్టినందుకు వారిని అరెస్టు చేశారు. పదిమంది పోలీసులు ఈ ఇద్దరినీ మరొక గ్రామానికి తీసుకు వెదుతుండగా దారిలో ఇద్దరూ తప్పించుకు పారిపోయి అదే ఇంటి కిటికీ అద్దాలు మళ్ళీ పగలగొట్టారు.

ఇప్పుడు నేను వాళ్ళిద్దరి గురించీ తరచు ఆలోచిస్తుంటాను. పరిస్థితులు ఎలా ఉన్నా నువ్వు నమ్మిన దాని కోసం పోరాడమనీ, ఎన్నడూ పోరాటం విరమించవద్దనీ వారి ఉదాహరణ నన్ను ప్రేరేపిస్తూ ఉంటుంది. మరో ఐరిష్ విప్లవ కారుడు మైఖేల్ కాలిన్స్, "నువ్వు పరిగెట్టాలని వాళ్ళు ఆశిస్తు న్నప్పుడు ఎందుకు పరిగెడతావు?" అన్నాడు.

చిన్నప్పుడు నేను విప్లవ హీరోల గురించీ అంతరిక్ష యానం గురించీ కలలు కనేదాన్ని. అప్పుడు మాలో చాలామందిమి కాస్మోనాట్స్ అవ్వాలనుకునే వాళ్ళం. నేను కూడా ఒక అంత రిక్ష నౌక కెప్టెన్ అయినట్లు ఊహించుకునే దాన్ని. మాలో ఎవ్వరం కూడా ఫొటో మోడల్స్ అవ్వా లని కాని పాప్ స్టార్స్ అవ్వాలని కాని కోరుకో లేదు. మా అమ్మ చాలా అందంగా ఉండేది. ఏదో పని మీద మాస్కో వెళ్ళినప్పుడు అక్కడ ఒక ఫ్యాషన్ హౌస్ ఆమెను మోడల్‌గా పని చెయ్యమని అడిగింది. ఆమె అది చాలా అవమా నకరంగా భావించింది. 'నేను సంతోషంగా చేస్తున్న ఉద్యోగం నాకుంది. మీరు నాకు దుస్తుల హేంగర్ పని ఇస్తామంటున్నారు" అని ఆమె మండిపడింది. ఆ తర్వాత 20 సంవత్సరాలకు పైగా ఒక పెద్ద ఫ్యాక్టరీలో సైంటిఫిక్ సమాచార విభాగానికి ఆమె హెడ్ గా అయింది.

సోవియట్ యూనియన్ లో విద్యా వైద్యాలు ఉచితం. వెయిటింగ్ లిస్టులుండేవి కావు. ఇలా కాక మరోలా జీవితాన్ని మేం ఊహించ లేక పోయాం. ప్రాథమిక, మాధ్యమిక విద్య మాత్రమే కాదు, యూనివర్సిటి విద్య కూడా ఉచితమే. మాకు నెలకు 40 లేక 50 రూబుల్స్ ఇచ్చేవారు. మా ఆహారానికి, నివాసానికి, పుస్తకా లకు అది సరిపోయేది. ఒక ఉదాహరణ ఇస్తాను. విద్యార్థి గృహంలో వసతికి ఫర్నిచరుతో సహా సంవత్సరానికి 24 రూబుళ్లు అవుతుంది. అన్ని బిల్లులూ ప్రభుత్వమే చెల్లించేది. వారానికొకసారి ఉచితంగా బెడ్ మారుస్తుండేవారు. ఒక టీ కెటిల్, ఇస్త్రీ పెట్టె కూడా ఇచ్చేవారు. సోవియట్ యూనియన్ లో మాకు చదువుకు ఏమీ ఖర్చు అవక కాకపోవడమే కాదు, చాలా ఉన్నత ప్రమాణాలు గల విద్య ఉండేది. నేను పశ్చిమ దేశాల యూని వర్సిటీలలో కూడా చదివాను కాబట్టి రెండింటిని పోల్చగలను. ఉదాహణకు ఉత్తర ఐర్లాండులో యూనివర్సిటీ డిగ్రీలున్న వాళ్లుకూడా ఒక మేప్ మీద యూరోపియన్ దేశాలన్నింటిని చూపించలేకపోవడం సర్వ సాధారణ విషయం. నా సహచరుడు ఒకడికి రెండు డిగ్రీలుండేవి. అతను చూపించలేకపోయాడు. నేను తేలికగా చూపించినప్పుడు ఆశ్చర్య పోయాడు. మాకు విద్య అనేది కేవలం సంపాదనకు సాధనం కాదు. ఎంత సంపాదిస్తామనేది కాక జ్ఞానం అనేది మాకు గర్వకారణంగా ఉండేది. అందువల్లనే మాలో చాలామందిమి తీరిక సమయాల్లో ఎన్నో పుస్తకాలు చదివేవాళ్ళం. మరో కారణం ఏమిటంటే పుస్తకాలు చాలా చౌకగా ఉండేవి. క్రీడలు, విశాలార్థంలో సంస్కృతి అందుబాటులో ఉండడం మా దైనందిన జీవితాల్లో చాలా సాధారణ విష యంగా ఉండేది.

మేం 'ఇనుప తెర' వెనుక జీవించే వాళ్ళమనీ ఆ కారణంగా మాకు పశ్చిమ దేశాల పుస్తకాలు, సినిమాలు, పాప్ గీతాల గురించి ఏ మాత్రం తెలియదని పశ్చిమ దేశాలలోని ప్రజలు అప్పుడప్పుడు అంటుండటం నేను విన్నాను. ఇది కూడా నిజం కాదు. నిజానికి ఇంగ్లీషు భాష మాట్లాడే పెట్టుబడిదారీ దేశాలలోని ప్రజలకు తెలిసిన దాని కంటే మాకు చాలా ఎక్కువే తెలుసు. ఎందుకంటే ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, గ్రీసు, తూర్పు యూరోపియన్ దేశాలు, చివరకు ఆఫ్రికన్, ఆసియన్ (ఇండియా, జపాన్ మొదలైనవి), లాటిన్ అమెరికా దేశాల ఉత్తమ చిత్రాలు, పుస్తకాలు, పాటలూ పెద్ద ఎత్తున మాకు అందుబాటులో ఉండేవి. ఉదాహరణకు అర్జెంటీనా నటి లోలిటా టోర్స్

**"నిజానికి ఇంగ్లీషు భాష మాట్లాడే పెట్టుబడిదారీ దేశాలలోని ప్రజలకు తెలిసిన దాని కంటే మాకు చాలా ఎక్కువే తెలుసు. ఎందుకంటే ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, గ్రీసు, తూర్పు యూరోపియన్ దేశాలు, చివరకు ఆఫ్రికన్, ఆసియన్ (ఇండియా, జపాన్ మొదలైనవి), లాటిన్ అమెరికా దేశాల ఉత్తమ చిత్రాలు, పుస్తకాలు, పాటలూ పెద్ద ఎత్తున మాకు అందుబాటులో ఉండేవి."**



ఫ్యాక్టరీలో ఉత్పత్తిని పెంచడం కోసం చర్చిస్తున్న సోవియట్ కార్మికులు

ఒక కాలంలో సోవియట్ యూనియన్‌లో ఎంత పాపులర్ అంటే చాలామంది తమ బిడ్డలకు ఆమె పేరు పెట్టుకున్నారు. యు.యస్.యస్.ఆర్ ప్రజలు జపనీస్ కవలలు "పీనట్స్" పాటలు కొన్ని పాడుతుండేవారు (వీరి పాటలు రష్యన్ భాషలోకి అనువదించబడ్డాయి కూడా). ఎలేన్ డిలాన్, లూయి డి ఫ్యూన్స్ మొదలైన వారు నటించిన ఫ్రెంచ్ చిత్రాలు చూసి ఆనందిస్తుండేవాళ్ళం. బ్రిటన్, అమెరికా, చివరకు ఐర్లాండులో కూడా, ప్రజలు వారిలో ఎవరి గురించీ కనీసం వినను కూడా వినలేదు.

చాలా ముఖ్యమైన విషయం ఏమిటంటే మాకు చాలా పెద్ద జనరంజకమైన మా స్వంత చిత్ర పరిశ్రమ ఉండేది. (ప్రతీ రిపబ్లిక్ కూ ఒక స్వంత ఫిల్మ్ స్టుడియో ఉండేది), గొప్ప థియేటర్లుండేవి (మాలో చాలామందికి పాపులర్ ఒపేరా ప్రాంతాలు బాగా గుర్తుండేవి), గొప్ప సంగీతం ఉండేది. అన్ని రిపబ్లిక్కులలోనూ వారి భాషలో విద్య నేర్పే స్కూళ్లుండేవి. సొంత టి.వి. స్టేషన్లు, వార్తాపత్రికలు, మేగజైన్లు మొదలైనవి ఉండేవి.

ప్రజా రవాణా, గృహవసతి ఎంత చవుక అంటే దాదాపు ఉచితం అని చెప్పవచ్చు. ఇంటి అద్దె కట్టలేక పోవడం వలన నెత్తిమీద కప్పు లేకుండా ఉండాలి అనే భయం మాకు ఎన్నడూ ఉండేది కాదు. మా రాజ్యాంగం అందరికీ పని హక్కు, సెలవుకు జీతం పొందే హక్కు గ్యారంటీ చేసింది. కఠినమైన పరిస్థితులలో పని చేసే వారికి రకరకాల సదుపాయాలుండేవి. వారు తొందరగా రిటైరయ్యే అవకాశం ఉండేది. ట్రేడ్ యూనియన్ అనుమతి లేకుండా ప్రజలను ఉద్యోగం నుంచి తొలగించడాన్ని చట్టం నిషేధించింది. గర్భిణులను రాత్రి షిఫ్ట్‌లో పని చేయించడాన్ని కూడా చట్టం నిషేధించింది. ప్రసూతి సెలవు 18 నెలలుండేది. పూర్తి జీతం దొరికేది. కావాలంటే జీతం లేకుండా మరో 18 నెలలు సెలవు తీసుకోవచ్చు. సెలవు ముగిసిన తర్వాత అదే పని స్థలానికి తిరిగి వచ్చి పని చేసే హక్కుండేది. పని చేసే స్త్రీలకు కిండర్ గార్టెన్లు అందుబాటులో ఉండేవి. ఉద్యోగికి వచ్చే జీతాన్ని బట్టి కిండర్ గార్టెన్‌కు చెల్లించే మొత్తం ఆధార పడి ఉండేది. స్కూల్ టైం తర్వాత పని చేసే అనేక రకాల క్లబ్బు లుండేవి. ఇవన్నీ కూడా ఉచితమే. ఇవి కాక పయనీర్ వేసవి కేంపులు. స్త్రీలకు 55వ ఏట, పురుషులకు 60వ ఏట (ఇప్పుడు కూడా అలాగే ఉంది కాని ప్రస్తుత

**"మా సోషలిస్టు జీవితంలో ప్రధాన అంశాలలో ఒకటి భద్రతతో సురక్షితంగా ఉన్నామని నిరంతరం ఉండే భావన. రేపు నీకూ నీ కుటుంబానికీ ఏం జరుగుతుందోనని ఎప్పుడూ భయపడనక్కర్లేదనే భావన. బహుశా ఈ అంశా నికి మేం తగినంత విలువ ఇవ్వలేదు. ఎందు కంటే జీవితం మరోలా ఉండవచ్చుననే విషయం మాకు తెలియదు."**



సోవియట్ యూనియన్‌లో విద్యను అభ్యసిస్తున్న బాలలు

పెట్టుబడిదారీ ప్రభుత్వం పెన్షన్ వయసును పెంచుతామని నిరంతరం బెదిరిస్తోంది) రిటైర య్యే హక్కు ఉండేది. కొత్త ఇళ్లు కేటాయించడంలో ఎక్కువ మంది పిల్లలుండే కుటుంబాలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. ఐదుగురూ అంతకు మించి ఎక్కువ సంతానం ఉన్న తల్లులకు "మదర్ హీరో" అనే పతకం ఇచ్చేవారు, దాంతో పాటు ఆదనంగా సదుపాయాలు కల్పించేవారు.

ట్రేడ్ యూనియన్లకు పెద్ద సంఖ్యలో సెలవు గృహాలు (హాలీడే హెూమ్స్) ఉండేవి. చాలా తక్కువ ఖర్చుకు తమ కార్మికులను ఆరోగ్య కేంద్రా లకూ, నల్ల సముద్ర కేంద్రాలకూ యాత్రలు ఏర్పాటు చేసేవి. నేను నెదర్లాండు వచ్చి యూనివర్సిటీలో చదవడానికి వెళ్ళినప్పుడు, ఇక్కడ పాఠ్య గ్రంథాలలో యు.యస్.యస్.ఆర్ లో ""ట్రేడ్ యూనియన్లు లేవు" అనీ "భర్తలు తగినంత సంపాదించలేని కారణంగా మాత్రమే మన స్త్రీలు పనిచేసేవారనీ" చదివాను. మన సోషలిజం గురించి పెట్టుబడిదారీ దేశాలలోని ప్రజలకు అసత్యాలు చెబుతున్నారనీ తమకు అంతా తెలుసని ఆ ప్రజలు భావిస్తున్నా వారిలో చాలామందికి సోషలిజం గురించి ఏమీ తెలియ దనీ నేను అర్థం చేసుకోవడం ప్రారం భించాను.

మా సోషలిస్టు జీవితంలో ప్రధాన అంశాలలో ఒకటి భద్రతతో సురక్షితంగా ఉ న్నామని నిరంతరం ఉండే భావన. రేపు నీకూ నీ కుటుంబానికీ ఏం జరుగుతుందోనని ఎప్పుడూ భయపడనక్కర్లేదనే భావన. బహుశా ఈ అంశా నికి మేం తగినంత విలువ ఇవ్వలేదు. ఎందు కంటే జీవితం మరోలా ఉండవచ్చుననే విషయం మాకు తెలియదు. నిరుద్యోగ భయం, ఆకలి భయం, గూండాలు దాడి చేస్తారనే భయం, మోసగాళ్ళు మోసగిస్తారనే భయం, బానిసలుగా అమ్మబడతామనే భయం, వైద్య సహాయం పొందలేమోననే భయం మొదలైన భయాలు – నేడు పెట్టుబడిదారీ రష్యాలో మెజారిటీ ప్రజ లను నిరంతరం ఆందోళనకు గురిచేస్తున్న భయాలు మాకు తెలియదు.

నేను ఇంకా వివరంగా చెప్పగలను. కాని అప్పుడు నేను రోజంతా తీసుకోవాలి. ఇతర వక్తలకు మాట్లాడడానికి టైముండదు. ఆసక్తి గల వారు నా పుస్తకాన్ని చదవవచ్చు.

ఈ పుస్తకం ఎందుకు రాశాను అన్న విషయం గురించి రెండు మాటలు మాత్రం చెబుతాను. నేను "పెరిస్త్రోయికా శరణార్థి"ని అయిన తర్వాత, పెట్టుబడిదారీ ప్రపంచంలో అనేక కష్టనష్టాలు పేదరికం, అప్పు, గర్భిణీగా ఉన్నప్పుడు ఉద్యోగం కోల్పోవడం, నిరుద్యోగం, నివారించగల వైకల్యంతోఉన్న నా కూతురి అకాల మరణం, వివిధ రకాల వివక్షలు – అనుభవించిన తర్వాత, యు.యస్.యస్.ఆర్ లో జీవితం గురించి ప్రజలకు చెప్పాలనే కోరిక నాలో కలిగింది. ఆ జీవితాన్ని పెట్టుబడి దారీ ప్రపంచ "స్వేచ్ఛా' జీవితంతో పోల్చి, సోషలిజం అంటే ఏమిటో తెలియని నా దేశం లోని యువతకూ విదేశాలలో ఉన్న ప్రజలకూ – వీరిలో చాలామంది చిన్నతనం నుంచీ సోషలి జం గురించి తాము వింటున్న అబద్ధాలు నమ్ము తున్నారు – చెప్పాలనిపించింది. ఆ విధంగా నా చిన్ననాటి కల ఒకటి – రచయిత కావాలనే కల – వాస్తవమైంది. ఫలితాలు నేను ఊహించ లేదు. అంటే నా పుస్తకానికి ఇంత ప్రతిధ్వని ఉంటుందనీ, అన్ని తరాల వ్యక్తులనుండీ వివిధ దేశాల నుండీ వివిధ నేపథ్యాల నుండీ అంతగా సానుకూల ప్రతిస్పందనలు వస్తాయనీ నేను కలలో కూడా ఊహించలేదు. ఈ పుస్తకం రష్యన్ భాషలో ఇంటర్నెట్‌లో ఉచితంగా లభిస్తుంది. ఇది అనేక భాషల్లోకి అనువదించబడింది, మరి కొన్ని భాషల్లోకి అనువదించబడుతోంది. నాకు చాలా విలువైన ప్రతిస్పందనగా అనిపించినది నా తరానికి చెందిన, ముందు తరానికి చెందిన నా దేశవాసుల ప్రతిస్పందన. వాళ్ళలో చాలా మంది "మా అందరి తరఫున నిజం చెప్పినం దుకు" "మేమంతా అనుకుంటున్నది చివరకు గట్టిగా చెప్పినందుకు" నన్ను అభినం దించడానికి వచ్చినప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి.

నా పుస్తకంలో చాలా ముఖ్యమైన అంశం మరొకటి కూడా ఉంది – ఇదంతా ఎలా జరి గింది? మన దేశంలో ఇలా జరగడాన్ని మనం ఎందుకు సహించాం? ఎక్కడ దారి తప్పాం? అని మనందరి గుండెల్లోనూ మండుతున్న ప్రశ్నలకు సమాధానం వెతకడం. ఈ క్రమం గురించి నాకు సాధ్యమైనంత నిజాయితీగా చెప్పడానికి ప్రయత్నించాను. ఈ రోజుల్లో మా యువతలో సోషలిజం అంటే ఆసక్తి వేగంగానూ, బలంగానూ పెరగడం చూసి నేను చాలా సంతో షిస్తున్నాను. సోషలిజం గురించి యువ తకు వ్యక్తిగత అనుభవం లేదు. అనేక అసత్యాలు వింటూ వాళ్ళు పెరిగారు. ఎంత పెద్ద ఎత్తున అసత్యాలు వింటుంటే, సోషలిస్టు వాస్తవాన్ని గురించి తెలుసుకోవాలన్న వారి ఆసక్తి అంతగా పెరుగుతోంది. రష్యన్లందరిలోనూ స్టాలిన్ అంటే అభిమానం పెరుగుతోంది. ముఖ్యంగా యువ రష్యన్లలో ఇది వేగంగా పెరుగుతోంది. సోషలి జం గురించి మరింత ఎక్కువ తెలుసు కోవాలని వాళ్ళు ఆత్రుతపడుతున్నారు. సరైన సమయంలో నా పుస్తకం వెలువడిందని నేను అనుకుంటు న్నాను. భవిష్యత్తులో జర్నలిస్టులు కాబోతున్న వారిని – వ్లాడివోస్టక్ నుంచి వచ్చిన విద్యార్థులను – నేను కలిసినప్పుడు అది గ్రహించగలిగాను.

ఈ రోజు మా యువత మీద రుద్దబడుతున్న విలువలూ ప్రమాణాలకూ భిన్నంగా సోవియట్ ప్రజల విలువలూ ప్రమాణాలూ ఉండేవి. అవసరంలో ఉన్న వారికి సహాయం చెయ్యడం మన విధి అనే ఆలోచనతో మేం పెరిగాం. ఇతరుల భావాలను ఎప్పుడూ పరిగణలోకి తీసుకునే వాళ్ళం. మా పనులు ఇతరుల మీద ఎటువంటి ప్రభావం కలిగిస్తాయి అన్నది ఎప్పుడూ లెక్కలోకి తీసుకునే వాళ్ళం. 'రాజీ పడకపోవడం' అనేది ఒక సానుకూల గుణంగా (తన నమ్మిన విలువలకు కట్టుబడే వ్యక్తిగా) పరిగణించే చైతన్యంతో పెరిగాం. డబ్బు, కీర్తి అనేవి మాకు పట్టేవి కావు. సమాజానికి సహాయపడడానికీ ప్రపంచాన్ని మెరుగైన ప్రపంచంగా మార్చడానికీ మనం జీవిస్తున్నాం అనే భావనతో ఉండేవాళ్ళం. ఇప్పుడు కూడా అదే భావనతో ఉన్నాం. జీవితంలో అతి ముఖ్యమైన విషయం ఏమిటి అనే ప్రశ్నకు ప్రస్తుతం ఉన్న 'నాయకులు', 'ప్రతీ వ్యక్తి తన కుటుంబం కోసం బ్రతకాలి' (దేశ ప్రయోజనం మొదటి స్థానంలో ఉండకుండా), అంతకంటే అధమం, 'జీవించడానికే జీవించాలి' అంటూ చేసే ప్రకటనలు వింటుంటే, వాళ్ళను అసహ్యించుకుంటాం.

సోవియట్ యూనియన్ పతనమైన తర్వాత పెరిస్త్రోయికా సంవత్సరాలలో మేం ఏం తప్పు చేశామో చాలా చక్కగా, అందంగా చెప్పిన పాట ఒకటుంది:

**సూర్యుడు వైపు వీపు తిప్పి సూర్యోదయం చూడడానికి మేం ప్రయత్నించాం**

ఆ తప్పులు మేం మళ్ళీ చెయ్యం. ప్రపంచంలో సోషలిస్టు మార్గాన్ని ఎంచుకుని దానికి కట్టుబడి ఉన్న ప్రజలందరికీ మద్ద తునివ్వడం సోవియట్ ప్రజలుగా మా కర్తవ్యం. క్యూబా, వెనిజులా లాంటి దేశాలను మనం ప్రస్తావించవచ్చు. ముఖ్యంగా డి.పి.ఆర్.కె. (ఉత్తర కొరియా

> **"సోవియట్ యూనియన్ గురించి మనం వాస్తవం చెబుతున్నట్లుగానే ఉత్తర కొరియా గురించి కూడా ప్రజలకు వాస్తవం చెప్పాలి. ఈనాడు సోషలిజం పరిరక్షణకు జరిగే పోరాటంలో వారు అగ్రభాగంలో ఉన్నారు. సామ్రాజ్యవాద పెత్తనాన్ని ప్రతిఘటించే ప్రపంచ ప్రజలందరికీ గొప్ప స్ఫూర్తినీ శక్తినీ ఇస్తున్నందుకు ఈ ప్రజలను నేను కీర్తిస్తున్నాను."**

– అను) లో ఉన్న కామ్రేడ్స్ గురించి నేను చెప్పదలుచుకున్నాను. నేడు సామ్రాజ్యవాదుల బెదిరింపులను లెక్క చెయ్యకుండా ఉక్కులా నిలబడ్డారు ఈ కామ్రేడ్స్. యు.యస్.యస్.ఆర్ విషయంలో కంటే కూడా పెట్టుబడిదారీ మీడియా ఈ కామ్రేడ్స్ విషయంలో చాలా దుర్మార్గంగా వారిని రాక్షసులుగా చిత్రిస్తూ భారీ స్థాయిలో ప్రచారం చేస్తోంది. సోవియట్ యూనియన్ గురించి మనం వాస్తవం చెబుతున్నట్లుగానే ఉత్తర కొరియా గురించి కూడా ప్రజలకు వాస్తవం చెప్పాలి. ఈనాడు సోషలిజం పరిరక్షణకు జరిగే పోరాటంలో వారు అగ్రభాగంలో ఉన్నారు. సామ్రాజ్యవాద పెత్తనాన్ని ప్రతిఘటించే ప్రపంచ ప్రజలందరికీ గొప్ప స్ఫూర్తినీ శక్తినీ ఇస్తున్నందుకు ఈ ప్రజలను నేను కీర్తిస్తున్నాను.

నేను గతంలో మాస్కో వెళ్ళిన సందర్భాలలో, స్ఫూర్తి కోసం, శక్తిని పొందడం కోసం, "పార్టిజాన్స్ కయా" మెట్రో స్టేషనులో సోవియట్ యుద్ధ హీరోయిన్ జోయా కాస్మో డెమ్యాన్ స్కయా విగ్రహం ముందు నిలబడేదాన్ని. నా మనస్సుతో ఆమెతో మాట్లాడాను. 1941లో నాజీలు ఆమెను ఉరి తీసినప్పుడు ఆమె వయసు 18 మాత్రమే. ఆ సమయంలో సోవియట్ యూనియన్ ఓడిపోతున్నట్లే అనిపించింది. ఆమెకు విజయాల నుంచి స్ఫూర్తి లభించే అవకాశమే లేదు. అయినా ఆమె అంతిమ విజయం మనదే అన్న నమ్మకంతో ఉక్కులా నిలబడింది. కేవలం ఎదురు చూస్తూ కూర్చోకుండా శత్రువుతో పోరాడమని చెప్పింది. పెరిస్త్రోయికా తర్వాత, మన సోషలిస్టు విజయాలన్నీ నాశనమై కేపిటలిస్టు క్రూరత్వంలో మనం కూరుకుపోయిన తర్వాత, ఇది మేం గుర్తించగలిగాం: ఎవరో వచ్చి మన కోసం సోషలిజాన్ని పరిరక్షించి పునరుద్ధ రించేదాకా కేవలం 'ఎదురు చూస్తూ కూర్చో కూడదు'. ఈ పని మనమే చెయ్యాల్సిన పని. మన చెయ్యగలిగినది ఎక్కువ కావచ్చు, తక్కువ కావచ్చు. కాని మనం చెయ్యగలిగినదంతా చెయ్యాలి. అసాధ్యమైనది సాధ్యం చెయ్యడానికి ప్రయత్నించాలి. గతంలో సోషలిజాన్ని పరి రక్షించడానికి పోరాడిన హీరోలనూ, ఈనాడు సోషలిజం కోసం పోరాడుతున్న వారినీ ఆద ర్శంగా తీసుకోవాలి.

ఈ రోజు మీతో మాట్లాడే ఈ అవకాశాన్ని నాకు ఇచ్చిన కామ్రేడ్స్ కు, ముఖ్యంగా ఫిలిప్పైన్స్ నుంచి వచ్చిన కామ్రేడ్స్‌కు, కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మీ స్నేహితురాలిగా, కామ్రేడ్‌గా ఉండడం నాకు గర్వకారణంగా ఉంది. మీ పోరాటం ఇక్కడ సమావేశమైన మా అందరికీ ఒక గొప్ప స్ఫూర్తినిస్తుంది.

**అనువాదం: తోలేటి జగన్మోహనరావు**

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ.

**ఈ మాసం ప్రత్యేకం**

# చైనా ఆధునికాభివృద్ధికి సిపిసి కృషి



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**ఎం.వి.ఎస్. శర్మ**

**చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభ–కొన్ని ముఖ్యమైన విషయాలు**

2017 అక్టోబరు 18 నుండి 24వ తేదీ వరకు బీజింగ్ లో చైనా పార్టీ 19వ మహాసభ జరిగింది.

**(1) మహాసభ పిలుపు:**

అ) చైనా లక్షణాలతో కూడిన సోషలిజం సాధన కోసం మన పార్టీ ఏర్పడింది. ఆ లక్ష్యానికి కచ్చితంగా కట్టుబడి వ్యవహరించాలి.

ఆ) అన్ని అంశాలలోనూ ఒక సుమారైన స్థాయికి అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించడంలో నిర్ణయాత్మకమైన విజయాన్ని సాధించాలి.

ఇ) చైనా లక్షణాలతో సోషలిజం గొప్ప విజయాన్ని సాధించి నూతన శకాన్ని ఆవిష్కరించడానికి గట్టి కృషి చేయాలి.

ఈ) జాతీయ పునరుజ్జీవనం సాధించాలనే చైనా ప్రజల కలను సాకారం చేయాలి.

**(2)** 2287 మంది ప్రతినిధులు. 8 కోట్ల 90 లక్షల మంది పార్టీ సభ్యులకు వీరు ప్రతినిధులు.

ఉత్పత్తి రంగంలో ప్రత్యక్షంగా పని చేస్తున్న వారు 773 మంది.–33.7 శాతం.

మహిళా ప్రతినిధులు 24.1 శాతం.

దేశంలో మైనారిటీ తెగలు 55 ఉంటే వాటిలో 43 తెగల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రతినిధుల సగటు వయసు 51.8 సంవత్సరాలు.

87.8 శాతం ప్రతినిధులు 1978 తర్వాత– అంటే డెంగ్ సియావో పెంగ్ సంస్కరణలు మొదలైన తర్వాత పార్టీలో చేరినవారు

**(3)** 2012 తర్వాత చైనా ఆర్థిక వ్యవస్థ 7.2 శాతం వృద్ధిరేటుతో పెరుగుతోంది.

స్థూలజాతీయోత్పత్తి 54 ట్రిలియన్ల యువాన్లనుండి 80 ట్రిలియన్ల యువాన్లకు పెరిగింది. (ట్రిలియన్ అంటే లక్ష కోట్లు)

ప్రపంచంలో రెండవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ చైనాది. ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో 30 శాతం చైనాది.

గత ఐదేళ్ళలో 6 కోట్లమంది ప్రజలను పేదరికపు స్థాయి నుండి పైకి తెచ్చారు. పేదలు 10.2 నుండి 4 శాతం కు తగ్గారు.

సగటున ఏడాదికి 1 కోటి 30 లక్షల ఉద్యోగాలు పట్టణాలలో కల్పించారు.

విద్య, వైద్యం, గృహవసతి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మెరుగుపడింది.

ఈ అభివృద్ధి అంతా ప్రపంచం యావత్తూ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో సాధించారు.

**(4)** గుర్తించిన బలహీనతలు: అసమాన అభివృద్ధి వలన, చాలీచాలని అభివృద్ధి వలన



**మహాసభ వేదికపై చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం**

ఏర్పడ్డ తీవ్ర సమస్యలు ఉన్నాయి. వాటికి పరిష్కారం కనుగొనాలి.

అభివృద్ధి యొక్క నాణ్యత, దాని విస్తృతి ఉండవలసిన మోతాదులో లేవు.

కొత్త ఆవిష్కరణలు, కొత్త విధానాలు ఇంకా బాగా పెరగాలి.

పర్యావరణ రక్షణ విషయంలో ఇంకా చాలా మెరుగుపడాలి.

ప్రజాసంక్షేమం ఇంకా మెరుగుపడాలి.

పేదరిక నిర్మూలన ఇంకా పెద్ద సవాలు గానే ఉంది.

పట్టణాలకు, గ్రామాలకు మధ్య, ప్రాంతాలకు, ప్రాంతాలకు మధ్య అసమానతలు ఉన్నాయి. ఆదాయాల మధ్య అంతరాలు బాగా ఉన్నాయి.

ఉపాధి కల్పన, విద్య, వైద్యం, గృహవసతి, వృద్ధుల సంరక్షణ- ఈ అంశాలలో చాలా ఇబ్బందులు ఉన్నాయి.

సైద్ధాంతిక పోరాటం ఇంకా సంక్లిష్టంగానే ఉంది.

జాతీయ భద్రతకు సంబంధించి కొత్త సయస్యలు ఎదురౌతున్నాయి. పార్టీ నిర్మాణానికి సంబంధించి అనేక పార్శ్వాలు బలహీనంగా ఉన్నాయి.

**(5)** కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన మార్క్సిజం సిద్ధాంతాన్ని చైనా నిర్దిష్ట పరిస్థితులకు వర్తింపజేస్తూ సోషలిస్టు నిర్మాణంలో ముందుకు సాగుతున్నాము. మానవ సమాజాన్ని ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చైనా నమూనా పరిష్కారం చూపగలదు.

**(6)** ఇప్పటివరకు సాధించిన అభివృద్ధితో చైనా ఇక నూతన శకం లోకి అడుగుపెట్టింది. అన్ని తరగతుల, అన్ని జాతుల ప్రజలు సమిష్టిగా కృషి చేసి అందరూ ఉమ్మడిగా అభివృద్ధి చెందాలి. ప్రపంచంలో చైనా కేంద్ర స్థానానికి చేరాలి.

**(7)** నూతన శకం అంటే అంతా సాధించ గలిగామని కాదు. ఇప్పటికీ చైనా సోషలిస్టు నిర్మాణంలో ప్రాథమిక దశలోనే ఉంది.

**(8)** అసమాన, అసమగ్ర అభివృద్ధికి, మెరుగైన జీవితం దిశగా నిరంతరం పెరుగుతున్న ప్రజల అవసరాలకు మధ్య ఉన్న వైరుధ్యమే ఇప్పుడు చైనా సమాజంలో ప్రధాన వైరుధ్యంగా ఉంది. పాదార్థిక, సాంస్కృతిక అవసరాలతో బాటు, ప్రజాస్వామ్యం, న్యాయం, భద్రత, మెరుగైన పర్యావరణం కావాలన్న ప్రజల కోర్కెలూ పెరుగుతున్నాయి. ఈ వైరుధ్య

**"ప్రభుత్వరంగాన్ని బలోపేతం చేయడమూ, విస్తరించడమూ కొనసాగుతుంది. సోషలిస్టు పంపిణీ వ్యవస్థను మెరుగుపరచడం, వ్యవసాయ రంగాన్ని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడం, ఒక క్రమ పద్ధతిలో పట్టణీకరణను కొనసాగించడం... ఇవి ప్రభుత్వ విధానాలుగా ఉంటాయి."**



చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న చైనా పార్టీ మహాసభ

పరిష్కారం కోసం జరిగే పోరాటమే కీలకం.

**(9)** ఈ దిశగా తీసుకోవలసిన చర్యలు సీ జిన్ పింగ్ ఆలోచనా విధానంగా పార్టీ కార్యక్రమంలో చేర్చబడ్డాయి. మార్క్సిజం-లెనినిజం, మావోజెడాంగ్ ఆలోచనావిధానం, డెంగ్ సియావోపెంగ్ సిద్ధాంతం, మూడు ప్రాతినిధ్యాల సిద్ధాంతం(జియాంగ్ జెమిన్ సూత్రీకరించినది), అభివృద్ధి పట్ల మన శాస్త్రీయ దృక్పథం( హు జింటావో సూత్రీకరించినది)--వీటి తర్వాత సీ జిన్ పింగ్ ఆలోచనా విధానం పార్టీ కార్యక్రమంలో చేరింది.

**(10)** ప్రపంచ మార్కెట్ కు తలుపులు తెరిచి ఉంచే విధానమూ, సంస్కరణలూ కొన సాగుతాయి.

ప్రభుత్వరంగాన్ని బలోపేతం చేయడమూ, విస్తరించడమూ కొపసాగుతుంది. సోషలిస్టు పంపిణీ వ్యవస్థను మెరుగుపరచడం, వ్యవసాయ రంగాన్ని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడం, ఒక క్రమ పద్ధతిలో పట్టణీకరణను కొనసాగించడం-- ఇవి ప్రభుత్వ విధానాలుగా ఉంటాయి.

వేగంగా పెరగడం అనే దశ నుండి ఉన్నతమైన నాణ్యతతో అభివృద్ధి చెందడం అనే దశకు మారుతుంది.

**(11) మొదటి దశ:** 2020 నుండి 2035 వరకు-- ఈ దశలో సోషలిస్టు ఆధునీకరణ

**రెండో దశ:** 2035 నుండి 2050 వరకు -- ఈ దశలో చైనా ఒక గొప్ప ఆధునిక దేశంగా, బలంగా, సంపద్వంతంగా, ప్రజాతంత్ర యుతంగా, సమైక్యంగా, ఉన్నత సంస్కృతితో అందంగా రూపొందుతుంది.

**(12)** ఈ మొత్తం క్రమం అంతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతుంది. పార్టీ దేశానికి వెన్నెముకగా ఉంటుంది. ❊

# సామాజిక సమస్యలు సైద్ధాంతిక స్పష్టత



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

**ఎస్. వీరయ్య**

తరతరాలుగా అంటరానితనాన్నీ, అవమానాలనూ భరిస్తూ పుట్టెడు దు:ఖంతో ఆత్మాభిమానాన్ని చంపుకుని బతుకుతున్నవారు కొత్త చైతన్యంతో ప్రశ్నిస్తున్నారు. తలెత్తుకుని నిలబడే ప్రయత్నం చేస్తున్నారు. కులవివక్షకూ, ఆధిపత్యానికీ వ్యతిరేకంగా వస్తున్న ఈ చైతన్యాన్ని ప్రోత్సహించాలి. పోరాట దిశలో నడిపించాలి. ఈ పోరాటానికి శ్రామికులు సంపూర్ణ మద్దతు నివ్వాలి. అండగా నిలబడాలి. కార్మికవర్గం ఒకడుగు ముందుకేసి అగ్రభాగాన నిలబడాలి. రాజకీయ రంగంలో కమ్యూనిస్టులు ఇందు కోసం అంకితభావంతో కృషి చెయ్యాలి. ఇక్కడ ఊగిసలాటకు తావు లేదు. ఈ పోరాటక్రమంలోనే రిజర్వేషన్లు, గుర్తింపు, ఆత్మగౌరవం, జనాభాకు తగిన వాటా నినాదం కూడా ముందుకొస్తున్నది. రెండూ న్యాయమైనవే. అందరికీ ప్రయోజనం చేకూర్చే నినాదాలకు కమ్యూనిస్టులు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. ఎందుకంటే అవి అట్టడు గున దుర్భర జీవితాలు అనుభవిస్తున్న బడుగు బలహీన వర్గాలను తట్టి లేపుతాయి. రిజర్వేషన్లు పరిమితంగానే అయినప్పటికీ ఉపయోగమే. ఆయా సామాజిక తరగతుల నుండి రిజర్వే షన్లతో లాభం పొందినవారు అట్టడుగు వర్గాల ప్రయోజనాల కోసం అంకితభావంతో కృషి చేయాలని కమ్యూనిస్టులు కోరతారు. రిజర్వేషన్ల ద్వారా ఆయా సామాజిక తరగతుల నుండి పెద్ద సంఖ్యలో మధ్యతరగతి ఉద్యోగులు, మేధావులు అభివృద్ధి చెందారు. సహజంగానే ఇప్పుడు ఆత్మగౌరవం సమస్య కూడా ముందు కొచ్చింది. ఆత్మగౌరవం కోసం రాజీలేకుండా పోరాడాలి. సమాజంలో ఒకవైపు దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతులు అత్యధి కులు చదువురాని వారుగానూ, నిరుద్యోగులుగానూ, నిరుపేద కూలీలు, కార్మికులుగానూ ఈతి బాధలను అనుభవిస్తుండగా, ఆయా తరగతులలోని ఆ కొద్దిమందికి ఆత్మగౌరవం అందదు. అందుకే అందరి సమస్య కోసం నిలబడ్డప్పుడే ఆత్మగౌరవం కోసం సాగే పోరాటం కూడా ముందుకు సాగుతుంది. కులం గుర్తింపు కోసం పడే ఆరాటం ఆత్మ గౌరవాన్ని ఇవ్వదు. కులం అస్తిత్వాన్ని కాపాడు తుంది. కుల వ్యవస్థ పునాదులను కొనసాగి స్తుంది. కులవివక్ష మీద, ఆధిపత్యం మీద, కుల దురహంకారం మీద పోరాటాన్ని బలహీన పరుస్తుంది. కులం అస్తిత్వం కోసం కాదు ఇప్పుడు పోరాడ వల సింది. కుల నిర్మూలన లక్ష్యంగా కృషి చేయాలి. అన్ని రంగాలలో ఆయా తరగతుల జనాభాకు తగిన వాటా కూడా ప్రజాస్వామిక మైనదే. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న కొద్దిపాటి అవకాశాలలోనే కొద్దిమందికి కొద్దిపాటి వాటా అందుతుందే తప్ప ఆయా తరగతులలోని శ్రామికులందరికీ న్యాయం చేకూర్చడం సాధ్యపడదు. ఆర్థిక రంగంలో కొద్దిమంది కాంట్రాక్టర్లుగానో, చిన్న పారిశ్రామికవేత్తలు గానో, వ్యాపారస్థులు గానో అవకాశాలు పొందవచ్చు. రాజకీయ రంగంలో కొంతమంది కి పదవులు దక్కవచ్చు. అదికూడా తప్పేమీ కాదు. కానీ ఆయా సామాజిక తరగతుల్లోని కొంతమందిని తమ పెట్టుబడిదారీ వర్గంలో కలుపుకోవడం కోసమే పాలక వర్గాలు ఈ పని చేస్తారన్న స్పృహ ఉద్యమకారులకు అవసరం.

### జనతా ప్రజాతంత్ర ఐక్య సంఘటన

కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం ప్రకారం చిన్న పెట్టుబడిదారులు మిత్రవర్గాలే కదా అన్న ప్రశ్న ముందుకొస్తుంది. వీరు జనతా ప్రజాతంత్ర ఐక్య సంఘటనలో భాగమే. నిజమే, కానీ ఇక్కడ ఒక స్పష్టత అవసరం. ఈ చిన్న పెట్టుబడిదారులను కలుపుకుపోయేది వర్గ పోరాటం. వారిని పాలకవర్గాల పంచన చేర్చేది అస్తిత్వవాదం.... కుల పోరాటం. అందుకే కమ్యూనిస్టులు కలుపుకుపోవాలి. వర్గపోరాటం బలోపేతమైనప్పుడే, కమ్యూనిస్టు ఉద్యమం తమకు భద్రత కల్పించగలదన్న విశ్వాసం కలిగినప్పుడే చిన్న పెట్టుబడిదారులు ప్రజల పక్షం వహిస్తారు. అందుకే ఈ వర్గాలను ప్రజల పక్షం ఆకర్షించాలంటే ప్రజా ఉద్యమాలను ఉధృతం చెయ్యాలి. ఆయా తరగతుల ప్రజానీకంలోని అత్యధికులుగా ఉన్న పేదల సమస్యలు ముందుకు తేవాలి. కులవివక్ష, కుల దురహంకారం మీద, ఆధిపత్యం మీద తిరుగుబాటు చేయాలి. జనతా ప్రజాతంత్ర ఐక్య సంఘటన వర్గాల పొందిక. అది కులాల పొందిక కాదు. అందుకే కొన్ని కులాల ఐక్యత అన్న నినాదం జనతా ప్రజాతంత్ర ఐక్య సంఘటనలో పొసగదు. అందుకే కులవివక్ష మీద, కులవ్యవస్థ మీద పోరాటం ఎక్కుపెట్టాలి. కులవివక్ష వ్యతిరేక పోరాటంలో, కులనిర్మూలన కృషిలో ఆయా సామాజిక తరగతుల నుండి అభివృద్ధి చెందిన మధ్యతరగతి వర్గం భాగం కావాలి. ఆయా తరగతుల నుండి ఎదిగిన ధనికవర్గాలు కూడా ఇందుకు సహకరించాలి.

### మార్క్సిజమే మార్గదర్శి

"పురోగామి శక్తులకు బౌద్ధం పునాది అయితే... తిరోగామి శక్తులకు మనువాదం పునాది" అనే అభిప్రాయం కూడా ప్రచారంలో ఉన్నది. బౌద్ధం పుట్టిన నేపథ్యం సామాజిక పురోగమనమే. ఒకానొక చారిత్రక దశలో పురోగామి శక్తుల ఆయుధం బౌద్ధం. వ్యవసాయాభివృద్ధికీ, సామాజిక రంగంలో సమానత్వానికీ ఊతమిచ్చింది. ఇప్పటికీ పురోగామి శక్తులకు స్ఫూర్తినిస్తుంది. నాడైనా నేడైనా మనువాదం తిరోగామి శక్తుల ఆయుధమే. చరిత్రను శాస్త్రీయంగా పరిశీలించి ఆయా చారిత్రక దశల్లో పురోగామి పాత్ర పోషించిన శక్తుల అనుభవాలను క్రోడీకరించి, ఆ పోరాటాల వారసత్వాన్ని పుణికిపుచ్చుకునేదే కమ్యూనిస్టు సిద్ధాంతం. చార్వాకులైనా, బౌద్ధమైనా, వైష్ణవమైనా, శైవమైనా ఆయా చారిత్రక దశల్లో నిర్వ

హించిన పాత్రను అర్ధం చేసుకుని నేటి నిర్ధిష్ట పరిస్థితుల్లో సమాజ మార్పుకు తగిన మార్గం ఎంచుకోవాలి. ఇందుకు తోడ్పడేదే మార్క్సిజం. కమ్యూనిస్టులు పునరుద్ధరణవాదులు కాదు. పురోగామి శక్తులు. అందుకే నేటి చారిత్రక పరిస్థితుల్లో పురోగామి శక్తులకు పునాది మార్క్సి స్టు సిద్ధాంతమే. బౌద్ధం అభ్యుదయకర పాత్రను అర్ధం చేసుకోవాలన్నా, ఫూలే, అంబేద్కర్‌ల ఆశయాలు సాధించాలన్నా, మనువాదుల అణచివేతను ఎదిరించాలన్నా మార్క్సిస్ట సిద్ధాంతమే ఆధునిక, శాస్త్రీయమైన ఆయుధం.

**కులమా... వర్గమా?**

దళితులు రాజ్యాధికారానికి వస్తే తప్పే ముందీ అనే వాదన కూడా ఉన్నది. నిజమే, తప్పేమీ లేదు. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నాయకత్వంలో బీఎస్పీ ప్రభుత్వం ఏర్పడింది కూడా. బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలలో సుదీర్ఘకాలం బీసీల నాయకత్వంలో ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. బీహార్‌లో ఎంబీసీల నాయకత్వంలోనే ఎక్కువకాలం ప్రభుత్వాలు ఉ న్నాయి. అగ్రవర్ణాలకు తప్ప ఇతరులకు పరి పాలించే హక్కు గానీ, శక్తిగానీ లేదనడం సరైంది కాదు. కానీ దళితులు లేదా బీసీలు రాజ్యాధి కారానికి వస్తే ఆయా సామాజిక తరగతుల ప్రజలందరికీ విముక్తి లభిస్తుందనుకోవటం పొరపాటే. ఇప్పటివరకూ దేశంలో అనుభవం కూడా అదే. దళితులలో లేదా బీసీలలో కొద్దిమందికి పదవులు దక్కవచ్చు. అధికారం చేజిక్కవచ్చు. కానీ కులవివక్ష, కులవ్యవస్థ అంతం కాదు. ఏ కులం అధికారంలో ఉండాలి అనే చర్చ కులాలు సంఘటితం కావడానికే తోడ్పడుతుంది. కులవివక్ష, కులవ్యవస్థ కొన సాగింపునకే తోడ్పడేది. కార్మికులు, వ్యవ సాయ కూలీలు, కౌల్దారులు, పేద, మధ్యతరగతి రైతు లు, వృత్తిదారుల సమస్యలు గానీ, మహిళలు, మైనార్టీల సమస్యలు గానీ పరిష్కారం కాకపోగా సరళీకృత ఆర్థిక విధానాలను అమలు జరపడా నికి ఈ ప్రభుత్వాలు వెనకాడలేదు. అందుకే ఏ కులం అధికారంలోకి రావాలి అనే ప్రశ్న సమస్యల పరిష్కారానికి తోడ్పడదు. శ్రామికుల విభజనకే తోడ్పడుతుంది. ఏ వర్గం అధికారం లోకి రావాలనే ప్రశ్న శ్రామికుల విముక్తికి తోడ్పడుతుంది. కులవివక్ష వ్యతిరేక పోరాటానికీ, కుల నిర్మూలన కృషికీ తోడ్పడుతుంది.

**నిజాయితీ – నిబద్ధత**

అన్నిరకాల దోపిడీ నుండి, వివక్షల నుండి, ఆధిపత్యం నుండి విముక్తి కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులు సైద్ధాంతిక స్పష్టతతో వ్యవహరిం

**"అందుకే ఏ కులం అధికారంలోకి రావాలి అనే ప్రశ్న సమస్యల పరిష్కారానికి తోడ్పడదు. శ్రామికుల విభజనకే తోడ్పడుతుంది. ఏ వర్గం అధికారంలోకి రావా లనే ప్రశ్నశ్రామికుల విముక్తికి తోడ్పడుతుంది. కులవివక్షవ్యతిరేక పోరాటానికీ, కుల నిర్మూలన కృషికీ తోడ్పడుతుంది."**



హక్కులకోసం పోరాడుతున్న అణబద్ధ తరగతులు

చాలి. లేనట్టయితే చేస్తున్న శ్రమంతా వృథా అవుతుంది. కులాలు, వర్గాలతో నిండిన సమా జంలో సాధారణ ప్రజలలో సైద్ధాంతిక గందర గోళం సహజం. సమస్యల పరిష్కారం కోసం ఎవరి మార్గంలో వారు ప్రయత్నం చేస్తున్నప్పుడు ఎవరి సిద్ధాంతాలు వారికి ఉంటాయి. అవి మార్క్సిస్టు సిద్ధాంతం కానప్పుడు తప్పటడుగులూ సహజమే. అయినా న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పనిచేసే శక్తులన్నీ కలిసి నడ వటం చారిత్రక అవసరం. శాస్త్రీయ మార్గాన్ని అనుసరించేది కమ్యూనిస్టులే అయినా కమ్యూని స్టులు మాత్రమే ఒంటరిగా సాధించే లక్ష్యాలు కాదివి. అనేక ప్రవాహాలను కలుపుకు పోవాలి. అప్పుడే అది మహాప్రవాహం అవు తుంది. విప్లవోద్యమానికి బాటలు వేస్తుంది. ఈ మహా ప్రవాహానికి దిశానిర్దేశం చేయవలసిన కమ్యూ నిస్టులు గందరగోళానికి గురికానప్పుడే ఇది సాధ్యం. అందుకే కమ్యూనిస్టులు, అన్ని స్థాయిల లోని పార్టీ శ్రేణులు సైద్ధాంతిక స్పష్ట తతో, ఐక్య అవగాహనతో ముందుకు సాగాలి. భావో ద్వేగాలకు లోనయితే నష్టం జరుగుతుంది. మొహమాటానికో, ఎదుటివారి మెప్పు పొందేం దుకో, ఉద్వేగంలోనో కమ్యూనిస్టు అవగాహనకు భిన్నంగా మాట్లాడితే ప్రజాశ్రేణులలో గందర గోళానికి దారితీస్తుంది. కమ్యూనిస్టు శ్రేణుల లోనూ ఐక్యతను బలహీనపరుస్తుంది. మొహ మాటంతోనో లేదా వైరుధ్యాన్ని తప్పించుకోవడం కోసమో కమ్యూనిస్టు వైఖరికి భిన్నంగా వ్యవహ రిస్తే సామాజిక శక్తులు సైతం కమ్యూనిస్టుల నిజాయితీని శంకిస్తారు. అదే సమయంలో కుల వివక్ష వ్యతిరేకంగానూ, కుల నిర్మూలన కోసం జరిగే ఉద్యమంలో కమ్యూనిస్టులు అగ్ర భాగాన నిలబడితే హర్షిస్తారు. కమ్యూనిస్టులతో భుజం భుజం కలుపుతారు. కమ్యూనిస్టుల నిజాయితీని గౌరవిస్తారు. అవకాశవాదం హద్దులను చెరి పేస్తుంది. తప్పులను గుర్తించి సరిదిద్దుకునే లోపే నష్టం జరిగిపోతుంది. సూత్రబద్ధమైన వైఖరి మాత్రమే కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను నిలబెడు తుంది. శ్రామికులను ఐక్య పోరాటం వైపు

(మిగతా 35వ పేజీలో)

## అమెరికా జాతీయ భద్రతా వ్యూహం

# మళ్లీ ఏకధృవ ప్రపంచం కోసం కలలు

**ఎస్. వెంకట్రావు**



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

జరిగే వరకు జయభేరి, జరక్కపోతే రణభేరి అన్నాడట వెనకటికి ఒకడు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెల ప్రకటించిన జాతీయ భద్రతా వ్యూహం (నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీ- ఎన్ఎస్ఎస్) పరిశీలిస్తే ఈ సామెత గుర్తుకు రాక మానదు. అమెరికన్ సామ్రాజ్య వాదులు సాగినంతకాలం ప్రపంచ మీద పెత్తనం సాగించారు. ఏకధృవ ప్రపంచాన్ని ఏలారు. ఇప్పుడు కథ అడ్డం తిరిగి బహుళ ధృవ ప్రపంచం ఏర్పడుతుంటే తట్టుకోలేక పోతున్నారు. బలప్రయోగంతోనైనా అడ్డుకుంటామని రంకె లేస్తున్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటి సారిగా జాతీయ భద్రతా వ్యూహాన్ని (ఎన్ఎస్ఎస్) వెలువరిస్తూ చేసిన ప్రసంగంపై అమెరికా ప్రతిపక్షాలు పెదవి విప్పలేదు. సామ్రాజ్యవాద మీడియా పెద్దగా చర్చించలేదు. ఎందుకంటే అవీ సామ్రాజ్యవాద చట్రంలో భాగమే కనుక. కానీ ప్రపంచానికి ఇది పెద్ద ముప్పును సూచిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

1986లో రొనాల్డ్ రీగన్ హయాంలో చేసిన ఒక చట్టం ప్రకారం ప్రతి ఏటా అమెరికా అధ్యక్ష కార్యాలయం జాతీయ భద్రతా వ్యూహాన్ని (ఎన్ఎస్ఎస్) పార్లమెంటుకు సమర్పించాలి. ఇందులో అమెరికాకు సంబంధించిన ప్రపంచ వ్యాపిత ప్రయోజనాలు, లక్ష్యాలు, కర్తవ్యాలను నిర్దేశిస్తారు. వీటిని సాధించడానికి సమీప కాలంలోనూ, దీర్ఘకాలంలోనూ తీసుకోవలసిన రాజకీయ, ఆర్థిక, సైనిక చర్యలను గురించి వివరిస్తారు.

### ఎన్ఎస్ఎస్‌లోని ప్రధానాంశాలు

"అమెరికాను తిరిగి గొప్ప దేశంగా మార్చడమే" తన లక్ష్యం అని 68 పేజీల ఎన్ఎస్ఎస్ పత్రాన్ని ప్రవేశపెడుతూ ట్రంప్ పేర్కొన్నారు. "అమెరికా ఈనాడు అసాధారణ ప్రమాదాలతో కూడిన ప్రపంచాన్ని ఎదుర్కొంటోంది. ఇటీవలి కాలంలో దానికి ప్రమాదాలు తీవ్రతరమయ్యాయి" అన్నారు. గత ప్రభుత్వాలు "మన సైనిక రంగంలో సరిపడా పెట్టుబడులు పెట్టక పోవడం వల్లనే మనకు హాని చేయాలనుకుంటున్న వారి నుండి ప్రమాదాలు పెరిగాయి" అని పేర్కొన్నారు. "అమెరికా ప్రజల భద్రత కోసం, మన జీవన విధానాన్ని రక్షించుకోవడం కోసం, మన సౌభాగ్యాన్ని పెంపొందించడం కోసం, మన బలం మీద ఆధారపడి శాంతిని రక్షించడం కోసం, ప్రపంచమంతటా అమెరికా ప్రభావాన్ని విస్తరించడం కోసం ఒక వ్యూహాత్మక విజన్‌ను ప్రభుత్వ జాతీయ భద్రతా వ్యూహం మీ ముందు పెడుతోంది" అని ట్రంప్ వివరిస్తూ "ప్రపంచంలోని బలాబలాలు అమెరికాకు, దాని మిత్రులకు, భాగస్వాములకు అనుకూలంగా మారేట్టు మేము చర్యలు తీసుకుంటాం" అని చెప్పాడు. "అమెరికాకు తొలిప్రాధాన్యత (అమెరికా ఫస్ట్) అన్న దానికి నేను ప్రవేశపెట్టిన ఎన్ఎస్ఎస్ ప్రాధాన్యమిస్తుంది" అని పేర్కొన్నారు.

### చైనా, రష్యాలే లక్ష్యం

ప్రపంచ వ్యాపితంగా అమెరికాకు రాజకీయ, ఆర్థిక, సైనిక రంగాల్లో పోటీ పెరిగిపోతోందని వ్యూహ పత్రంలో పేర్కొన్నారు. "చైనా, రష్యాలు అమెరికా అధికారాన్ని, ప్రభావాన్ని, ప్రయోజనాలనూ సవాలు చేస్తున్నాయి. అమెరికా భద్రతను, సౌభాగ్యాన్ని వమ్ముచేయడానికి ప్రయత్నిస్తున్నాయి" అని పేర్కొంటూ అదే సమయంలో ఉత్తర కొరియా, ఇరాన్‌లను కూడా అమెరికా శత్రు శిబిరంలో చేర్చారు. ఈ రెండూ కూడా ఆయా ప్రాంతాలను అస్థిర పరచడానికి ప్రయత్నిస్తున్నాయనీ, అమెరికాకూ, దాని మిత్రులకూ ప్రమాదకరంగా మారాయనీ, వీటితో బాటు జిహాదీ ఉగ్రవాద గ్రూపులు కూడా అమెరికాకు ప్రమాదం తెస్తున్నాయని చెప్పాడు. ఈ మూడు రకాల "ప్రమాదాలను" ఎదుర్కొనేందుకు తను ప్రవేశపెట్టిన జాతీయ భద్రతా వ్యూహం అమెరికాను సిద్ధం చేస్తుందన్నారు.

చైనా, రష్యాల నుండి ఎదురవుతున్న పోటీని తట్టుకోడానికి గాను అమెరికా "గత రెండు దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానాలను మార్చుకోవాలి" అని ట్రంప్ చెప్పారు. "ప్రత్యర్థులను బుజ్జగించడం ద్వారా, అంతర్జాతీయ సంస్థల్లోనూ, ప్రపంచ వాణిజ్యంలోనూ భాగస్వాములను చేయడం ద్వారా వారిని మంచి వారిగా, నమ్మకస్తులైన భాగస్వాములుగా మార్చవచ్చుననే గత విధానాలు విఫలమైనాయి" అని పేర్కొన్నారు. "అమెరికా సైన్యం ఇప్పటికీ ప్రపంచంలో బలమైనది. కానీ ప్రత్యర్థులు వారి సంప్రదాయ, అణు ఆయుధాలను ఆధునీకరించు కోవడం వల్ల అమెరికా ఆధిపత్యం తగ్గిపోతోంది"..."సాంకేతిక పరిజ్ఞానం అందుకుంటున్న బలహీనమైన దేశాలు కూడా ధైర్యం తెచ్చుకుంటున్నాయి"..."అమెరికా సైనిక ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం..మన లక్ష్యం"....అని ట్రంప్ చెప్పారు.

### నాలుగు ప్రధానాంశాలు

అమెరికా జాతీయ భద్రతా వ్యూహం నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉంటుందని పత్రం పేర్కొంది. అవి:

1. దేశ రక్షణ. దేశాన్ని, ప్రజలను రక్షించడం కోసం సరిహద్దుల వద్ద నియంత్రణ, వలసల నిరోధం, సైబర్ దాడుల నుండి రక్షణ మొదలైన చర్యలతో బాటు "క్షిపణి దాడులనుండి రక్షణ కోసం అనేక దశల క్షిపణి రక్షణ వ్యవస్థల అభివృద్ధి", జిహాదీ ఉగ్రవాదుల నుండి రక్షణ కోసం "అమెరికా సరిహద్దుకు ఆవల ప్రమాదాన్ని దాని మూలంలోనే దెబ్బతీసేందుకు దాడులు చేయడం"...మొదలైన చర్యలు ప్రతిపాదించారు.

2. దేశాభివృద్ధి. అమెరికా ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజ పరచడం కోసం "పోటీదారులనుండి అమెరికా ఆర్థిక వ్యవస్థను రక్షించుకోవడం, ఇంధన రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని నిలుపుకోవడం'' ముఖ్యమైన లక్ష్యాలుగా

ప్రకటించారు.

3. సైనిక బలం. "బలప్రయోగంతో శాంతిని రక్షించడం" కోసం సైన్యాన్ని పునర్నిర్మించాలని ప్రకటించారు. "ప్రత్యర్థులను నిలువరించేందుకు అవసరమైతే యుద్ధం చేసి గెలవాలి" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని "కొన్ని ప్రాంతాలపై ఏదో ఒక దేశం ఆధిపత్యం వహించకుండా" చూడ్డం లక్ష్యమని చెప్పారు. ఉమ్మడి శత్రువుపై పోరాడ్డానికి అయ్యే ఖర్చులు భాగస్వామ్య దేశాలన్నీ కలిసి భరించాలని పేర్కొన్నారు.

4. అమెరికా ఆధిపత్యం. అమెరికా ప్రయోజనాలనూ, అమెరికా విలువలనూ విస్తరించేందుకు గాను "మనం అమెరికా ప్రభావాన్ని పెంచుకోవాలి" అని వ్యూహపత్రంలో పేర్కొన్నారు. "ప్రయివేటు రంగం నాయకత్వంలో ఆర్థికాభివృద్ధి జరిగేట్లు మనం ఉత్ప్రేరక పాత్ర పోషించాలి" అని నిర్దేశించారు.

**ప్రమాదకర పోకడ**

రష్యా, చైనాలు అమెరికాకు పోటీదారులుగా తయారయ్యారన్నది ట్రంప్ వాదన. అవి అమెరికా ప్రయోజనాలను వమ్ముచేయడానికి ప్రయత్నిస్తున్నాయి, కనుక వాటి పోటీ నుండి తట్టుకోడానికి అమెరికాను ఆర్థికంగా, రాజకీయంగా, సైనికంగా సిద్ధం చేయా లంటున్నారు. ఆ పేరుతో ట్రంప్ అనేక ప్రమాదకర పోకడలకు తెర తీస్తున్నారు. ట్రంప్ జాతీయ భద్రతా వ్యూహంపై చైనా అధికార పత్రిక పీపుల్స్ డైలీ వ్యాఖ్యానిస్తూ...ట్రంప్ నేటి ప్రపంచ పరిణామాలకు ఎదురీదాల నుకుంటున్నారు అని పేర్కొంది. "అమెరికా తన ఆధిపత్య పోకడలను విడనాడలేదు. ప్రపంచంలో ఏ దేశమైనా తన నీడలోనే ఎదగాలిగానీ తనతో పాటు లేక తనకు మించి ఎదగకుండా ఉండడం కోసం అది ఎంతకైనా తెగిస్తుందనే విషయాన్ని ట్రంప్ ప్రకటించిన వ్యూహపత్రం తెలియ జేస్తోంది. అంతే కాదు ప్రపంచ వ్యవస్థ అమెరికా ప్రయోజనాలు నెరవేర్చాలేగానీ ప్రపంచ దేశాలన్నిటి ఉమ్మడి ప్రయోజనాలు నెరవేర్చడానికి అది అంగీకరించదన్న విషయాన్ని కూడా ఈ పత్రం తెలియజేస్తోంది" అని పీపుల్స్ డైలీ డిసెంబర్ 19 తేదీ ఎడిటోరియల్‌లో పేర్కొంది. చైనా, రష్యాలను ప్రత్యర్థులుగా పేర్కొనడమంటే అమెరికా ఇంకా పాత ప్రచ్ఛన్న యుద్ధ మానసిక ధోరణి నుండి బయటకు రాలేదని అర్థమవుతోంది అని అమెరికాలో చైనా రాయబారి పేర్కొన్నారు.

అమెరికా వ్యూహపత్రం ప్రపంచాన్ని మూడో ప్రపంచ యుద్ధం వైపు తీసుకుపోయే ప్రమాదం ఉందని వాల్ స్ట్రీట్ జర్నల్‌లో చరిత్రకారుడు ఆర్థర్ ఎల్. హెర్మన్ రాశాడు. అమెరికా జాతీయ భద్రతా వ్యూహం ప్రపంచాన్ని "1917 కు ముందు ప్రతి దేశమూ – చిన్నదికానీ, పెద్దదికానీ తన ఆయుధ బలంపైనే ఆధారపడి వ్యవహారాలు నడిపే అరాచక స్థితికి తీసుకుపోతుంది."...దీన్ని ఆమోదిస్తే "బలం ఉన్నవాడు చెప్పిందే వేదంగా నడుస్తుంది. పెద్ద రాజ్యం చిన్న రాజ్యాలపై ఆధిపత్యం వహిస్తుంది." అని ఆయన పేర్కొన్నారు. యుద్ధాల వెల్లువ వెనుక పట్టు పట్టింది అని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇచ్చిన హామీని ట్రంప్ వెనక్కు తిప్పి ప్రపంచాన్ని ఆర్థిక ఏకీకరణ నుండి ఆర్థిక పోటీ వైపు నడుపుతున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఎడిటోరియల్ పేర్కొంది.

> **❝ రష్యా, చైనాలు అమెరికాకు పోటీదారులుగా తయారయ్యారన్నది ట్రంప్ వాదన. అవి అమెరికా ప్రయోజనాలను వమ్ముచేయ డానికి ప్రయత్నిస్తున్నాయి, కనుక వాటి పోటీ నుండి తట్టుకోడానికి అమెరికాను ఆర్థికంగా, రాజకీయంగా, సైనికంగా సిద్ధం చేయాలంటున్నారు. ఆ పేరుతో ట్రంప్ అనేక ప్రమాదకర పోకడలకు తెర తీస్తున్నారు.❞**

గత పాతికేళ్లుగా అమెరికా 'వ్యూహాత్మక నిర్లక్ష్యం' ప్రదర్శించిందని, 'సైనిక సామర్థ్యాన్ని', 'కొత్త ఆయుధాలను' సమకూర్చుకోవడంలో వైఫల్యం చెందిందని ట్రంప్ వ్యూహ పత్రంలో పేర్కొనడం, 'సుదూరం నుండి యుద్ధం చేసి త్వరితంగా, అతి తక్కువ మరణాలతో విజయం సాధించగలం' అని పేర్కొనడం... ఇవన్నీ కూడా అమెరికా కొత్త యుద్ధాలకు ఉవ్విళ్లూరుతోందన్న విషయాన్ని వెల్లడిస్తున్నాయి.

మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన జర్మనీ మీద వెర్సయిల్స్ ఒప్పందాన్ని బలవంతంగా రుద్దిన శక్తుల మీద ప్రతీకారం తీర్చుకోవాలని హిట్లర్ ప్రజలను రెచ్చగొట్టాడు. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు తీవ్రమైన నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభంలో మునిగిన జర్మన్ ప్రజలను హిట్లర్ ప్రతీకార వాక్యాలు ఆకర్షించాయి. దాన్ని ఉపయోగించుకుని దేశాన్ని సైనికీకరించాడు, ప్రపంచాన్ని యుద్ధంలో ముంచాడు. ట్రంప్ వ్యూహ పత్రం దాన్ని గుర్తు చేస్తోంది.

**మళ్లీ ఏకధృవ ప్రపంచం కోసం ఆరాటం**

సోవియట్ విచ్ఛిన్నం తరువాత గత పాతికేళ్లుగా ప్రపంచం మీద సామ్రాజ్యవాదం రుద్దిన నయా–ఉదారవాద ఆర్థిక విధానాలు దివాళా తీశాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలోకి నెట్టబడింది. అమెరికా నాయకత్వంలోని ఏకధృవ ప్రపంచానికి బీటలు పడ్డాయి. బహుళ ధృవ ప్రపంచంలో కొత్త శక్తులు పుట్టుకొస్తున్నాయి. అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్నాయి.

అమెరికా సృష్టించిన బ్రెటన్‌వుడ్ సంస్థలైన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యుటివోలు ప్రాధాన్యత కోల్పోతున్నాయి. వర్ధమాన దేశాల వాణిగా 'బ్రిక్స్' (బ్రెజిల్, రష్యా,భారత్, చైనా, దక్షిణాఫ్రికా) ముందుకొచ్చింది. ఈ కూటమి ఏర్పాటు 'బ్రెటన్ ఉడ్ సంస్థల' నిర్వహణలో అనేక సంస్కరణలకు కారణమైంది. అమెరికా నేతృత్వంలో అప్పటి వరకు ప్రపంచ వ్యవ హారాలు నిర్వహిస్తూ వచ్చిన జి7 ప్రాభవం తగ్గడంతో బ్రిక్స్ దేశాలను కూడా కలుపుకుని జి20 ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఈ ఏడాది బీజింగ్‌లో సమావేశమైన బ్రిక్స్ సమావేశానికి అయిదు దేశాలకు తోడు మరిన్ని దేశాలను ఆహ్వానించారు. బ్రిక్స్+ పేరుతో కూటమిని మరింత విస్తరించే ప్రయత్నాలు జరుగు తున్నాయి.

మరోవైపు ఆర్థిక, సాంకేతిక రంగాల్లో అసాధారణ అభివృద్ధి సాధిస్తున్న చైనా అనేక రంగాల్లో అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసే శక్తిగా ముందుకొస్తోంది. సైనిక సంపత్తిలో సోవియట్ వారసత్వాన్ని నిలుపుకున్న రష్యాతో కలిసి అది ఏర్పాటు చేసిన షాంఘై కో–ఆపరేటివ్ సంస్థ, (ఎస్‌సిఓ) దాని నాయకత్వంలో ఏర్పడిన ఆసియా మౌలిక వసతుల పెట్టుబడి బ్యాంకు (ఎఐఐబి), ప్రపంచ వ్యాణిజ్యాన్ని విస్తరించేందుకుద్దేశించిన ఒన్ బెల్ట్ ఒన్ రోడ్ (ఒబిఒఆర్) ప్రాజెక్టు... ఇవన్నీ అమెరికా ఏకధృవ ప్రపంచానికి చెల్లు చీటీ రాస్తున్నాయి. షాంఘై కో–ఆపరేటివ్ సంస్థ తొలుత అయిదు దేశాలతో ఏర్పడింది. తరువాత దానిలోకి భారత్, పాకిస్తాన్‌తో సహా మరో మూడు దేశాలు చేరాయి. ఇప్పుడందులో 8 సభ్య దేశాలతోపాటు, నాలుగు పరిశీలక దేశాలు, మరో పది దేశాలు వివిధ హోదాల్లో భాగ

> **"అమెరికా విస్తరణ వాదానికి అటు ఉక్రెయిన్‌లో, ఇటు సిరియాలో ఎదురుదెబ్బలు తగిలాయి. సిరియాలో గత మూడే ళ్లుగా రష్యా అండతో అస్సద్ ప్రభుత్వం అమెరికానూ, అది బలపరుస్తున్న ఉగ్రవాద సంస్థలనూ నిలువరించగలిగింది. అలాగే మధ్య ఆసియాలో ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా పన్నిన ఎత్తులు పారడం లేదు."**



అమెరికా జాతీయ భద్రతా సమితి సమావేశం

స్వాములైనాయి. ఆసియాలో అమెరికా ఆధి పత్యాన్ని ఎస్‌సిఓ సవాలు చేస్తోంది.

చైనా ప్రతిపాదించిన ఆధునిక సిల్క్ రోడ్ ప్రాజెక్టు ఆసియా-ఐరోపాల మధ్య వాణిజ్య వారధి నిర్మిస్తోంది. అది ఆసియా, ఆఫ్రికాఖండా ల్లోని అనేక దేశాలను యూరప్ దేశాలతో కలు పుతూ వాణిజ్య కారిడార్ నిర్మాణానికి పెద్ద ఎత్తున ప్రాజెక్టులు చేపట్టింది. ప్రధానంగా చైనా పెట్టుబడులతో ఏర్పాటు చేసిన ఆసియా ప్రాథమిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు (ఎఐఐబి)లో అనేక ఆసియా దేశాలే కాక జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా బ్రిటన్ వంటి అమెరికా మిత్ర దేశా లు కూడా చేరడం అమెరికా ప్రాభవానికి ఎంతగా సవాలు ఎదురవుతోందో తెలియజేస్తోంది.

అమెరికా విస్తరణ వాదానికి అటు ఉ క్రెయిన్‌లో, ఇటు సిరియాలో ఎదురుదెబ్బలు తగిలాయి. సిరియాలో గత మూడేళ్లుగా రష్యా అండతో అస్సద్ ప్రభుత్వం అమెరికానూ, అది బలపరుస్తున్న ఉగ్రవాద సంస్థలనూ నిలువ రించగలిగింది. అలాగే మధ్య ఆసియాలో ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా పన్నిన ఎత్తులు పారడం లేదు. అమెరికా ఒత్తిళ్లకు వ్యతిరేకంగా ఇరాన్ నిలబడడమే కాదు ఇటీవలి కాలంలో టర్కీ, కతర్ వంటి దేశాల మద్దతు కూడా పొందింది.

లాటిన్ అమెరికాలో వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ నాయకత్వంలో ముందుకొచ్చిన సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు క్యూబాతో కలిసి అమెరికా ఆధిపత్యానికి పెద్ద గండి కొట్టాయి. చావెజ్ మరణానంతరం ఈ శక్తులు తీవ్రమైన ఇబ్బందుల్లో పడినప్పటికీ అవి సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సవాలు చేస్తూనే ఉన్నాయి.

కొరియా ద్వీపకల్పంలో దక్షిణ కొరియా, జపాన్‌లను అడ్డం పెట్టుకుని ఉత్తర కొరియాపై అమెరికా సాగిస్తున్న దుందుడుకు చర్యలకు ప్రతిఘటన ఎదురవుతోంది. అమెరికా బెదిరిం పులకు ఉత్తర కొరియా ఎదురు నిలవడం, చైనా అండ దానికి ఉండడం, దక్షిణ కొరియా, జపాన్ ప్రజలనుండి అమెరికా యుద్ధ ప్రయత్నాలకు వ్యతిరేకత పెరగడం ఇవన్నీ కొరియా ద్వీప కల్పంలో అమెరికా కుయుక్తులను పారనీయడం లేదు.

వాతావరణ చర్చల నుండి అమెరికా వైదొలగడం విషయంలోగాని, జెరూసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా ప్రకటించిన విషయం లోగానీ, క్యూబాకు వ్యతిరేకంగా మళ్లీ ఆంక్షలు విధించడం విషయంలోగానీ అమెరికా ప్రపంచ దేశాల నుండి వేరుపడింది. ముస్లింలకు, ముస్లిం దేశాలకు వ్యతిరేకంగా ట్రంప్ వ్యవహరించిన తీరు ప్రపంచ ప్రజల ఛీత్కారానికి గురైంది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన తీసుకుంటున్న అనేక చర్యలను అమెరికా మిత్ర పక్షాలు బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నాయి.

ఈ మొత్తం పరిణామాలు పరిశీలించి నప్పుడు పాతికేళ్ల క్రితం అమెరికా నాయ కత్వం లో ఏర్పడిన ఏకధృవ ప్రపంచం బీటలు వారు తున్న విషయం అర్థమవుతుంది. బహుళ ధృవ వ్యవస్థలోకి ప్రపంచం పయనించే కాలం లో మనం ఉన్నాం. ఈ క్రమం తీవ్రమవుతోంది.

నిన్నటి వరకు అమెరికా ఈ విషయాన్ని గుర్తించకపోయినా నేడు బహిరంగంగా గుర్తించక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. ట్రంప్ ప్రకటించిన జాతీయ భద్రతా వ్యూహ పత్రంలో అమెరికా 'ప్రత్యర్థుల' గురించి, పోటీలో అమెరికా వెనుకబడిపోవడం గురించి మాట్లాడారు. అయి తే ఈ విషయాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదం జీర్ణించుకోలేకపోతోంది. ఆర్థికంగా బలహీన పడినా అది సైనికాధి పత్యంతో తిరిగి తన స్థానాన్ని సంపాదించా లనుకుంటోంది. ఇప్పటికీ ప్రపంచంలో అమెరికా అజేయమైన సైనిక శక్తిగా ఉంది కాబట్టి బహుళధృవం వైపు పోతున్న ప్రపంచాన్ని తిరిగి తన నాయకత్వంలో సైనిక బలం ద్వారా ఏక ధృవ ప్రపంచంవైపు మళ్లిం చాలని చూస్తోంది. ట్రంప్ ప్రకటించిన వ్యూహ పత్రంలో రెండు విషయాలు స్పష్టంగా కనిపిస్తాయి.

మొదటిది, సైనికంగా దేశాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నాలు. వ్యూహ పత్రంలో పేర్కొన్న నాలుగు స్తంభాల్లో రెండు స్తంభాలు పూర్తిగా సైనిక సన్నద్ధతకు సంబం ధించినవే. "అనేక దశల క్షిపణి రక్షణ వ్యవస్థల అభివృద్ధి", "అమెరికా సరిహద్దుకు అవల ప్రమాదాన్ని దాని మూలంలోనే దెబ్బతీసేందుకు దాడులు చేయ డం", "ప్రత్యర్థులను నిలువరించేందుకు అవసర మైతే యుద్ధం చేసి గెలవడం" ప్రపంచంలోని "కొన్ని ప్రాంతాలపై ఏదో ఒక దేశం ఆధిపత్యం వహించకుండా" చూడ్డం.... ఇవన్నీ అమెరికాను యుద్ధానికి సిద్ధం చేసే చర్యలే.

రెండవది, ప్రజలను యుద్ధ చర్యలకు సిద్ధం చేయడం. హిట్లర్‌లాగా ట్రంప్ కూడా ఇతరుల కుట్రలకు అమెరికా ప్రజలు బలై పోయారని వాదిస్తున్నారు. తమ దేశం సృష్టిం చిన డబ్లుటివో వంటి సంస్థలకు తామే బలై పోయినట్లు చెబుతున్నారు. తమ దగ్గర సాంకేతిక పరిజ్ఞానం 'కొట్టేసిన' చిన్న దేశాలు తమనే సవాలు చేస్తున్నా యని వాపోతున్నారు. ఆ విధంగా తాము బాధి

తులం అన్న భావాన్ని అమెరికన్ ప్రజల్లో రెచ్చగొట్టడం ద్వారా వారిని యుద్ధంలో తుపాకీ మందుగా తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

### అమెరికా వ్యూహంలో భారత్

అమెరికా వ్యూహ పత్రం చైనా, రష్యాలను శత్రువులుగా పేర్కొనడంతో పాటు భారత్‌ను తన వ్యూహంలో భాగస్వామిగా పేర్కొనడం పట్ల మన దేశంలో కార్పొరేట్ మీడియా సంబరాలు జరుపుకున్నది. నరేంద్ర మోడీ ప్రభుత్వ ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. "భారత్ ప్రపంచ స్థాయి శక్తి" అని వ్యూహ పత్రం పేర్కొనడం మన దేశం స్థాయిని అమెరికా పెంచడమేనని అనేక కార్పొరేట్ పత్రికలు సంపాదకీయాలు రాశాయి. భారత అధికార ప్రతినిధి దీనిపై హర్షం ప్రకటిస్తూ వ్యూహపత్రం "భారత్–అమెరికా సంబంధాలకు ప్రాధాన్యతనివ్వడం పట్ల హర్షిస్తున్నాం. బాధ్యత గల రెండు ప్రజాస్వామ్యాలు ఒకే లక్ష్యాన్ని పంచుకుంటున్నాయి" అని ప్రకటించారు. "హిందూ మహా సముద్ర భద్రత విషయంలోనూ, మొత్తం సరిహద్దు ప్రాంతమంతటా భారత్ నాయకత్వ పాత్ర"కు మద్దతివ్వాల్సిన అవసరం ఉంది అని పత్రం పేర్కొంది. కానీ ఈ ప్రాంతంలో అమెరికా లక్ష్యం ఏమిటి? అందులో భారత్ భాగస్వామి కావటం ఏమిటి? అనే విషయం చర్చించాలి. వ్యూహ పత్రం చెప్పిన దాని ప్రకారం అమెరికా లక్ష్యం "ఇండో–పసిఫిక్ ప్రాంతం, ఐరోపా, మధ్య ప్రాచ్యా ల్లో ప్రాంతీయ బలాబలాలు (అమెరికాకు) ప్రతికూలంగా మారకుండా నివారించడం" ఆ విధంగా అది అమెరికా ఆధిపత్యాన్ని నిలుపుకునేట్లు ప్రాంతీయ వ్యూహాలు రూపొందిస్తుంది.

ఈ లక్ష్యంలో భారత్ భాగస్వామి కావాలా? అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్య వ్యూహంలో భారత్‌కు ఒక జూనియర్ భాగస్వామి పోస్టు ఇస్తామనడం, దాన్ని మన పాలకులు మహా భాగ్యంగా స్వీకరించడం ఎంత సిగ్గు చేటు విషయం! నిజానికి ఈ పోస్టు ఏనాడో అమెరికా మనకు ఇచ్చింది. చైనాకు వ్యతిరేకంగా అమెరికా నాయకత్వంలోని నాలుగు దేశాల (అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా) కూటమిలో భారత్ భాగస్వామిగా చేరింది. ఈ దేశాలతో కలిసి యుద్ధ విన్యాసాలు నిర్వహిస్తోంది. మలక్కా జలసంధిపై అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్న చైనాను నిలువరించేందుకు అమెరికా ఇటీవలి కాలంలో దక్షిణ చైనా సముద్రంలో భారత్ సేవలను ఉపయోగించుకుంటోంది.

❝ వ్యూహ పత్రం చెప్పిన దాని ప్రకారం అమెరికా లక్ష్యం "ఇండో-పసిఫిక్ ప్రాంతం, ఐరోపా, మధ్య ప్రాచ్యాల్లో ప్రాంతీయ బలాబలాలు (అమెరికాకు) ప్రతికూలంగా మారకుండా నివారించడం" ఆ విధంగా అది అమెరికా ఆధిపత్యాన్ని నిలుపుకునేట్లు ప్రాంతీయ వ్యూహాలు రూపొందిస్తుంది.❞



భారత్–అమెరికా సైనిక అధికారులు

కానీ అమెరికా వ్యూహంలో భాగస్వామిగా మారితే భారత దేశ ప్రయోజనాలకు ఎంత నష్టం జరుగుతుందో మన పాలకులు గ్రహించడం లేదు. మొదటిది, మళ్లీ ఏకధృవ ప్రపంచం కోసం తహతహలాడుతున్న అమెరికాను నిలువరించే శక్తులను బలహీనపరిస్తే అది తిరిగి భారత దేశానికే నష్ట దాయకంగా పరిణమిస్తుంది. ఎందుకంటే సామ్రాజ్యవాదం ఒక్క చైనాకే కాదు మొత్తం వర్ధమాన దేశాలన్నిటికీ శత్రువు. రెండోది, అమెరికా వ్యూహంలో భారత్ చిక్కుకుంటే అమెరికాకు శత్రువులుగా ఉన్న దేశాలను దూరం చేసుకునే ప్రమాదం ఏర్పడుతుంది. చైనాతో మన దేశానికి సరిహద్దు సమస్యలున్నప్పటికీ అమెరికా వ్యూహంలోకి అది వెళ్లిన తరువాతనే రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. రానున్న కాలంలో రష్యా, ఇరాన్ వంటి దేశాలతో కూడా భారత్ తలపడాల్సిన పరిస్థితి వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే మన దేశం అమెరికా ఒత్తిడి వల్ల ఉత్తర కొరియాతో సంబంధాలు పోగొట్టుకునే పరిస్థితికి వచ్చింది.

నిజానికి ఆర్థికంగా బలహీన పడుతున్న అమెరికా ఇటీవల తీసుకుంటున్న పలు నిర్ణయాలు దాని మిత్ర పక్షాలకే రుచించడం లేదు. ట్రంప్ 'అమెరికా ఫస్ట్' నిర్ణయం తీసుకున్నాక ఆసియా, పసిఫిక్‌లో దాని మిత్రులైన ఆస్ట్రేలియా, జపాన్, ఫిలిప్పీన్స్ తదితర దేశాలు, యూరప్ లోని పలు దేశాలూ తమ తోవ తాము చూసుకోవడం ప్రారంభించాయి. చైనా నేతృత్వంలోని ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు(ఏఐఐబి)లో ఆస్ట్రేలియా, బ్రిటన్, జర్మనీ వంటి అనేక దేశాలు చేరడమే దీనికి నిదర్శనం. దక్షిణ చైనా సముద్రంలో చైనా దురాక్రమణకు పాల్పడుతోందని అంతర్జాతీయ కోర్టుకు వెళ్లిన ఫిలిప్పీన్స్ తరువాత చైనాతో కలిసిపోయి అమెరికాను దూరం పెట్టడం ప్రారంభించింది. చివరికి జపాన్ కూడా చైనాతో వాణిజ్యాన్ని పెంచుకోడానికి స్నేహ హస్తం చాచుతోందని వార్తలొస్తున్నాయి. ఈ దేశాలన్నీ కూడా అమెరికా అభ్యంతరాలను ఖాతరు చేయకుండా చైనావైపు చూస్తున్నాయన్న విషయం గుర్తించాలి.

అందుకని నేటి అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ ప్రకటించిన వ్యూహ పత్రం పరిశీలించినప్పుడు మనకు అర్థమయ్యేది ఒక్కటే. ఈ రోజు ప్రపంచ యవనిక మీద అమెరికా అంటే యుద్ధం, ఆయుధాలు, ఘర్షణలు చైనా అంటే వాణిజ్యం, మౌలిక వసతులు, అభివృద్ధి. ఏ మార్గంలో వెళితే భారత దేశానికీ, ప్రజలకూ లాభమో మన దేశం ఆ మార్గంలో వెళ్లాలని పాలకులను ఒత్తిడి చేయడం అవసరం. ❋

విశ్లేషణ

# విఫలమైన ఆధార్

**జీన్ డ్రెజ్, రితికా ఖేరీ,**
**నజీర్ ఖలీద్, అన్‌మోల్ సోమంచి**

> కొసరంత జ్ఞానం ప్రమాదాలకు మూలం లోతైన అధ్యయనం చేయలేకపోతే జ్ఞాన సంద్రానికి దూరంగా ఉండడం మేలు. పిసరంత జ్ఞానసేవనం మెదడుకు విషాన్నే ఎక్కిస్తుంది మరింత సేవించి మాత్రమే మెదడును కాపాడుకోగలవు.
>
> **- అలెగ్జాండర్ పోప్**

అలెగ్జాండర్ పొప్ మాటలు ప్రత్యేక గుర్తింపు గలిగిన ఆధార్ ప్రాజెక్ట్‌కు సరిగ్గా వర్తిస్తుంది. ఇది మొదలు పెట్టింది భారత దేశీయులకు ప్రతి ఒక్కరికి ఒక గుర్తింపు సంఖ్యను కేటాయించాలని తద్వారా సామాజిక సంక్షేమ కార్యక్రమాలు మరింత పారదర్శకంగా అమలు జరిగి అవినీతిని అరికట్టాలని, మధ్యవర్తుల ప్రమే యం తగ్గి అందాల్సిన వారికి ప్రయోజ నాలు అందుతాయని, మహాత్మాగాంధీ జాతీయ ఉ పాధి హామీ పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థలు మరింత సమర్ధవంతంగా పనిచేయడానికి వీలవు తుందని మొదట్లో ప్రభుత్వం చెప్పింది. కానీ ఇవి నెరవేరలేదు.

సరైన గుర్తింపు లేక ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదని ఆధార్ మొదలు పెట్టారు. ఇప్పుడున్న గుర్తింపు లలో దేనినయినా ఒకదానిని అందరికి వర్తిం చేలాగా రూపొందిస్తే సరిపోయేది. కానీ ఉన్న వివరాలు తప్పులు తడకలుగా ఉన్నాయని అందు వలన కొత్త విధానం అవసరమని ప్రభుత్వం అన్నది.

జాతీయ జనాభా నమోదు ఆధారంగా కాక ఆధార్‌ను రెండు విధాలుగా పొందవచ్చు. ఒకటి ఇప్పుడున్న అడ్రస్ ధ్రువీకరణ- రేషన్ కార్డు వగైరాలను సమర్పించి, రెండు ఎవరైనా పరి చయం చేసే విధానం ద్వారా- ఏ ఆధారం లేనివారిని దృష్టిలో పెట్టుకుని ఈ సౌకర్యం కల్పించడం జరిగింది.

ఇక్కడ మనం గమనించాల్సింది ఏమిటంటే ఎవరో ఒకరి పరిచయం ద్వారా ఇచ్చిన ఆధార్ కార్డులు 0.03% ఉండగా మిగిలినవన్నీ తప్పుల తడకలుగా ఉన్నాయని చెప్పుకున్న ప్రస్తుత గుర్తింపుల ఆధారంగా ఇచ్చినవే. అందువలన ఆధార్ మీద ఆధారపడడం సముచితం కాదు. ఈ ఆధార్ గణాంకాలకు ఎటువంటి అడిట్ జరగలేదు. అందువలన ఇందులో ఎన్ని తప్పులు న్నాయో మనకు తెలియదు. అయితే ప్రచార మాధ్యమాలలో ఈ తప్పులను ఎత్తి చూపిస్తున్నారు.

ఆధార్‌ను ప్రచారం చేసే వారు మాత్రం ఆధార్ ఉంటే ప్రభుత్వం అందించే అన్ని ప్రయోజ నాలు సమకూరుతాయని నమ్మించ గలిగారు. 1993-94 ఎంఎస్ఎస్ ఓ గణాం కాల ఆధా రంగా రాష్ట్రాల వారీగా సేకరించిన గణాంకాల ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు జరిగేవి. 2013 తరువాత జాతీయ ఆహార భద్రతా చట్టం ఆధారంగా ఈ కేటాయింపులు జరుగు తున్నాయి. ఎన్నో స్కీములకు, పెన్షన్‌లు, వగైరాలు ఆహార ఆధారంగానే అమలు జరుగుతున్నాయి. ఈ మార్పు వలన కుదింపులు జరిగాయి. అందువలన ఆధార్ గుర్తింపు ఉండడమా లేదా అన్నది సమస్య కాదిక్కడ. ఆధార్ ద్వారా ఈ ప్రయోజనాలను కుదించడమే అసలు ఉద్దేశం. కొందరికయితే ఆధార్ పొందడం అంత సులభమైన విషయం కాదు.

**అవినీతి ఆధార్ తో అంతమయ్యేనా ?**

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి, ప్రజా పంపిణీ, పెన్షన్ లాంటి కార్యక్రమాలలో అవినీతిని అంతమొందించడం ఆధార్ మరో లక్ష్యం. వీటి లో అవినీతిని మూడురకాలుగా విభ జించవచ్చు. 1. అర్హులను గుర్తించడంలో - అర్హులు కానీ వారు కూడా ప్రయోజనాలు పొందడం, 2. గుర్తింపును గుర్తించడంలో- ఒకరిబదులు వేరొకరు ప్రయోజనాలు పొందడం 3. పరిమాణం లో అవినీతి - అర్హులయినవారు ప్రయోజనం పొందకుండానే పొందినట్టు సంతకాలు తీసుకో వడం వంటివి. ఉదాహరణకి అర్హులను గుర్తిం చేందుకు ఆధార్‌ను ఉపయోగించేటప్పుడు ప్రజాపంపిణీ వ్యవస్థలో డీలర్ డూప్లికేట్ ఆధార్‌లను సృష్టించవచ్చు. లేనివారి ఆధార్‌లను ఉపయోగించవచ్చు. మధ్యాహ్నం భోజన పథకం లో వాస్తవంగా భోజనం పెట్టినవారికన్నా ఎక్కువ మందికి భోజనం పెట్టినట్టు చూపవచ్చు. ఎంజి ఎంఆర్ ఈజిఏ పథకంలో పనిచేసిన వారు ఆధార్ కార్డు ఉన్నవాడే కావాల్సిన పనిలేదు. ఆధార్‌కు అనుగుణంగా బ్యాంకులలో డబ్బులు వేసినా ఖాతాదారుడు డబ్బులు తీసుకుని పనిచేసిన అసలు వ్యక్తికి ఇవ్వవచ్చు. బయోమెట్రిక్ ఉప యో గించినా పరిమితంగానే అవినీతిని ఆప గలం. అందువలన ఆధార్ వలన అవి నీతిని అంతం చేయడం సాధ్యపడదు.

**సంక్షేమం కోసం ఆధార్**

సంక్షేమ పథకాలకు ఆధార్‌ను అను సంధానం చేయవచ్చు. కానీ ఆధార్‌ను సాఫ్ట్‌వేర్ కి అనుసంధానం చేయడం అనిపించినంత సులువు కాదు. ప్రతి స్కీంకి దానికి అర్హులయిన వారి వివరాలను వారి ఆధారాలతో సహా ఇచ్చి అనుసంధానం చేయాలి. ఆ సమయంలో నెంబర్ సరిగా ఎక్కించలేకపోయి ఉండవచ్చు. వేలిముద్రలు సరిగా పడి ఉండకపోయి ఉండవచ్చు. ఒక్కొక్క సారి బయోమెట్రిక్ తిరిగి చేయవలసి వస్తుంది. ఏమయినప్పటికీ ఆధార్ కి సరైన ఆధారాలుపూర్తిగా నూటికి నూరు శాతం సరిగా తీసుకుంటే మాత్రమే ప్రజా పంపిణీ వ్యవస్థలో గుర్తింపు అవకతవకలు అరికట్టవచ్చు.

గుర్తింపు విషయాన్నే తీసుకుందాం. ఆధార్ వలన సరైనా వినియోగదారులను గుర్తించగలిగామని బోగస్ కార్డులను ఏరి వేయ గలిగామనిప్రభుత్వం చెపుతున్నది. ఉదాహరణకు 2013-16మధ్య కాలంలో 2.03 కోట్ల కార్డులు బోగస్ కార్డులుగా గుర్తించి ఏరివేశామని ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించింది. అయితే ఇవి బోగస్ కార్డులు కాదు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన పరిమితులవలన కొంతమంది ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలకు అర్హులు కాకుండా పోయారు. వారినే ప్రభుత్వం బోగస్‌గా చిత్రీ కరిస్తున్నది. ఉదాహరణకి కర్ణాటకలో 2014 లో ఆ రాష్ట్రంలో ఉన్న కార్డులో 40% రేషన్ కార్డులు తొలగించింది. 2015లో 7% తొల గించింది. ఆ రాష్ట్రంలో మొత్తం కార్డుల సంఖ్య 1.31 కోట్ల నుండి 1.29 కోట్లకు పడి పోయింది. అంటే 2% మాత్రమే తగ్గాయన్న మాట. 2014 లోకార్డులు తొలగిం చినా మళ్ళీ దాదాపు అదేసంఖ్యలో కొత్త కార్డులు చేరాయి. మొత్తంమీద కూడా 6.6% మాత్రమే కార్డులు తొలగించినందు వలన కార్డుల సంఖ్యపెద్దగా తగ్గలేదు. కేవలం దృష్టి మరల్చడానికే ఈ తతం గం సరిపోయింది. మరో ముఖ్య మైన విషయం,

2016 ఏప్రిల్ నాటికి సగం రేషన్ కార్డులు మాత్రమే ఆధార్తో అనుసంధానం చేయబడ్డాయి.

పోనీ రేషన్ దుకాణాలలో సరుకులు వినియోగదారులకు ఇచ్చే విషయంలో ఏమన్నా అవినీతిని అరికట్టగలిగారా అంటే అదీ కనిపించడం లేదు. పాస్ (pos) యంత్రాలు రాక ముందు పరిణామంలో జరిగే మోసాలను ఆధార్ అరికట్టగలిగిందా అంటే లేదనే చెప్పు కోవాలి. కొన్ని రాష్ట్రాలలో నెలమొత్తంలో ఇవ్వవలసిన సరుకులను డీలర్లు ఎగ్గొడుతున్నారని తేలింది. మరికొన్ని రాష్ట్రాలలో నెలకివ్వాల్సిన సరుకులకు కోత పెట్టడమేకాక కొన్ని సరుకులను మిగిలి పోయిన సరుకులంటూ బహిరంగ మార్కెట్లోకి తరలిస్తున్నారు. అనేక రాష్ట్రాలలో ఈ తతంగం జరుగుతున్నట్టు గుర్తించడం జరిగింది.

ఆధార్‌ను బయోమెట్రిక్‌తో అనుసంధానం చేయటం వలన కొంతమంది అర్హులు కూడా తమ బయోమెట్రిక్ వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోలేక రేషన్ కోల్పోతున్నారు. వేలిముద్రలు సరిగా వేయలేకపోవడం. పోస్ యంత్రాలు సరిగా పనిచేయక పోవడం ఆధార్ రూపొందించినపుడు ఏర్పడ్డ పొరపాట్ల వలన పేదలు రేషన్‌కి అర్హులయినా పొందలేక పోతున్నారు. ఈ మధ్యనే జార్ఖండ్‌లోని 900 కుటుంబాలలో చేసిన ఒక సర్వేలో పేద కుటుంబాలు ఈ అనుసంధానం తరువాత ఆహారానికి ఎక్కువడబ్బుఖర్చు చేయాల్సి వస్తున్నదని తేలింది. ముఖ్యంగా నడిచి దుకాణాలకు వెళ్లలేని పెద్ద వాళ్లు, చిన్న పిల్లలు ఉండి భర్తలను కోల్పోయిన స్త్రీలు ఇటువంటి బాధలకు గురవుతున్నట్టు తేలింది.

"ఈ మధ్యనే జార్ఖండ్‌లోని 900 కుటుంబాలలో చేసిన ఒక సర్వేలో పేద కుటుం బాలు ఈ అనుసంధానం తరువాత ఆహారానికి ఎక్కువడబ్బుఖర్చు చేయాల్సి వస్తున్నదని తేలింది. ముఖ్యంగా నడిచి దుకాణాలకు వెళ్లలేని పెద్ద వాళ్లు, చిన్న పిల్లలు ఉండి భర్తలను కోల్పోయిన స్త్రీలు ఇటువంటి బాధలకు గురవుతున్నట్టు తేలింది."



ఇ-పోస్‌తో ఆధార్ అనుసంధానం

ఇక మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధికి అధార్ అనుసంధానం సంగతి చూద్దాం. ఈ పనులకు చేసే ఖర్చులలో 60 శాతం సరుకులకు, మిగిలినది జీతాలకు కేటాయించడం జరుగుతుంది. 2008 లో ప్రభుత్వం జీతాలను బ్యాంకు ఖాతాలలోనే జమ చేయాలని నిర్బంధించింది. కానీ ఇక్కడకూడా అను సంధానం అవినీతిని ఆపలేదు. బ్యాంకులలో వేసిన డబ్బును బలవంతంగా లాక్కోవడం, అర్హుడికి తెలియకుండా బ్యాంకు ఖాతాను తెరవడం, లేదా బోగస్ జాబ్ కార్డులు సృష్టించడం జరుగుతున్నాయి.

పెన్షన్లు పంచే విషయంలో కూడా ఆధార్ అనుసంధానం అవినీతిని రూపుమాపిందని చెప్పలేము. పెన్షన్ పొందుతున్న వ్యక్తి చనిపోయినా పెన్షన్ ఆపివేయని సంఘటనలు ఉన్నాయి. అలాగే ఒకరి పెన్షన్ మరొకరికి ఇవ్వడం గాని, పంచే వ్యక్తే కాజేయడంగాని జరుగుతున్నది. పెన్షన్లు డబ్బు రూపంలో ఇచ్చేటప్పుడు ఈ విధమైన అవినీతి జరుగుతుంది.

ఆధార్ అనుసంధానం వలన ఎంజిఎంఆర్ ఇజిఏలో రూ.7,633 కోట్లు పొదుపు చేయగలిగామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సరైన జాబ్ కార్డులు లేక, కుటుంబాలు ఊరుమారడం లాంటి ఇతర అనేక కారణాల వలన ఏర్పడిన మిగులు అని తేలింది. అంతేకాక ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేయడం వలన బ్యాంకులలో ఖాతాలు తెరవలేని వారు, ఆధార్‌లో వివరాలు సరిగా నమోదు చేయించు కోలేని అనేకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొంతమందికి రెండుమూడు బ్యాంకు అకౌంట్లు ఉండడం వలన ఏ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం అయిందో తెలుసుకోలేక సొమ్ము తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి.

అసలు ఆధార్ పార్లమెంట్లో ప్రవేశ పెట్టడమే దొడ్డిదారిలో ద్రవ్య బిల్లుగా ప్రవేశ పెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. 150 సవరణాలున్న బిల్లును ఆర్థిక మంత్రి జైట్లీ ప్రవేశ పెట్టి దానికి మరో 33 సవరణలు కలిపారు. ఆ బిల్లుపై ఏ చర్చా జరగలేదు. 2010లో మొదటి సారిగా యూపిఏ ఈ బిల్లును ప్రవేశ పెట్టినపుడు స్టాండింగ్ కమిటీకి పంపబడింది. అప్పటి ప్రతిపక్షాలన్నీ దీనిలోని లోపాలను ఎత్తిచూపాయి. దీనిని అమలుపరిచిన దేశాలలో అది ఏ విధంగా విఫలమయిందో చూపించాయి. కమిటీ యూఐడి పథకానికి ఒక దిశ దశ లేవని, లోపభూయిష్టంగా ఉన్నదని, అత్యుత్సాహంతో అమలు జరుగుతున్నదని, గణాంక వివరాలకు సంబంధించిన గోప్యత గురించి తగిన చట్టాలు చేయలేదని, అందరికి ఆధార్ నంబర్లు ఇవ్వడం వలన నేరపూరితంగా దేశంలో చొరబడ్డవాళ్ళకు కూడా ఆధార్ నంబర్ వచ్చే అవకాశం ఉందని అందువలన దేశ పౌరులు నష్టపోతారని కొన్ని అభ్యంతరాలను వెలిబుచ్చింది. 2015 అక్టోబర్ లో సుప్రీం కోర్టు ఆధార్ తప్పనిసరి కాదని కేవలం వ్యక్తుల ఇష్టానికి అనుగుణంగా పొందవచ్చని తీర్పునివ్వడమేకాక కోర్టు తీర్పు నిచ్చేవరకు ఆధార్‌ని తప్పనిసరి చేయకూడదని చెప్పింది. మళ్లీ 2016 సెప్టెంబర్‌లో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి ఆధార్‌ని తప్పని సరి చేయడాన్ని తప్పుపడుతూ ఇదివరకటి తీర్పునే తిరిగి చెప్పింది. నిజానికి 2014 ఏప్రిల్ 8 వ తేదీ మోడీ 'ప్రధాన మంత్రిగానీ ఆయన సహచరులు గాని నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పనే లేదు. కేవలం రాజకీయ గిమ్మిక్ తప్ప ఇందులో దూరదృష్టిలేనేలేదని" ట్వీట్ చేసారు. కానీ ఈ

> **ఆధార్ చట్టంలోని సెక్షన్ 33 ప్రకారం దేశ రక్షణ పేరుతో ప్రభుత్వానికి ప్రతి పౌరుడి పైనా నిఘా పెట్టే హక్కు ఉంది. ప్రభుత్వం ఎవరికీ జవాబుదారీ కాదు. ప్రజాస్వామ్య పాలనలో వ్యక్తిగత గోప్యత పౌరుల హక్కు. వ్యక్తిగత గోప్యత ఉంటేనే వ్యక్తిగత స్వతంత్రత ఉంటుంది. భావావేశాలు వ్యక్తీకరించుకో గలుగుతారు. ఆవిష్కరణలు చేయగలుగుతారు.**



చౌకధరల డిపోనుండి రేషన్ తీసుకుంటున్న పేదలు

రోజు మోడీ ప్రభుత్వం ఆమోదించిన 2016 ఆధార్ చట్టంలోని యూనిక్ ఇదెంటిఫికేషన్ అథారిటీ అఫ్ ఇండియా రక్షణ గురించి ప్రశ్నించి నట్టయితే ఏ పౌరునిపైన అయినా ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు. ఆ విధంగా సమాచార సేకరణ హక్కు నీరుగారిపోయింది.

ఆధార్ చట్టం లోని సెక్షన్ 33 ప్రకారం దేశ రక్షణ పేరుతో ప్రభుత్వానికి ప్రతి పౌరుడి పైనా నిఘా పెట్టే హక్కు ఉంది. ప్రభుత్వం ఎవరికీ జవాబుదారీ కాదు. ప్రజాస్వామ్య పాలనలో వ్యక్తిగత గోప్యత పౌరుల హక్కు. వ్యక్తిగత గోప్యత ఉంటేనే వ్యక్తిగత స్వతంత్రత ఉంటుంది. భావావేశాలు వ్యక్తీకరించుకో గలుగుతారు. ఆవిష్కరణలు చేయగలుగుతారు. నిరంతర నిఘాలో స్వేచ్ఛగా ఆలోచించడం అసాధ్యం. ఆధార్ ఆ స్వేచ్ఛను హరించింది.

వ్యక్తుల వ్యక్తిగత వివరాలు బహిర్గతం చేయబడుతున్నాయనేందుకు ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు ధోని వివరాలు ప్రచురించబడడం ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అంతేకాదు జార్ఖండ్ లో ప్రభుత్వ వెబ్ సైట్‌లో లక్షమంది వివరాలు వెల్లడించబడ్డాయి. కారకులెవరో కను గొనలేక పోయారు. జులైలో జరిగిన వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో 210 కేంద్ర, రాష్ట్ర వెబ్ సైట్స్‌లో ఆధార్ నంబర్ల వివరాలు వెల్ల డించ బడ్డాయి అని పార్లమెంటులోనే వెల్లడించబడింది. ఆగష్టు నెలలో పంజాబ్ లో 20,000 మంది ప్రజల గురించిన వివరాలు ప్రచురితమయ్యాయి. బెంగుళూరుకి చెందిన ఓ కంప్యూటర్ నిపుణుడు ఒక యాప్ అభివృద్ధి చేసి ఆధార్ వివరాలు పొందేట్టు చేయగలిగాడు. ఆధార్ ఎంత తప్పులమయమంటే 2015 మధ్యప్రదేశ్ లో ఓ కుక్క ఆధార్ నంబర్ పొందగలిగింది. మరోచోట హనుమంతుడికి ఆధార్ నంబర్ కేటాయించారు.

ఆధార్ లేకుండా కూడా ప్రజా సంక్షేమ పథకాలు పకడ్బందీగా నడపవచ్చు. నిజానికి ఆధార్‌ను ప్రజాసంక్షేమం కోసం అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు దానిని నిఘాగా పౌరులపై ఉపయోగిస్తుంది. ఆధార్‌ను బ్యాంకు ఖాతాలకు, ఫోన్లకు అనుసంధానం చేయమని బలవంత పెడుతున్నది. ఆధార్‌లో వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని అంతా పెట్టుకుని ఆ సమాచారానికి ఎటువంటి రక్షణ కల్పించకుండా అందర్ని ప్రతి అంశంతో జోడించమంటున్నది . రైల్వే టికెట్ అయినా విమాన టికెట్ అయినా ఆధార్ అనుసంధానం చేయమంటున్నారు. దీనివలన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగడమే కాక వ్యక్తులకు సంబంధించిన సమాచారమంతా ఎవరయినా ఎలాగయినా ఉపయోగించుకునే వీలు ఏర్పడుతున్నది. ఉదాహరణకి బ్యాంకు అకౌంట్ల అనుసంధానంతో ఖాతాలలో సొమ్ము వివరాలు తెలుసుకుని సొమ్ము కాజేసిన సందర్భాలు అనేకం బయటపడ్డాయి. అలాగే ఫోన్‌కి అనుసంధానం చేయడం వలన తప్పుడు మెసేజ్ లతో విసిగించడం, హింసించడం జరుగుతున్నది. ప్రైవేట్ వ్యక్తులు ఎవరు ఏ సమాచారాన్ని పొందుతున్నారో సదరు వ్యక్తికి తెలుసుకునే అవకాశం లేదు. ప్రభుత్వం సమాచారాన్ని గోప్యంగా ఉంచేందుకు ఏ చర్య తీసుకోవడం లేదు. అంతటి సమర్ధత కూడా ప్రస్తుతానికి మన ప్రభుత్వానికి లేదు. పైగా ప్రభుత్వం తనకు అనుకూలంగా లేని వ్యక్తులపై కక్ష తీర్చుకోడానికి కూడా ఈ ఆధార్ అనుసంధానాన్ని ఉపయోగించుకోవచ్చు. మనకు తెలియకుండా మన ఆధార్ నంబరును తీసేయవచ్చు. లేదా కొన్నాళ్ళు పనిచేయకుండా ఆపవచ్చు. అప్పుడిక మన బ్యాంకులో ఎన్ని డబ్బులున్నా మనం వినియోగించలేము. మనం ప్రయాణాలు చేయలేము. ఫోన్‌ను ఉపయోగించలేము. ఇది పూర్తిగా వ్యక్తి స్వేచ్ఛపై దాడే.

సంక్షేమ కార్యక్రమాలు వినియోగదా రులకు సక్రమంగా చేరాలి. అవకతవకలను నిలువరించాలన్న లక్ష్యంతో ఆధార్‌ను విస్తృతంగా వినియోగించడం మొదలుపెట్టాలని అందుకే దీన్ని బ్యాంకు, ఫోన్ లకు అనుసంధానం చెయ్యాలని ప్రభుత్వం చెపుతున్నా వాస్తవానికి ఆ లక్ష్యాలు నెరవేరకపోగా ప్రజలు తమ వ్యక్తిగత గోప్యత హక్కును కోల్పోతున్నారు.

సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు చేరే విధంగా చేసేందుకు అనేక మార్గాలున్నాయి. అంతెందుకు ఉన్న గుర్తింపు కార్డులలోని అవకతవకలను సరిచేయవచ్చు కదా ! ప్రభుత్వం వాటిని ఉపయోగించుకుంటే భారత ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని భద్రపరిచి వారిని అనేకరకాల సమస్యలనుండి రక్షించ గలుగుతుంది. ఆధార్‌ను పూర్తిగా సురక్షితంచేసి వివరాలు నూటికి నూరుశాతం సరైనవిగా క్షుణంగా నిర్ధారించిన తరువాతే దాని సంపూర్ణ వినియోగానికి ప్రయత్నం చేయాలి.

**అనువాదం : కె. ఉషారాణి**

ఈ మాసం ప్రత్యేకం

# అక్టోబర్ విప్లవం జాతీయోద్యమం

**ఆర్. విజయకుమారి**

భారత స్వాతంత్ర్య సంగ్రామం జరుగుతున్న తీరు తెన్నులను అక్టోబరు మహావిప్లవం మిక్కిలి ప్రభావితం చేసిందనడానికి ఎటువంటి సందేహము లేదు. అది సాధించాలనుకున్న రాజకీయ స్వాతంత్ర్యంతో పాటు ఆర్థిక స్వాతంత్ర్యానికి కూడా దారి తీసేలా ప్రభావితం చేసింది.

1930ల్లో పెరియార్ తన యూరప్ పర్యటనలో భాగంగా దాదాపు మూడు నెలల పాటు సోవియట్ యూనియన్లో గడిపారు.

దక్షిణ భారతదేశంలో గాంధేయవాది, జాతీయ వాది మరియు ద్రవిడ ఉద్యమానికి మూలపురుషుడైన ఈ.వి.ఆర్ పెరియార్, వామ పక్షవాదిగా లేకుండా సోషలిస్టు భావజాలాన్ని ప్రచారం చేసిన వారిలో మొట్టమొదటివాడు. రాడికల్ దృక్పథం కలిగిన వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కావాలని కోరినా, అంగీకరించనందుకు కాంగ్రెస్ పార్టీ నుండి బయటకు వచ్చేసారు. 1925లో నాగపట్టణంలో రైల్వే కార్మికుల సమ్మె సందర్భంగా, ట్రేడ్ యూనియన్ తొలి దశలో ఉన్న నేపథ్యంలో ఆ నాయకులతో ఏర్పడిన సంబంధాల వలన తన మొదటిదశ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆ సమ్మెకు మద్దతిచ్చినందుకు పెరియార్‌ను అరెస్టుచేశారు. దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభించిన తొలితరం నాయకుడు సింగరవేలు ఆయనకు తోడుగా నిలిచాడు. సామాజిక న్యాయం కోసం ఆయన పడిన తపనని ముందుకు తీసుకెళ్లడానికి ఒక తోడు కుదిరింది. పెరియార్ నడిపిన "కుండి అరసు" పత్రికలో సింగరవేలు ఉన్నో వ్యాసాలు అందించారు.

1931 అక్టోబరు 4వ తేదిన "కుండి అరసు" తన సంపాదకీయం కమ్యూనిస్టు ప్రణాళికను తమిళ ప్రజలకు పరిచయం చేసింది. మరొక కమ్యూనిస్టు కురువృద్ధుడు పి.జీవనాథుడు ఈ ప్రణాళికను తమిళంలోకి అనువదించగా దానిని సీరియల్‌గా ప్రచురించారు. 1925లో ఎస్. రామనాథన్ ప్రారంభించిన ఆత్మగౌరవ ఉద్యమంలో ఆయన సభ్యుడు. ఆ సంపాదకీయంలో వొక్కాణించిన ప్రకారం ప్రపంచంలో ఎన్నో శతాబ్దాల క్రితమే సోషలిస్టు భావజాలం వ్యాపించినప్పటికీ, అది ఓ రూపాన్ని సంతరించుకున్నది మాత్రం 1847లోనని, 1917లో రష్యాలో అది ఒక రాజకీయ పునాది ఏర్పరుచుకుందని ఉద్ఘాటించారు.

మాకు దానికి సంబంధించిన రిపోర్టు దొరికింది. మొట్టమొదటగా ఈ సోషలిస్టు సిద్ధాంతాన్ని జర్మనీలో చర్చకు పెట్టినప్పటికీ, లండన్‌లో సోషలిస్టుల సమావేశం జరిగింది. సోషలిజం కోసం ఫ్రాన్స్‌లో పోరాటం జరిగిందని, కాని ఆచరణలో అది రష్యాలో సాధ్యమయిందని పేర్కొన్నారు. ఇది కొంతమందికి ఆశ్చర్యం కలిగించింది కాని, నిజానికి ఆశ్చర్యపడాల్సిన దేమీ లేదని, ఎందుకంటే, ప్రపంచంలో ఉన్న అన్ని ప్రభుత్వాల కన్న రష్యాలో ఉన్న జార్ ప్రభుత్వం అత్యంత రాక్షసమైనదని, అందుకే అక్కడ సాధ్యమయిందని పేర్కొన్నారు. ఈ తర్కంతో ఆలోచిస్తే, వాస్తవానికి రష్యాలో కాకుండా భారతదేశంలో ఆ పరిస్థితి తలెత్తి ఉండాల్సింది. భారతదేశంలోని దోపిడి దారులు చాలా తెలివితేటలతో వ్యవహరించి, ఆటవిక రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని, దేశ ప్రజలతో ఎక్కువమందికి విద్యని, జ్ఞానాన్ని, ఆత్మ గౌరవాన్ని అందించే పద్ధతులను దూరంచేసి, దేవుని పేరుతో, మతాలపేరుతో ఇదంతా దేవుని ఆకాంక్ష ప్రకారమే జరుగుతోందని, అలా కొనసాగితేనే మోక్షం లభిస్తుందని భ్రమింపజేశారు.

భారత దేశ ప్రజలకి, విప్లవ భావజాల వ్యాప్తికి మధ్యలో ఉన్న ఆటంకాల గురించి ఆ ఎడిటోరియల్ ఇలా రాసింది.

సోషలిస్టు భావజాలం ప్రపంచంలో చాలా భాగం వ్యాపిస్తోంది. ఆ నేపథ్యంలోనే భారత దేశంలోనూ దాని ఆనవాలు తలెత్తడం ప్రారంభమైంది. కాని దేశంలో ఓ పెద్ద అవరోధం దానిని ముందుకు సాగకుండా చేసింది. ఇటువంటి అవరోధం ప్రపంచంలో మరే దేశంలో లేదు. ఇతర దేశాల్లో ఉన్నది పెట్టుబడిదారులకి, కార్మిక వర్గానికి మధ్య ఉన్న వైరుధ్యమే. కాని భారతదేశంలో దీంతోపాటు అదనంగా అగ్ర కులాలు, నిమ్నకులాలు అనేటి అంశం చాలా కీలకమైన వైరుధ్యంగా ఉన్నందున ధనిక, పేదల మధ్య అడ్డుగోడలు ధృడంగా స్థిరపడ్డాయి. ఈ రెండు వైరుధ్యాలు కలిసి ఉండటం వలనే సోషలిస్టు భావజాలంబలపడకుండా ఉండిపోయింది.

ఈ సంపాదకీయం ప్రచురితమైన రెండు నెలల తర్వాత పెరియార్, రామనాథన్‌తో ఆర్. రాము అనే తన బంధువుతో యూరప్ ప్రయాణమయ్యాడు. 1931 డిసెంబర్ 31 మద్రాసు హార్బర్ నుండి బయలుదేరిన ఈ ప్రయాణం 1932 నవంబర్ 7న ముగిసింది. ఈ మధ్య కాలంలోనే పెరియార్ మూడు నెలల పాటు సోవియట్ యూనియన్‌తో గడిపారు. అతను పరిపూర్ణ సోషలిస్టుగా మారడానికి అదే కారణమయ్యింది.

చాలాకాలం తర్వాత 1972లో పెరియార్, ఉన్మయ్' అనే ద్రవిడ ఖజగం పత్రికలో సోవియట్ యూనియన్‌లో సాధించిన విజయాలను వివరిస్తూ ఇలా పేర్కొన్నారు.


రష్యాలో తల్లిదండ్రులకు పిల్లల్ని పెంచి పెద్దచేయాలన్న తప్పనిసరి బాధ్యతలు లేవు. ప్రభుత్వమే ఆ బాధ్యతను నిర్వర్తిస్తుంది. మన దేశంలో మాకు పిల్లలు ఎందుకు అని ప్రశ్నిస్తే, నేను చనిపోయిన తరువాత నా అంత్యక్రియలు నిర్వహించటానికి, వృద్ధాప్యంలో మమ్మల్ని ఆదుకుని, కాపాడుకోవటానికి, ఆస్తికి తదనంతర వారసుడని సమాధానం ఇస్తారు. రష్యాలో ఇలా ఉండదు. ఒక మనిషి ఎంతకాలం ఆరోగ్యంగా

**"బ్రాహ్మణులయొక్క ఆధిపత్య ధోరణులను ఎదుర్కోవటం ఒక్కటే సరిపోదని, ఆర్థికంగా బలోపేతం అవటంపై దృష్టి సారించి సామాజిక స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కాని ఇలా ఆర్థికంగా బలోపేతం అవ్వాలంటే మాత్రం, ఇప్పుడున్న పెట్టుబడిదారి వ్యవస్థ లో అది సాధ్యం కాదని, కార్మికులచేత నిర్మింపబడే సోషలిస్టు వ్యవస్థలోనే అది సాధ్య మవుతుందని ప్రకటించారు."**

ఉంటాడో అంతకాలం అతను బతకడానికి ఏదో ఒక పని చేస్తాడు. వృద్ధాప్యంలో ప్రభుత్వమే ఆ బాధ్యత తీసుకుంటుంది. ఒక వ్యక్తికి ప్రయివేటు ఆస్తి అనే ఉండే హక్కే అక్కడ లేదు కాబట్టి, వాటిని కాపాడటానికి, వారసత్వం పొందటానికి పిల్లలు అవసరం లేదు.

ఈ సోషలిస్టు దేశంలో, దేవుడులేడు, మతాలు లేవు, శాస్త్రాలలో నమ్మకాలు లేవు. ఏ మనిషి ఎక్కువ కాదు తక్కువ కాదు. ఉన్నత ఉద్యోగి, చిన్న ఉద్యోగి అనేది లేదు. అందరూ సమానులే. జీతాలు, వసతులు అందరికీ ఒకేలా ఉంటాయి. చేసేపనులే భిన్నమైనవిగా ఉంటాయి. ఒకవేళ ఉన్నతమైన బాధ్యత వచ్చిందంటే, అతనికి తెలుసు అతని బాధ్యత ఎక్కువని, ఉత్పత్తి పెంచాలని ప్రతి మనిషి పని గంటలు, చెయ్యా ల్సిన పని నిర్ణయింపబడి ఉంటాయి. మన కార్మికుల లాగా నిర్ణయించిన పనికాలం చివరి సమయం లో వాళ్లెవరూ వెళ్లరు. ఇంకా ఎక్కువ సమయం పనిచేయటానికి పూనుకుంటాడు. యాజమాన్యం అతని అదనపు పనిని నోటు చేసుకుని నెల చివరి లో గాని, సంవత్సరం చివరలోగాని వారిని సముచితంగా సత్కరిస్తారు. కార్మికులు కూడా సత్కారం, గౌరవం ఆశిస్తారే తప్ప, డబ్బునికాదు. ఇక్కడ ఎటువంటి మోసాలు కాని, దొంగతనాలు కాని లేవు. అక్కడి మనుషులందరిలోను కావాల్సినంత నిజాయితీ ఉంది. నేను ఇంతకు ముందు చెప్పి నట్లు అక్కడ ప్రజలు ఎటువంటి చింతలు లేకుం డా జీవిస్తున్నారు. అందుకే రష్యాలో వందనుండి నూట ఇరవై సంవత్సరాలు జీవించేవారు వేలసంఖ్యలో ఉన్నారు.

పెరియార్, సింగారవేలు ఆత్మగౌరవ ఉద్యమానికి ఓ కొత్త కార్యరూపం తయారు చేశారు. ఈ రోడ్‌లో జరిగిన మహాసభలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. కాని చాలామంది దీనిని వ్యతిరేకించారు. రామనాథ్‌గారితో సహ ఈ రోడ్ ప్రోగ్రామ్ డిమాండ్లు ఇతర అంశాల తోపాటు బ్రిటిష్ వారినుండి పూర్తి స్వాతంత్ర్యం,



పెరియార్ ఇ.వి. రామస్వామి

పెట్టుబడిదారి ప్రభుత్వాలనుండి విముక్తి, జాతీయ అప్పులను రద్దుచేయటం, వ్యవ సాయభూమి, అడవులు, వాటర్‌బాడీలు, బ్యాంకులు, షిప్పింగ్ ఇతర రవాణాసౌకర్యాలను జాతీయం చేయటం, కార్మికుల, సన్న, చిన్న కారు రైతులు వ్యవసాయ కూలీల అప్పులను రద్దుచేయటం, దేశంలోని వివిధ సంస్థానాలను ఒకటిగా చేసి కార్మికులు, రైతులచే నడిచే ప్రభుత్వ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. ఈ తీర్మాన ఆమోదంతో దక్షిణ భారతదేశంలో ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీకగా మొట్టమొదటి రాజకీయ పార్టీ సమధర్మపార్టీ ఏర్పడింది.

1933లో తిరుపూర్‌లో జరిగిన ఆత్మగౌరవ ఉద్యమ మహాసభలో పెరియార్ తన కొత్త రాజకీయ విధానాన్ని ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ, ఇప్పటిదాకా ఉద్యమం ఒక తంతు లాగా హిందూ ఆధిపత్యానికి, బ్రహ్మణుల కుతంత్రాలతో వ్యతిరేకంగా మాత్రమే పోరాడుతూ వచ్చిందని, బ్రహ్మణే తరుల ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ఎటువంటి పోరాటం చేయలేదన్నారు.

బ్రాహ్మణులయొక్క ఆధిపత్య ధోరణులను ఎదుర్కోవటం ఒక్కటే సరిపోదని, ఆర్థికంగా బలోపేతం అవటంపై దృష్టి సారించి సామాజిక స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కాని ఇలా ఆర్థికంగా బలోపేతం అవ్వాలంటే మాత్రం, ఇప్పుడున్న పెట్టుబడిదారి వ్యవస్థ లో అది సాధ్యంకాదని, కార్మికు లచేత నిర్మింపబడే సోషలిస్టు వ్యవస్థలోనే అది సాధ్యమవుతుందని ప్రకటించారు.

ఈ రకమైన కొత్త పంథాలో, ఆత్మగౌరవ ఉద్యమం యొక్క రెండు విభాగాలు మార్క్సు, లెనిన్ జీవిత చరిత్రలను అనువాదం చేసి ప్రచురించాయి. సోవియట్ మొదటి పంచవర్ష ప్రణాళికను కూడా ముద్రించాయి. వారపత్రి కలైన "పురుచ్చి" (విప్లవం) "పగుత్తరివు" (రాడికల్ ఉద్యమం) "సమధర్మం" (విప్లవం), "వేడిగుండు" (బాంబు)లను ఆవిష్కరించి నడపసాగారు. మేడేరోజు బహిరంగ సభలను ఏర్పాటు చేశారు. పెరియార్ ఒక్కడే దాదాపు యాభై సభలలో పాల్గొని, తమిళనాడు అంతా తిరిగి, ప్రయివేటు ఆస్తికి వ్యతిరేకంగా ప్రచారం చేసి, సోవియట్ తరహా ప్రభుత్వం రావాలని పిలుపినిచ్చాడు.

ఇదంతా ప్రభుత్వవర్గాలలో ఆందోళన సృష్టించింది. బ్రిటీషుప్రభుత్వం సామాజిక న్యాయ సాధకుడిని అంగీకరించగలనేమోకాని, అతడు ఓ విప్లవ నాయకుడిగా మారి సోషలిజాన్ని ప్రచారం చేయటం సహించలేదు. కాడిఅరసు పత్రికలో పెరియార్ ఈ ప్రభుత్వానికి గద్దె దింపాలని సంపాదకీయం రాసిన మరుక్షణం అతనిమీద దేశద్రోహం కేసుపెట్టి తొమ్మిదినెలలు కారాగార శిక్ష, మూడువేలు జరిమానాగా విధించారు.

**బ్రిటీషు ప్రభుత్వం 1934లో కమ్యూనిస్టు పార్టీని నిషేదించింది.**

బ్రిటీషు ప్రభుత్వం అణచివేతతో, అంతకు ముందే ఈ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన ఆత్మ గౌరవ పోరాట నాయకులు కొందరు వెనుదిరిగిన పరిస్థితులలో, జాతీయోద్యమం ఊపందుకున్న సందర్భం– కాంగ్రెస్ పార్టీ దానిని అఖండంగా ముందుకు తీసుకెళ్తున్న పరిస్థితి – అందులోనూ మరలా తలెత్తున్న బ్రహ్మణ ఆధిపత్య ధోరణులు పెరియార్‌ను ఆలోచింపజేశాయి. తప్పనిసరి పరిస్థితులో, ప్రభుత్వం ఆత్మగౌరవ పోరాటాన్ని అణచివేయాలని కృతనిశ్చయంతో ఉన్నప్పుడు, ఫలితంగా ఉద్యమం వెనకడుగు వేసిన స్థితిగతులు, కాంగ్రెస్ కూడా ప్రభుత్వ దమనకాండని చూసి, నేను సోషలిస్టు ప్రచారాన్ని మానుకోవాలని నిర్ణయానికి వచ్చానని 'కుడి అరసు" పత్రికలో ప్రకటించారు. పెరియార్ ఆరోజు తీసుకున్న నిర్ణయం తమిళనాట చరిత్ర, రాజకీయాల రూపురే ఖలను పూర్తిగా మార్చివేసింది.

**అనువాదం : ఎల్.ఎస్. భారవి**

**విశ్లేషణ**

# సామాజికాభివృద్ధిలో వెనుకబడ్డ గుజరాత్



రచయితలు ప్రముఖ పాత్రికేయులు

**టికె రాజాలక్ష్మి, అక్షయ్ దేశ్‌మానే**

**2014** ఏప్రియల్ మాసంలో గుజరాత్ అసెంబ్లీలోని బల్లలపై ఓ నివేదిక ప్రత్యక్షమయ్యింది. మిగిలిన అంశాలెలా ఉన్నా, ప్రధానంగా ఇఎస్ఎస్ఎఆర్ గ్రూప్ గురించిన ముఖ్యాంశాలు ఇందులో క్రోడీకరించబడ్డాయి. అహ్మదాబాద్‌లోని సివిల్ హాస్పటల్‌లోని “నియోనేటల్ కేర్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్” లోని నవజాత శిశువుల మరణాల గూర్చి అక్టోబరు వరకూ వెలువడిన గణాంకాలు పొందు పరచబడ్డాయి. 2010– 2014 మధ్యకాలంలో ప్రతిలక్ష జనాభాలోనూ, 22 మంది నవజాత శిశువు మరణం కలవరం కలిగించే అంశం.

దేశవ్యాప్తంగా జరుగుతున్న నరేంద్రమోడి ప్రచారం ‘నమో’ గుజరాత్ తరహా పాలనను నమూనాగా చూపిస్తూ కొనసాగుతుంది. కానీ వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. సామాన్య ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేకుండా, అవినీతితో నిండిన పాలన సాగినట్లు సిఏజి రిపోర్టులు తగినన్ని సాక్ష్యాలు చూపుతున్నాయి. ఈ అంశాలనే తమ వ్యాసంలో పొందుపరి చారు. టి.కె రాజాలక్ష్మీ, అక్షయ్ దేశ్‌మానే!

అభివృద్ధి పథంలో ప్రామాణిక సూచీలుగా కనిపించే అనేకానేక సూచీలు, ఆర్థికరంగంలో ప్రైవేటు పెట్టుబడులకు సమాన స్థాయిలో ఉ ండనవసరం లేదు. ఆర్థిక అభివృద్ధి, పునః పంపిణీలో న్యాయం రెండూ కలగలిస్తేనే ఏ రాష్ట్రం లేదా దేశం అయినా అభివృద్ధికి నమూనా లవుతాయి. నరేంద్రమోడీ, గుజరాత్ తరహా అభివృద్ధి అంటూ దేశవ్యాప్తంగా చేస్తున్న, చేసు కుంటున్న ప్రచారంలో మానవాభివృద్ధి పెంచే ప్రమాణాలు, ఎంతవరకు ఉన్నాయన్నది ఓ పెద్ద ప్రశ్నే. అభివృద్ధిగా చెప్పుకుంటున్న దానిలో వాస్తవంగా అభివృద్ధి ఎంత?

2014 సంవత్సరం లోక్‌సభ, ఎన్నికలకు ముందు నిర్వహించిన సర్వేలలో 75 శాతం కార్పొరేట్ శక్తులు నరేంద్రమోడీని తమ ప్రధానిగా కోరుకుంటున్నట్లుగా తేలింది. ఆనాడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన చేపట్టిన పనులను అభివృద్ధికి నమూనాగా చూపుతూ ప్రచారం కొనసాగింది. భారతీయ జనతాపార్టీ అధికారిక వెబ్‌సైట్‌లో ఓ పిడిఎఫ్ ఫైలు దొరి కింది. అందులో “భారతదేశం ఎదురుచూస్తున్న దార్శనికుడి”గా ఆయనను వర్ణించడం జరిగింది. ఆ పిడిఎఫ్ ఫైలును లోక్‌సభ ఎన్నికల లక్ష్యంగానే తయారు చేయడం జరిగింది. ట్యాగ్ లైన్‌గా “ఓట్‌ఫర్ ఇండియా”, “ఓట్ ఫర్ మోడీ” అంటూనే గుజరాత్‌లో మోడల్‌గా చూపిస్తూ మరిన్ని ఉద్యోగాలు, తక్కువ ద్రవ్యోల్బణము, అధిక ఆదాయం, వేగంగా ఆర్థికాభివృద్ధి, మంచి విద్య, మరింత నిర్భయత్వం, మంచి జీవితం, అంటూ ఊదరగొట్టారు. 2014 లోక్‌సభ ఎన్నికలలో పై నినాదాలను, విస్తృతంగా ప్రచా రం చేసుకుని, అధికారాన్ని చేజిక్కించుకుంది. మానవాళికి అవసరమైన నిజమైన అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో, జరుగుతుందో పరిశీలించ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. భారతీయ జనతా పార్టీ డాక్యుమెంట్‌లోని “భారతదేశం ఎదురుచూస్తున్న దార్శనికత” ఎంతవరకూ ఫలించిందో పరిశీలించవలసిన తరుణమిది అభివృద్ధి సూచికలుగా నిర్ధారించబడిన వాటికి భిన్నంగా అభివృద్ధిని చూపడం జరిగింది.

భారతీయ జనతాపార్టీ అధికారిక నివేదిక ప్రకారం గుజరాత్ రాష్ట్రంలో “ఆరోగ్యవంతమైన చిన్నారులు” కేవలం 38.77 మాత్రమే. బాలలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. కానీ 2012–13 కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (సిఏజి) నివేదిక ప్రకారం, భారతదేశంలో బాలల పోషకాహార లోపంలో ఆఖరి అయిదు రాష్ట్రాలు బీహార్‌లో 80 శాతం ఢిల్లీలో, 50 శాతం, ఆంధ్రప్రదేశ్ 49 శాతం రాజస్థాన్ 43 శాతం, హర్యానా 43 శాతం కన్నా పై స్థాయిలో మాత్రమే గుజరాత్ ఉంది. ఇది ఏ విధంగా ఆరోగ్యవంతమైన బాలలకు నిదర్శనం?

ఈ వివరణను పక్కనుంచి, ఈ మధ్య కాలంలో అనగా 2015వ సంవత్సరం “మార్చి” మాసంలో “కాగ్” వెలువరించిన మరో నివేదిక” జనరల్ అండ్ సోషల్ సెక్టార్” విభాగంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమంపై జరిపిన సర్వేల ఆధారంగా 2010 నుండీ 2015 ఏప్రియల్ మాసం వరకు, 2015 ఆగస్టు లెక్కల ప్రకారం దేశవ్యాపితంగా జిల్లా స్థాయిలో హాస్పటల్స్‌లో ఆరోగ్య వసతులపై జాతీయస్థాయి ప్రమాణాల కన్నా గుజరాత్‌లో తక్కువగా ఉన్నాయి.

గుజరాత్ రాష్ట్ర పనితీరుపై ఆడిట్ ఈ కింది విధంగా పేర్కొంది. “భారతదేశ పబ్లిక్ హెల్త్ స్టాండర్ట్స్ నిర్దేశించిన స్థాయికన్నా, డాక్టర్లు, స్టాఫ్ నర్స్‌ల నియామకం తక్కువగా ఉంది. స్పెషలిస్టు డాక్టర్లు ఉండవలసిన సంఖ్య కన్నా 29–77 శాతం తక్కువ ఉండగా, మెడికల్ ఆఫీసర్లు 69 శాతం తక్కువగా ఉన్నారు. సురేంద్రనగర్, గోద్రా, పెట్లాడ్ జిల్లాల్లో పరిస్థితి మరింత క్షీణించింది, 60 శాతం కన్నా తక్కువగా ఉంది. నేషనల్ హెల్త్ మిషన్ ప్రకారం “భారత దేశ పబ్లిక్ హెల్త్ స్టాండర్స్ అన్ని దేశవ్యాప్తంగా ఒకేరీతిలో, ప్రజావసరాలను తీరుస్తూ కొన సాగాలి అది రాష్ట్రాలలోనైనా, లేక కేంద్రపాలిత ప్రాంతాలలో నైనా సరే, 2014 వ సంవత్సరం జులై 15న కేంద్ర ప్రభుత్వం, “ఆరోగ్యం” ప్రధా నంగా, రాష్ట్రాలన్నీ, జిల్లాస్థాయి ఆసుపత్రిలను వృద్ధి చేయాలని ఆదేశించింది.

ఆదేశాలు ఎలా ఉన్నా, వాస్తవ పరిస్థితు లపై నివేదిక మాత్రం” జిల్లాస్థాయి ఆసు పత్రులలో పరిస్థితులు, ఐపిహెచ్ ప్రమాణాలకు దూరంగా, అవసరాలకు ఏమాత్రం అను గుణంగా లేవని, ఆసుపత్రులో పడకలు 52 నుండీ 73 శాతం తక్కువగా ఉన్నాయని” పేర్కొంది. అంతేగాక,” రోగులతో, వార్డులన్నీ, కిక్కిరిసి ఉన్నాయని, మంచాల సౌకర్యం లేక, రోగులు నేలపై ఉంచబడుతున్నారని, సుక్రోజ్ మార్పిడి ఒక పేషేంట్‌కి చేయవలసిన మొత్తాన్ని ఇద్దరికి పంచుతున్నారని, వార్డుల్లో క్రింద ఉ

**“అత్యవసర నిపుణులు అవసరమున్న జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, రేడియోలజీ, ఆర్థోపెడిక్స్, విభాగాలలో వైద్యుల కొరత అధి కంగా ఉందని, కొన్నిచోట్ల కేవలం కొద్దిశాతమే లభిస్తున్నారని పేర్కొంది. అంతేగాదు, యాక్సిడెంట్, ఎమర్జెన్సీ, ట్రామా విభాగాలలో సైతం, అవసర మైన పరికరాలు లేవని కూడా తేల్చింది.”**



గుజరాత్ ప్రభుత్వాసుపత్రిలో బెడ్లు ఖాళీగా లేకపోవడంతో ఆరుబయటే రోగులు

ంచడమేగాక, హాస్పటల్ వరండాల్లో సైతం రోగులుంచబడుతున్నారని, ఇది దయనీయ పరిస్థితి” అని తేల్చింది.

అంతేగాదు, అత్యవసర ఔషధాలైన, “అమోక్సిసిలిన్, డైక్లోఫెన్స్ సోడియం, హెపటైటిస్ ‘ బి’ వ్యాక్సిన్, సెఫ్టామైడ్ ఇంజెక్షన్, ఇన్సులిన్ లాంటి మందులు గత నాలుగు నెలలుగా ఆసుపత్రులలో లభించడం లేదని పేర్కొంది. అత్యవసర మందులు ఆసుపత్రిలో దొరకనందువలన, రోగులు వాటిని, బయట మార్కెట్‌లో అనివార్యంగా కొనవలసి వస్తుందని, ఆసుపత్రిలో లభిస్తున్న ఔషధాలు సైతం గుజరాత్ మెడికల్ సర్వీస్ కార్పొరేషన్ నిర్ణీత ప్రమాణాల కనుగుణంగా లేవని తేల్చి చెప్పింది. ఏ మాత్రం నాణ్యత లేని మందులు రోగులకు ఉపయోగిస్తున్నారని పేర్కొంది.

అత్యవసర నిపుణులు అవసరమున్న జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, రేడియోలజీ, ఆర్థోపెడిక్స్, విభాగాలలో వైద్యుల కొరత అధికంగా ఉందని, కొన్నిచోట్ల కేవలం కొద్ది శాతమే లభిస్తున్నారని పేర్కొంది. అంతేగాదు, యాక్సిడెంట్, ఎమర్జెన్సీ, ట్రామా విభాగాలలోసైతం, అవసరమైన పరికరాలు లేవని కూడా తేల్చింది. పైన పేర్కొన్న మూడు జిల్లాల్లో, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ విభాగం లేనే లేదు. మిగిలిన జిల్లాల్లో ఉన్నప్పటికీ, ఒకటి లేదా రెండు పడకలకు మించిన సౌకర్యం లేదు. కేవలం జిల్లాస్థాయి ఆసుపత్రుల్లోనే గాక, జిల్లాల్లోని మిగిలిన ప్రభుత్వ వైద్యశాలల్లో సైతం, పరిస్థితులు ఇలాగే ఉన్నాయి. నవజాత శిశు మరణాలు, బాలింతలకు కనీస సౌకర్యాలు, జనన సమయంలో అత్యవసరమైన పరికరాలు లేకపోవడమేగాక “నేలమీద రోగులు” చాలా సహజాతి సహజంగా ఈ ఆసుపత్రులలో కన్పించే దృశ్యం. 2011 నవంబర్ మాసం నుండే సురేంద్రనగర్ జిల్లా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, పీడియాట్రీషియన్ ఉద్యోగాల భర్తీ చేయకపోవడమే దీనికి నిదర్శనం. తత్ఫలితంగా ఈ ఆసుపత్రులకు గర్భిణీలు ప్రసవానికి రాకపోవడం, వచ్చినవారికి కనీస సౌకర్యాలు లేకపోవడం వాస్తవ పరిస్థితులకు దర్పణం. డాక్టర్లు లేని కారణంగా రోగులను చేర్చుకోకపోవం సైతం సహజ విషయంగా ఈ జిల్లాల్లో కనిపిస్తుంది. సూరత్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో, పేషెంట్లు నేలమీద వరండాలలో పడుకోబెట్టడం చాలా సాధారణ దృశ్యం. ఈ పరిస్థితులన్నింటినీ ఫోటోగ్రాఫిక్ సాక్ష్యాలుగా సైతం, నివేదిక సమర్పించింది.

నివేదిక పేర్కొన్న మరో ముఖ్యాంశం 2010–2015 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం 732.64 కోట్ల ధనాన్ని ఆసుపత్రులకై కేటాయించగా, కేవలం 580.08 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టడం జరిగింది. జిల్లాస్థాయి ఆసుపత్రులలో, రోగనిర్ధారణ కేంద్రాలు, రేడియోధార్మిక పరీక్షల విభాగాలే లేవు. ఉన్నవాటిల్లో సౌకర్యాలు అధమస్థాయిలో ఉన్నాయి. అంటు రోగాల వ్యాప్తిని అరికట్టడం గానీ, నిపుణుల కోసం రిఫర్ చేయడం వంటి అంశాలు అసలు పరిగణనలోనే లేవు. 2012–17 పంచవర్ష ప్రణాళికలో ఐపిహెచ్ఎస్ ప్రకారం ఎలాంటి ప్రణాళికలు గానీ, చేసిన కార్యక్రమాల పట్ల నివేదికలు గానీ వైద్యవిద్యను అభివృద్ధి చేసే మార్గాలు గానీ, జిల్లాస్థాయి ఆసుపత్రులలో అభివృద్ధిపనులు గానీ, ఏవీ సక్రమంగా నెరవేర్చలేదు. ఆ దిశగా కృషిచేయలేదు.

ఆరోగ్య సూచీలు

“రాష్ట్రంలో ఆరోగ్య పరిరక్షణగా సేవలు, వాటి నాణ్యతప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య సూచీలకనుగుణంగా మూల్యాంకనం చేయబడతాయని” కూడా ఆడిట్ నివేదిక గమనించి, వ్యాఖ్యానించింది. జాతీయ స్థాయిలో నిర్దేశించిన సరాసరి ప్రమాణాలకు దగ్గరగా నవజాత శిశువుల జననం, మరణం, గర్భిణుల మరణం, ఫలదీకరణం, మాతృమూర్తుల మరణం, జాతీయస్థాయి సరాసరి కన్నా కాస్త మెరుగ్గా ఉన్నప్పటికీ జాతీయస్థాయి ప్రమాణాలలో అగ్రస్థాయిలో నున్నరాష్ట్రాల సరసన లేకపోవడం గమనించాల్సిన విషయంగా పేర్కొంది. ఒక లక్ష జనాభాలో 122 మంది బాలింతల మరణం, 22మంది నవజాత శిశువుల మరణం, జాతీయస్థాయిలోని 178 మంది బాలింతల మరణం, 44మంది నవజాత శిశువుల మరణం కన్నా తక్కువగా ఉన్నప్పటికీ జాతీయస్థాయి సరాసరి కన్నా ఎక్కువగా నివేదిక వ్యాఖ్యానించింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల విషయంలో ఈ సంఖ్య ఇంకా అధికంగా ఉందని సైతం పేర్కొనడం జరిగింది.

జాతీయ స్థాయిలో “మానవాభివృద్ధి సూచిక”గా పరిగణించే హెచ్‌డిఐ ప్రజల సామాజిక, ఆర్థిక అంశాలను పరిగణలోకి తీసుకుని గణాంకాలు లెక్కిస్తుంది. వీరి లెక్కల ప్రకారం గుజరాత్ తొమ్మిదవ స్థానంలో ఉంది. “భారత దేశ మానవాభివృద్ధి నివేదిక”గా 2011లో “ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాన్‌పవర్ రీసెర్చ్” వెలువరించిన రిపోర్టుతో అగ్రస్థానంలో కేరళ, తర్వాత ఢిల్లీ, హిమచల్ ప్రదేశ్, గోవా, పంజాబ్

మాత్రమే ఉన్నాయి. ఈ నివేదిక" యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్" వారి మానవాభివృద్ధి నివేదికలు సూచించిన ప్రజారోగ్యం, విద్య, ఆర్థికంగా ఖర్చుచేసే స్థాయిల కనుగుణంగా రూపొందించబడింది. అంతేగాక ప్రజల తలసరి ఆదాయం సైతం ముఖ్యమే! 1999లో గుజరాత్ 10వ స్థానంగా ఉండగా 2007 నాటికి 11వ స్థానానికి దిగిందని కూడా ఈ నివేదిక పేర్కొంది.

ఆర్థికవేత్త 'అతుల్ సుద్" జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ పరిశోధకుడు. ఎ. కలైరసన్ సృష్టించికరించినట్లు "ఆరోగ్యవంతమైన బాలలు" గా ట్యాగ్‌లైన్ వేసుకున్న గుజరాత్ రాష్ట్రం. వాస్తవానికి మధ్యాహ్న భోజన పథకం విషయంలోనూ, బాలల సౌకర్యాల కల్పనలోనూ, జాతీయస్థాయి సరాసరికి దగ్గరగా ఉన్నప్పటికీ, ఉన్నత సౌకర్యాలు కల్పిస్తున్న రాష్ట్రాలకు సమీపంగా లేవని" పేర్కొన్నారు. ప్రజారోగ్యం, విద్యా వసతులపై ఖర్చు ఏమాత్రం ప్రామాణికంగా లేవని కూడా తేల్చారు. గుజరాత్ కన్నా పైన 11 రాష్ట్రాలున్నాయని అందులో" కేరళ" కూడా ఉందని సృష్టీకరించారు. వాస్తవానికి ప్రజారోగ్యంపై బడ్జెట్ నిధులను గుజరాత్ తగ్గిస్తుందనటానికి నిదర్శనం. 2015-16 సంవత్సరంలో 5.59 శాతముండగా, 2016-17లో 5.40 శాతానికి, 2017-18 బడ్జెట్ ఎస్టిమేట్స్‌లో 5.06 శాతానికి తగ్గించడమే! ప్రజాపంపిణీ వ్యవస్థలో జాతీయస్థాయిలోనే అధమస్థాయిలో గుజరాత్ ఉంది. తలసరి వినియోగం అత్యల్పంగా ఉంది. ప్రజల్లోకి సగం మంది మరీ ముఖ్యంగా పేదవర్గం, సబ్సిడీ ఆహార పదార్థాలను అందుకోలేకపోతుండగా, దేశం మొత్తంలో ఈ రాష్ట్రంలోనే ఆహారపదార్థాల వినియోగం గణనీయంగా పడిపోతుండటం గమనార్హం.

"భారత కార్మిక, 'ఉపాధి మంత్రిత్వ శాఖ వారు ప్రకటించినట్లుగా, 2014లో భారతీయ జనతా పార్టీ అధికార వెబ్‌సైట్‌లో గుజరాత్‌లో నిరుద్యోగ సమస్య అత్యల్పంగా ఉన్నట్లుగా ప్రకటించుకుంది. 2014 ఏప్రియల్ 4వ తేదిన ఇంగ్లీషు మ్యాగజైన్ "ఫ్రంట్ లైన్" ప్రచురించిన "వాస్తవాలు, భ్రమలు" ("ఫిక్షన్ అండ్ ఫ్యాక్ట్") అన్న వ్యాసంలో అతుల్‌సూద్, ఎ. కలైఅరసన్ "ప్రైవేటు పెట్టుబడుల విషయంలో ఒడిషా, ఛత్తీస్‌ఘడ్‌ల తర్వాత గుజరాత్ ముఖ్యప్రదేశంగా గుర్తించబడినప్పటికీ, ఉపాధి కల్పనలో చాలా వెనుకబడి ఉందని" ప్రకటించారు. "నిర్మించబడిన ప్రాజెక్టులు''గా నిర్మాణంలోనున్న ప్రాజెక్టులు"గా చెప్పబడుతున్న నిర్మాణ కార్యక్రమాలు 2003లో 73 శాతమున్నప్పటికీ, 2011 నాటికి 13 శాతానికి క్షీణించిపోయాయి.

❝ జాతీయ పథకాలలో ఒక్కటైన దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్యయోజన" పథకం కింద 45 వేల మంది విద్యార్థులు శిక్షణ పొంద వలసి యుండగా, కేవలం 3,312 మంది మాత్రమే నమోదు చేయబడ్డారు. అందులో 587 మంది మాత్రమే విజయవంతంగా శిక్షణ ముగించుకున్నారు.❞

1983-2010 మధ్యలో అధికశాతం ప్రాజెక్టులు, కెమికల్స్, పెట్రోకెమికల్స్ విభాగంలో జరిగినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా తమ వాటాలో 2005లో 20 శాతమున్నప్పటికీ, 2011నాటికి 10 శాతం కన్నా తక్కువకు పడిపోయాయని" వ్యాసకర్తలు అభిప్రాయపడ్డారు.

రోహిణి హెన్స్‌మాన్ అనే ఉద్యమకారిణి, పరిశోధకురాలు, "ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ" 2014 మార్చిపత్రికలో "గుజరాత్ మోడల్ అభివృద్ధి, భారతీయ ఆర్థిక వ్యవస్థకు ఏం చేసింది?" అన్న వ్యాసంలో, ఉపాధి కల్పన, అనధీకృత విభాగంలో పెరిగిందని, ఉత్పత్తి రంగంలో తగ్గుముఖం పట్టిందని సృష్టీకరించింది. అతుల్‌సూద్, కలైవరసన్, నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీసు వారి, "2011-12, ఉపాధి, నిరుద్యోగం" అన్న గణాంకాల వివరాలు ప్రకటిస్తూ" జాతీయస్థాయి సరాసరి కన్నా, కనీస వేతనాలు, అటు గ్రామీణ గుజరాత్‌లో కానీ, ఇటు పట్టణీకరణ గుజరాత్‌లో కానీ తక్కువస్థాయిలోనే ఉన్నాయి. ప్రజల ఆదాయ ప్రమాణాలు అత్యంత తక్కువస్థాయిలోనున్నట్లుగా పేర్కొన్నారు. అదే విధంగా 2016వ సంవత్సరంలో "ఇందిరా హిర్వేఅండ్ అటాను ఛటర్జీ" అనే ఆర్థికవేత్తలు సమర్పించిన" గుజరాత్ గ్రామీణ లేబర్ మార్కెట్‌లో ఇటీవలి కాలంలో చోటు చేసుకున్న పరిణామాలు- విశ్లేషణ" అన్న వ్యాసంలో "జాతీయస్థాయి సరాసరి నిరుద్యోగ గణాంకాల ప్రకారం గుజరాత్‌లో నిరుద్యోగ యువత 15-29 సంవత్సరాల మధ్య వయస్సులో నున్న వారు జాతీయ సరాసరి కన్నా ఎక్కువగా ఉన్నారు. కార్మికుల వేతనాలు అసంఘటిత రంగంలోగానీ, సంఘటిత రంగంలో కానీ జాతీయ సరాసరి కన్నా తక్కువగానే ఉన్నాయి.

"గుజరాత్ వెలిగిపోతుంది" అన్న నినాదం ప్రధాన ఉద్దేశ్యం" శిక్షణారంగంలో అభివృద్ధి" ఈ దిశగా "కాగ్" ప్రత్యేకంగా నిర్వహించిన ఆడిట్‌లో ఆశ్చర్యకరమైన నిజాలు బయట పడ్డాయి. 2010-15 సంవత్సరాల మధ్యలో శిక్షణ కార్యక్రమం కోసం నిర్దేశించిన నిధులు ఖర్చుచేయబడలేదు. లెక్కలో చూపబడిన యువత నమోదు వాస్తవదూరం. అతితక్కువ మందికి ఉపాధి లభించడం అందునా వేతనాలు అధమ స్థాయిలో ఉండడటం, శిక్షకులను నియమించక పోవడం లాంటి అవతకవలు ఎన్నో బయట పడ్డాయి. "కళాకృతుల శిక్షణ" పథకం క్రింద 4.14 లక్షల విద్యార్థులు నమోదు చేసుకున్నప్పటికీ అందులో 27 శాతం మధ్యలోనే వదిలి వెళ్లిపోయారు. ఎన్నో శిక్షణా కేంద్రాలలో కావలసిన సామాగ్రిని కొనుగోలు చేయలేదు. శిక్షకులను నియమించనే లేదు.

జాతీయ పథకాలలో ఒక్కటైన దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్యయోజన" పథకం కింద 45 వేల మంది విద్యార్థులు శిక్షణ పొందవలసి యుండగా, కేవలం 3,312 మంది మాత్రమే నమోదు చేయబడ్డారు. అందులో 587 మంది మాత్రమే విజయవంతంగా శిక్షణ ముగించుకున్నారు. కాగ్ సభ్యబృందం తమ నివేదిక కోసం 1,060 మందిని" టెలిఫోన్‌ద్వారా ఇంటర్వ్యూ చేయగా, కేవలం 37 శాతం మందికి మాత్రమే ఉపాధి లభించినట్లు, 24 శాతం స్వయం ఉపాధి కల్పించుకోగా, మిగిలిన వారంలో నిరుద్యోగులుగానే మిగిలియున్నట్లు తేలింది. ఉద్యోగం పొందిన వారు కేవలం నెలకు రూ. 6960 మాత్రమే వేతనంగా పొందుతున్నారు. ఈ మొత్తం జాతీయ సరాసరికన్నా చాలా తక్కువ.

మానవాభివృద్ధిలో విద్య, అక్షరాస్యతా శాతం ప్రథమ ప్రాధాన్యాలు. మానవుల విద్య, అక్షరాస్యత పెంచడం కోసం చేసే మౌలిక వసతులు అభివృద్ధికి మార్గాలు. "గుజరాత్‌లో అక్షరాస్యతా శాతం జాతీయ సరాసరి కన్నా ఎక్కువగా ఉన్నప్పటికీ, విద్యారంగంలో లింగ

**"స్త్రీ, పురుషులు శాతంలో మాత్రం చాలా దూరం ఉంది. ఆడ పిల్లల భ్రూణ హత్యలు అబార్షన్‌లు గుజరాత్‌లో ఎక్కువే. ఆడా, మగ నిష్పత్తిలో జాతీయ సరాసరి 940 కాగా, గుజరాత్‌లో 919, బాలబాలికల నిష్పత్తిలో సైతం జాతీయ స్థాయిలో 914 కాగా, గుజరాత్‌లో 890. 'మెహసానా' తర్వాత ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా ఉతక్కువస్థాయిలో బాల బాలికల నిష్పత్తి కలిగి ఉన్నాయి."**



ఆదాని యాజమాన్యంలోని ముంద్రా పోర్ట్

వివక్షతలు ఎక్కువగా ఉన్నట్లు కనుగొన్నారు. అతుల్‌సూద్, కలైరసన్‌ల నివేదిక ప్రకారం, స్త్రీ పురుషుల అక్షరాస్యతలో మాత్రం 20 శాతం వ్యత్యాసం ఎక్కువ. ఇది కేవలం కొన్ని వర్గాలకే పరిమితం కాలేదు. జనరల్, ప్రత్యేక కేటగిరీల లో సైతం 2007-08 జాతీయ సరాసరి కన్నా వ్యత్యాసం అధికంగానే ఉంది.

### లైంగిక వేధింపులు

మహిళా రక్షణ, గుజరాత్ అభివృద్ధిలో ఒకానొక మైలురాయిగా పేర్కొన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం గుజరాత్‌లో మహిళల పట్ల అత్యాచారాలు తక్కువ స్థాయిలో ఉన్నట్లు వెల్లడిస్తున్నాయి. కానీ లైంగిక వేదింపుల విషయంలో వాస్తవానికి, లెక్కలకు మధ్య చాలా దూరం ఉంది. గుజరాత్ కన్నా, నేరాల విషయంలో నాగాలాండ్, సిక్కిం, తమిళనాడు దిగువస్థాయిలో ఉన్నాయి. స్త్రీ, పురుషులు శాతంలో మాత్రం చాలా దూరం ఉంది. ఆడపిల్లల భ్రూణ హత్యలు అబార్షన్‌లు గుజరాత్‌లో ఎక్కువే. ఆడా, మగ నిష్పత్తిలో జాతీయ సరాసరి 940 కాగా, గుజరాత్‌లో 919, బాలబాలికల నిష్పత్తిలో సైతం జాతీయ స్థాయిలో 914 కాగా, గుజరాత్‌లో 890. 'మెహసానా' తర్వాత ఉ త్తరప్రదేశ్‌లోని ఆగ్రా ఉతక్కువస్థాయిలో బాలబాలికల నిష్పత్తి కలిగి ఉన్నాయి.

### నిధుల దుర్వినియోగం

గుజరాత్ మోడల్ ప్రచారంలోకి తీసు కొస్తున్న తరుణం 2013, అంతకుముందే "కాగ్" నివేదిక గుజరాత్ ప్రభుత్వం నిధులు దుర్విని యోగం చేసిన తీరును బయటపెట్టింది. ప్రభుత్వ పరంగా నిధుల వినియోగాన్ని, భిన్న కంపెనీల రూపంలో ధన దుర్వినియోగాన్ని "కాగ్" ఎండగట్టింది.

ప్రభుత్వరంగ సంస్థలకు, కంపెనీలకు సరైన నిధులు ఇవ్వకపోవడం, కార్పొరేట్ కంపెనీలకు అవసరాన్ని మించి అధిక మొత్తంలో మినహాయింపులివ్వడం, ప్రభుత్వ పాలనా పరంగా దిగువస్థాయిలో ఉండడం, ప్రజావస రాలకన్నా, కార్పొరేట్ కంపెనీలకే ప్రాధాన్యత నివ్వడం, మరీ ముఖ్యంగా 2014 నుండి ప్రభుత్వపరంగా విస్తృతంగా ఎదురవుతున్న వైఫల్యాలను 'కాగ్" నివేదిక తేటతెల్లం చేసింది. గుజరాత్ ముఖ్యమంత్రి పదవి నుండీ ప్రధానమంత్రి పదవికి ఎగబాకే క్రమంలో తన వారసులకు అధికారం కట్టబెట్టటం ఇవన్నీ బైట పడటానికి మూలం. మోడీ పాలనానంతరం, 2014 బడ్జెట్ సమావేశాల ఆఖరిరోజున ప్రవేశపెట్టబడిన ఐదు నివేదికలు, ప్రభుత్వ పరంగా, రిలయన్స్ పెట్రోలియం,అదానీ పవర్, ఎస్సార్ గ్రూప్‌ల కోసం మోడీప్రభుత్వం దోచిపెట్టిన నిధుల వివరాలను బట్టబయలు చేశాయి. మోడీ పాలనలో గుజరాత్ అభివృద్ధి లోని డొల్లతనాన్ని బట్టబయలు చేశాయి.

కాగ్ నివేదికలోని రెండవ అధ్యాయం "గుజరాత్ ప్రభుత్వ ఆర్ధిక విధానాలపై సమగ్ర పరిశీలన" గుజరాత్ అసెంబ్లీయే 2014 సంవ త్సరం జులై 25న ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని మైనారిటీ పోర్టుల పరిపాలన, నియంత్రణ, నిర్వహణలకై ఏర్పాటు చేయబడిన గుజరాత్ మారీటైమ్ బోర్డ్( సముద్రతీర అభివృద్ధి సంస్థ) సామర్ధ్యం, పనితీరుపై ఈ నివేదిక సమర్పించ బడింది. కార్పొరేట్లకు కట్టబెట్టబడిన నిధులపై మాత్రమేగాక, దాని మూలాలనుసైతం నివేదిక చర్చించింది.

1995వ సంవత్సరం డిసెంబర్‌లో గుజరాత్ రాష్ట్రం 'పోర్ట్ పాలసీ' ప్రకటించి తర్వాత 1999లో "గుజరాత్ మౌలిక సదుపా యాల అభివృద్ధి చట్టాన్ని" అమలులోకి తెచ్చింది. ప్రైవేటు ప్రాతినిధ్యంలో పోర్టుల అభివృద్ధి దీనిలో మౌలికాంశం. పోర్టుల కోసం ఏర్పాటు చేయబడిన ఈ పాలసీ, "క్యాప్టివ్‌జెట్టీ" (అనగా నౌకాశ్రయం ఆధారంగా ఉత్పత్తులు తయారు చేసుకోవడానికి కావాల్సిన ముడిసరుకులు దిగుమతి చేసుకోవడానికి, ఉత్పత్తి అయిన తర్వా త ఎగుమతులు చేసుకోవడానికి చేసుకొనే ఏర్పాటు ఆయా ప్రైవేటు కంపెనీలే నిర్మాణం చేసుకుం టాయి) లకు వ్యతిరేకం. క్యాప్లివ్ జెట్టీల నిర్మాణా న్ని నిరుత్సాహ పరచినప్పటికీ, గుజరాత్ మారిటైమ్ బోర్డు మాత్రం తొమ్మిది కంపెనీలు క్యాప్టివ్ జెట్టీలను నిర్మించుకోవడానికి అనుమతి నిచ్చింది. క్యాప్టివ్ జెట్టీల నిర్మాణం కోసం కేటాయించబడిన మొత్తం 362.01 కోట్లు కాగా, లెక్కలలో తప్పులు చూపబడి, 649.29 కోట్లకు చేరింది. అది రిలయన్సు పెట్రోలియం లిమిటెడ్ ఖాతాలోకి చేరింది.

అదానీ గ్రూప్‌కు కేటాయించిన "ముంద్రా పోర్ట్ ప్రాజెక్టు" పై కాగ్ నివేదిక వ్యాఖ్యానిస్తూ" గవర్నమెంట్ ఆఫ్ గుజరాత్ పోర్టుకి ముందుగా ఇచ్చిన అనుమతులకన్నా, మించి నాలుగు సింగిల్ బాయ్ మూరింగ్స్‌కి, (ఎస్‌బిఎమ్‌ఎస్) చట్టబద్ధమైన అనుమతుల్లేకుండా, రాయితీలిచ్చిం దని" తేల్చింది. ముద్రాపోర్టు ఫేజ్ 2 ను ఎలాంటి ప్రాథమిక అనుమతులు లేకుండా, సమగ్రమైన ప్రాజెక్టు రిపోర్టు లేకుండా, కట్టడాలపై ఎలాంటి అజమాయిషీ లేకుండా, వీటిపై వాస్తవానికి తీసుకున్న అనుమతులకన్నా, ఎక్కువ

భాగాన్ని ఆక్రమించుకుంది. బొగ్గు, ముడి చమురును మార్కెట్ రేటు కన్నా తక్కువకు పొందిందని, తత్ఫలితంగా 118.12 కోట్ల ధననష్టం వాటిల్లిందని తేల్చిచెప్పింది.

అంతేగాక 2014 సంవత్సరం జులై 25న గుజరాత్ అసెంబ్లీలో వెలువడిన మరో నివేదిక" గుజరాత్ రాష్ట్రం ప్రభుత్వం ఫైనాన్స్, ఫైనాన్షియల్ ఆడిట్" కూడా ముంద్రా పోర్ట్" పై తమ పరిశీలనలను ప్రకటించింది. మొదటి పరిశీలనలో ఎస్సార్ కంపెనీని, మరో ప్రైవేటు పవర్ ఫర్మ్‌ని పేర్కొంది. "గుజరాత్ రాష్ట్ర పెట్రో నెట్ లిమిటెడ్, ఎస్సార్ స్టీల్ లిమిటెడ్ కోసం, షిప్‌ఛార్జీలను మినహాయించిందని, అదేవిధంగా, టొరెంట్ పవర్ లిమిటెడ్ విషయంలో అస్పష్టమైన నిర్ణయాలు తీసుకుందని, తత్ఫలితంగా 92.34 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంది.

ఇటీవలి కాలంలో సమర్పించబడిన నివేదికలు ముంద్రాపోర్ట్‌కు రాయితీలను కేటాయించిన గుజరాత్ ప్రభుత్వం ఎలాంటి నియమనిబంధనలను అనుసరించలేదని, ఆడిటింగ్ పరిమితులను మించి రాయితీలు ఇచ్చిందని" తేల్చి చెప్పింది.

అదేరోజు ప్రవేశపెట్టబడిన మరో నివేదిక సైతం ఎస్సార్ గ్రూప్‌పై తమ పరిశీలనలను బయటపెట్టింది. రాష్ట్రప్రభుత్వం ఈ వ్యవహార శైలిని నివేదికలు తప్పుబడుతూ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్‌ల విషయంలో ప్రజలు చెల్లించిన పన్నుల వినియోగంపైనా ఇవే అంశాలను పేర్కొన్నాయి. ఆర్థిక వ్యవహారాలను గుట్టు చప్పుడుగాకుండా చక్కబెట్టడం, నాసిరకం పాలన అందించం కేవలం మోడీ పాలనలో మాత్రమే గాక అతని తర్వాత వచ్చిన ఇద్దరు ముఖ్య మంత్రులు సైతం అదే రీతిగా వ్యవహరించారని నివేదిక స్పష్టీకరించింది. గుజరాత్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వీకరించినట్లు చెప్పుకుంటున్న ప్రభుత్వరంగ సంస్థలు గుజరాత్ రాష్ట్ర పెట్రోలియం కార్పొరేషన్ (జిఎస్‌పిసి) గాంధీనగర్ మెట్రోలింక్ ఎక్స్‌ప్రెస్, ఆహ్మదాబాద్ కంపెనీ లిమిటెడ్ (మెగా కంపెనీ) ఆర్థికంగా చాలా హీనస్థితిలోనున్నట్లు, వాటి అభివృద్ధిని అధికారంలోనున్న ఏ ముఖ్యమంత్రి కూడా పట్టించుకోకుండా వదిలేసినట్లు సైతం నివేదిక స్పష్టం చేసింది.

2016వ సంవత్సరం మార్చి 31న విడుదల చేసి మరో నివేదికలో"గుజరాత్ రాష్ట్రపెట్రోలియం కార్పొరేషన్, 2006-10 మధ్యకాలంలో, ఆ రంగంలో పూర్వానుభవం లేకుండా వ్యవహరించి విదేశీ బ్యాంకులనుండి ఋణాలను స్వీకరించిందని, అనుభవ రాహిత్యం

❝ తొలుతగా 1,868 వర్క్‌ఆర్డర్ లను మెట్రో ప్రాజెక్టు తొలిదశలో కంపెనీ ఇచ్చింది. తర్వాత భారత ప్రభుత్వం, గవర్నమెంట్ ఆఫ్ గుజరాత్‌ల నుండి, తమ పనులకు అనుమతి రానందువలన వర్క్ ఆర్డర్లను ఆపేస్తున్నట్లుగా ప్రకటించింది. 2015 మార్చి వరకు 445.86 కోట్ల రూపాయలు నిధులు కేటాయించినట్లు, అవి నిష్ప్రయోజనమైనట్లుగా కాగ్ తేల్చి చెప్పింది.❞



పిపిపి పద్ధతిలో నిర్మించిన రోడ్లు

వలన భారీస్థాయిలో నష్టం జరిగింది. 1,757.46 కోట్ల రూపాయల ఖరు జరిగింది. ఇటువంటి వాటిలో 1,732.12 కోట్ల రూపాయలను కొట్టి వేయడంగా జరిగిందని పేర్కొంది.

"మెట్రోలింక్ ఎక్స్‌ప్రెస్ ఫర్ గాంధీ నగర్ అండ్ అహ్మదాబాద్ కంపెనీ లిమిటెడ్" గూర్చి కూడా కాగ్ నివేదిక ఈ క్రింది అంశాలను ప్రస్తావించింది. "తొలుతగా 1,868 వర్క్‌ఆర్డర్ లను మెట్రో ప్రాజెక్టు తొలిదశలో కంపెనీ ఇచ్చింది. తర్వాత భారత ప్రభుత్వం, గవర్నమెంట్ ఆఫ్ గుజరాత్‌ల నుండి, తమ పనులకు అనుమతి రానందువలన వర్క్ ఆర్డర్లను ఆపేస్తున్నట్లుగా ప్రకటించింది. 2015 మార్చి వరకు 445.86 కోట్ల రూపాయలు నిధులు కేటాయించినట్లు, అవి నిష్ప్రయోజనమైనట్లుగా కాగ్ తేల్చి చెప్పింది. ఇంద్రోడా, మోటేరా, చిలోడా ప్రాంతాల అభివృద్ధికోసం అంటూ ఖర్చుచేసిన 373.62 కోట్ల ధనం సైతం నష్టపోయినట్లుగా తేల్చారు.

ఇవి మాత్రమేగాదు, తర్వాత కాలంలో సైతం కాగ్ గుజరాత్ ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూనే ఉంది. ఈ సంవత్సరం (2017) మార్చి 31న విడుదల చేసిన నివేదిక కూడా గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్‌కు కెజి-2 బేసిన్‌లో చమురు నిక్షేపాల త్రవ్వకం కోసం రాష్ట్రప్రభుత్వం నడుపుతున్న పెట్రోలియం ఫర్మ్ "బ్లూచిప్" కోసం కేటాయించిన మొత్తం రూ. 478.98 కోట్ల ధనం, ఆ సంస్థ ఎటువంటి త్రవ్వకాలు చేపట్టనందువల్ల నిరుపయోగంగా మిగిలిపోయిందని తేల్చింది.


### ఎవరికి లాభదాయకం?

"ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ" లో "రోహిణి హెన్స్‌మెన్" రాసిన వ్యాసంలో" పన్నులు కడుతున్న ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ప్రజలు చెల్లిస్తున్న పన్నులు రాయితీల రూపంలో కార్పొరేట్ సంస్థల చెంతకు చేరుతున్నాయి. తప్ప, గుజరాత్ గుజరాత్ ప్రజలకు అందటం లేదని, మానవాభివృద్ధి సూచికలు పేర్కొన్న ఏ లక్ష్యాలను గుజరాత్ ప్రజలు అందుకోవడం లేదని, ఒక్కమాటలో చెప్పాలంటే, గుజరాత్ ప్రభుత్వం చేసుకుంటున్న అభివృద్ధి ప్రచారం "గుజరాత్ మోడల్" ఆ రాష్ట్ర ప్రజలను చేరలేదని" తేల్చారు.

అభివృద్ధికి పిచ్చిపట్టింది అనే వీడియో పాట వైరల్ అయ్యి, ఖ్యాతి పొందింది.. ఆ పాటలో చూపినట్లుగా, "అభివృద్ధి అంటూ చేసిన, చూపిన అభివృద్ధి ఫలాలు నిజానికి ఎవరిని చేరాయి?" 15 సంవత్సరాల గుజరాత్ అభివృద్ధిలో సిసలైన భాగస్వాములెవ్వరు? ఏ వర్గం అభివృద్ధి చెందింది? ఇదే నేడు గుజరాత్ ప్రజల మదిలోని ప్రశ్న.

**అనువాదం: డాక్టర్ శమంతకమణి**

# అక్బర్‌ను దోషిగా చిత్రిస్తున్న సంఘ్ పరివార్



రచయిత ప్రముఖ పాత్రికేయులు

**జియా ఉస్ సలామ్**

*అజ్మీర్‌లో 'అక్బర్‌కోట' పేరు మార్చే ప్రయత్నం, మొగలు చక్రవర్తికి వ్యతిరేకంగా బురదచల్లే బిజెపి ఎజెండాను ముందుకు తీసుకెళ్ళడానికి ఉద్దేశించిన మరో ముందడుగు. అలాగే రాజపుత్రుల చరిత్రను వాస్తవానికి మించి గొప్పగా ప్రదర్శించడం తప్ప మరొకటి కాదు.* **– జియా ఉస్ సలామ్**

రాజపుత్రుల కాలాన్ని వాస్తవానికి మించి గొప్పగా చూపడం, అదే సమయంలో మొగలులను తక్కువ చేసి చూపడం ప్రస్తుతం మనం చూస్తున్నాము. భారతదేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలో అక్బరు, నూతనతరంగా ఔరంగజేబు ఉన్నారు. అతని విధానమైన సంపూర్ణశాంతి కృషి నుంచి ఆధునిక భారత రాజ్యం యొక్క భావన అయిన సెక్యులరిజం వచ్చిందన్నది చాలాకాలం క్రితమే గ్రహించిన విషయం. అయితే ప్రస్తుతం రాజస్థాన్,ఉత్తర ప్రదేశ్ బిజెపి ప్రభుత్వాలు అక్బర్‌ను కొత్తగా చూస్తున్నాయి. కేంద్ర హోంశాఖా మంత్రి రాజ నాథ్ సింగ్ 1576 లో హల్దీఘాటీ యుద్ధంలో అక్బర్ చేత ఓడించబడిన మేవార్ రాజపుత్ర పాలకుడు రాణాప్రతాప్‌ను గొప్పగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు.

రాణా ప్రతాప్ 477వ జయంతి సందర్భంగా రాజస్థాన్ పలీలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన తరువాత కేంద్రమంత్రి రాజనాథ్‌సింగ్ తన అభిప్రాయాలను వెల్లడించారు. రాణాప్రతాప్ యొక్క గొప్పతనాన్ని మీరు మరొక్కసారి చూడాలని రాజ్‌నాథ్ చరిత్రకారులకు పిలుపునిచ్చారు. ఐతే రాజపుత్ర రాజుకు "గొప్ప" అనే బిరుదు ప్రదానం చేయక పోవడం ఆశ్చర్యం అనిపిస్తుంది. మహారాణా అనే పదం యాదృచ్ఛికంగా రాణాప్రతాప్ అంటే గొప్ప రాజు అని ముద్రవేసింది. రాణా ప్రతాప్ మొగలుల చేతిలో ఓడిపోయిన తరువాత కూడా ఆ పేరును కలిగి ఉన్నాడు. రాణా ప్రతాప్‌ను ఒక 'నిజమైన రాజనీతిజ్ఞుడు'గా చూపించే ప్రయత్నం రాజ్‌నాథ్ సింగ్ చేశాడు. "1857తిరుగుబాటుకు ఎవరి పనులైతే స్ఫూర్తిదాయకంగా నిలిచాయో ఆయనే ప్రతాప్" అంటూ అక్బర్ యొక్క గొప్పతనాన్ని పాతిపెట్టే ప్రయత్నం చేశాడు.

అలాగే రాజ్‌నాథ్‌సింగ్ యొక్క మాటలు గమనిస్తే, ఆయన తెలివిగా అక్బర్ యొక్క గొప్పతనం గురించి విభేదించనట్లు కనిపిస్తాడు. ఆయన చెప్పకుండా వదిలివేసిన వాటిని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మరింత బలంగా ప్రకటిస్తున్నాడు. గడిచిన కాలానికి సంబంధించిన కొత్త వాటిని కనుగొనే ఆసక్తిని కలిగి ఉన్నవాడిలా కనిపించేలా ప్రయత్నం చేస్తున్నాడు.

ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రాణాప్రతాప్ జయంతి కార్యక్రమంలో యోగి ఆదిత్యనాథ్ ఇలా చెప్పారు." మహారాణా ప్రతాప్, గురు గోవింద్‌సింగ్, ఛత్రపతి శివాజీ మన మార్గదర్శకులు. మనం వారు చూపిన బాటలో తప్పక నడవాలి. యువకులు మహారాణా ప్రతాప్ ప్రదర్శించిన ఆత్మగౌరవం, దృఢమైన వ్యక్తిత్యం కలిగి ఉండడం తప్పక నేర్చుకోవాలి. అక్బర్, ఔరంగజేబు మరియు బాబరు ఆక్రమణ దారులు. అతి త్వరలో మనం వాస్తవాలను అంగీకరిస్తాం. త్వరలో మన దేశం యొక్క అన్ని సమస్యలు అదృశ్యమవుతాయి.

అక్బర్ ఒక ఆక్రమణదారుడా? ఆయన అమర్ కోటలో పుట్టాడు; ఔరంగజేబు గుజరాత్ లోని దహోద్‌లో పుట్టాడు. మరి నిజంగా బాబర్ ఒక ఆక్రమణ దారుడా? ఆయన పంజాబ్ గవర్నర్ అయిన దౌలత్‌ఖాన్‌లోడీ ఆహ్వానం మేరకు ఇక్కడకు వచ్చాడు. కాబట్టి ఆదిత్యనాథ్ చరిత్రకు సంబంధించిన ఒక చెడ్డ విద్యార్థా లేక కేవలం అపవాదులను బుద్ధి పూర్వకంగా అంటగట్టేపనిలో మునిగి పోయారా? లేక రెండు రకాల పనిలో మునిగి ఉన్నారా? ఇది తప్పనిసరిగా బిజెపి అజెండా అయిన అక్బర్ మీద బురద చల్లే దానిని ముందుకు తీసుకెళ్ళే దాంట్లో భాగమే. అలాగే అక్బర్ సమకాలికులైన రాజపుత్రుల యొక్క వీరత్వాన్ని, సామర్థ్యాన్ని పెంచి చూపించడమే. వారిలో చాలామంది అక్బర్ వద్ద విధేయులుగా ఉంటూ ఆయనకు సేవ చేసినవారే. ఇది వాస్తవాలను చూడడం కంటే నేడు దేశంలో తమ లక్ష్యసాధనకు తగినట్లు ప్రచారం చేయటంగాకనిపిస్తున్నది.

ఘజనీ మహమ్మద్‌ను పోలిన దురాక్రమణదారులుగా మొగలు చక్రవర్తులను ఉంచాలనేది యోగి ఆదిత్యనాద్ యొక్క ప్రయత్నం. దానికోసం 2016మే నెలలో న్యూఢిల్లీలోని అక్బర్ రోడ్డుకు మహారాణా ప్రతాప్ రోడ్‌గా నామకరణం చేయాలని ప్రతిపాదనను పెట్టాడు. రాజపుత్రులకు గౌరవప్రదమైన స్థానాన్ని ఇవ్వాలని స్పష్టంగా చెప్పాడు. మొఘలుల గొప్పతనం గురించి, ఒకప్పుడు వారి సామ్రాజ్యంలో ఒక ముఖ్య భాగంగా ఉన్నదో ఆ ఢిల్లీలో రోడ్డు వారి పేర్ల మీద ఉండాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

న్యూఢిల్లీలోని ఔరంగజేబు రోడ్డు పేరు మార్చే ప్రతిపాదన స్వర్గీయ మాజీరాష్ట్రపతి డా॥ఎపిజె అబ్దుల్‌కలామ్ తర్వాత ముగింపుకు చేరింది. ఔరంగజేబు రోడ్డుపేరు మార్చే దాంట్లో " చెడ్డముస్లింకు పోటీగా మంచి ముస్లిం" అని పునరుద్ఘాటించిన చర్చను కూడా చాలా మంది చదివారు. ఈ సారి బిజెపి నాయకత్వం దేశ నిర్మాణంలో అక్బర్ పాత్రను చులకన చేయడంలో పాటు అక్బర్‌ను ఆధునిక ఔరంగజేబులాగా చూయిస్తున్నది. ఇది హిందూ రాష్ట్ర

మూలాల నుంచి, హిందూకాని ప్రతిదీ సరిపడదనే భావనలో నుంచి వచ్చింది. మత దురభిమానపు కట్టుకథలు ఇప్పటికీ ఉద్భవించి మనిషి చుట్టూ చేరుతూ ఉన్నాయి. ప్రసిద్ధి చెందిన రాజపుత్ర యువరాణిని వివాహమాడటం, ఆమెను ఇస్లాంకు మారమని గట్టిగా ఒత్తిడి చేయక పోవడం, అక్బర్ ఖచ్చితంగా రాజపుత్రుల కోసం వచ్చిన రెండవ వాడిలాగా చూడబడతాడు. అయితే ఆయన ప్రభావిత ప్రాంతంగా ఉన్నది నేటి ఆధునిక రాజస్థాన్‌లో కలపబడలేదు.

అక్బరు పాత్ర క్రమక్రమంగా ఒక్కొక్కటిగా తొలగించబడుతున్నది. తాజాగా రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఉన్న 16వ శతాబ్దపు అక్బర్ కోటకు సంబంధించి ఆ విధమైన ప్రయత్నం చేస్తున్నారు. ఉపప్రాంతీయ న్యాయమూర్తి యొక్క ఉత్తర్వులతో మొఘలు చక్రవర్తుల యొక్క పేరు కోటనుంచి తొలగించబడింది. వివాదాస్పదమైన స్థానిక బిజెపి శాసనసభ్యులు వాసుదేవ్‌నాని డిమాండ్‌తో ఆ కోటను అజ్మీర్ కోటగానే పిలవాలి. కానీ అధికారిక రాజపత్రం దానిని అక్బర్ కోటగా ప్రకటించింది. కేవలం చరిత్రకారులు వారి యొక్క ప్రణాళిక లేదా రాజకీయ విధానాల ప్రకారం ఆ కాలాన్ని అలా ప్రకటించారు అని అంటున్నారు.

అక్బరు కోట పేరుమార్చే ప్రయత్నం చరిత్రకారుల మీద ప్రభావం చూపలేదు. మధ్యయుగ భారత చరిత్రలో నిపుణుడైన సయ్యద్ అలీ నదీమ్‌రెజావీ ఇలా అంటారు "వాస్తవంగా, మనం జీవిస్తున్న కాలాన్ని చారిత్రక అనంతర కాలంగా నిర్వచించవచ్చు. గతంలో ఏమి జరిగిందనేది అప్రాధాన్యమైనది. ప్రస్తుతం నూతన భారతదేశంలో ఏం జరుగుతుందన్నది మనం అవగాహన చేసుకోవాలి. ఏమి జరుగుతుంది? ఎలా జరుగుతుంది? అలాగే ఎందుకు జరుగుతుంది? ఏది ప్రాధాన్యత కలది అనేది మనం అవగాహన చేసుకోవాలి. నిజం తిట్టుగా తయారైంది. ఇది పురాణ కల్పిత కథల కాలం. చివరికి మన ప్రధానమంత్రి కూడా వేదకాలం సూపర్ సానిక్ విమానాల కాలం అని అంటున్నారు." ఆయన రాణాప్రతాప్‌ను మహారాణా ప్రతాప్‌గా పిలిచే ప్రతిపాదనను ఎత్తి పొడుపుగా మాట్లాడాడు. " నేను ఆశ్చర్యపోలేదు. నూతన యుగపు చరిత్రకారుల్లో ఎవరో ఒకరు మహారాణా ప్రతాప్ చాలా గొప్పవాడు, ప్రపంచ విజేత అక్బరు అతని యొక్క పాలెగాడుగా ఉన్నాడు" అనే చెప్పేవారు ముందుకు వస్తారు అంటాడు.

**పథకం ప్రకారం కుట్ర**

చరిత్రకారుడు మరియు పరిశోధకుడు అయిన

> **❝ ముస్లిం పాలనా మూసలో సరిపోకుండా ఒక గొప్ప యోధుడుగా, గొప్ప నిర్మాతగా, గొప్ప మానవతావాదిగా ఉన్న అక్బర్ కొంత మందికి కొరుకుడు పడని సమస్యగా ఉన్నాడు. మహారాణా ప్రతాప్ సేనా నాయకుడు హకీమ్‌ఖాన్ సుర్ అనే ముస్లీం అన్న వాస్తవాన్ని వారు బుద్ధిపూర్వకంగా మరుగుపరు స్తున్నారు.❞**



భారత చక్రవర్తి అక్బర్




మేవార్ ప్రాంతాన్ని పాలించిన రాణా ప్రతాప్

అబ్దుల్ అజీమ్ అఖ్తర్ అక్బర్‌ను బలహీనపరిచే ప్రయత్నాల వెనుక ఉన్న అసలు కారణాలను బట్టబయలు చేశారు. "పాలకులు రూపొందించిన నకిలీ పత్రాలు, వక్రీకరణలతో కూడిన కుట్ర సగటు మనిషిని గందరగోళ పరిచే విధంగా ఉంది. అక్బరు చనిపోయి శతాబ్దాలు గడిచినా మంచివాడు అనేపేరు ఆయనకు దక్కడం, అదికూడా జోధా అక్బర్ లాంటి టెలివిజన్ సీరియల్స్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ కంటే మెరుగైన టిఆర్‌పి రేటింగ్స్ పొందడం కూడా ఈ కుట్రకు ఒక కారణం. ముస్లిం పాలనా మూసలో సరిపోకుండా ఒక గొప్ప యోధుడుగా, గొప్ప నిర్మాతగా, గొప్ప మానవతావాదిగా ఉన్న అక్బర్ కొంత మందికి కొరుకుడు పడని సమస్యగా ఉన్నాడు. మహారాణా ప్రతాప్ సేనా నాయకుడు హకీమ్‌ఖాన్ సుర్ అనే ముస్లీం అన్న వాస్తవాన్ని వారు బుద్ధిపూర్వకంగా మరుగుపరుస్తున్నారు. అక్బర్ చేతిలో కేవలం హేము మాత్రమే ఓడిపోలేదు. షేర్‌షా సూరి యొక్క వారసులు కూడా ఓడిపోయారు అనే వాస్తవాన్ని కూడా వారు మరుగు పరుస్తున్నారు. 19వ శతాబ్దంలో వారు ఉభయులు అంతరించిపోయే వరకూ మొఘలులు, ఆఫ్ఘన్లు ప్రధాన పోటీదారులుగా, బద్ధశత్రువులుగా ఉన్నారన్న విషయం ప్రపంచానికి తెలియకూడదని వారు భావిస్తున్నారు."

అక్బరు యొక్క పనిని తక్కువ చేసే ప్రయత్నం వారి ఆలోచనల వెనుక దాగి ఉంది. అయితే వాస్తవానికి టెలివిజన్ సీరియల్స్ ద్వారా దానిని మార్చలేరు. ఈ మొత్తం వ్యవహారం తరువాత అజ్మీర్‌లో గార, సున్నముతో కలిపిన మిశ్రమముతో కట్టిన నిర్మాణము మీద ఆయనపేరును అర్థం కానట్లు తుడిచివేయడం నగర ప్రారంభంలో చూడవచ్చు. "అజ్మీర్‌నగరం, దాని కోటను కొల్లగొట్టడానికి మొఘలులు సమ్మతించారు" అని రెజావీ వాదన. శిలా శాసనము, సాహిత్యం మరియు ఇతర సాక్ష్యాధారాలు చారిత్రక (ప్రఖ్యాత చిత్రకారుడు దర్శన్ శర్మ సూచించినట్లు) ఆధారాల ద్వారా 11వ శతాబ్దానికి చెందినవారు అయి ఉంటారని భావిస్తున్నారు. ఏది ఏమైనా, ప్రస్తుతం కోటలో ఉన్న నిర్మాణాలు అక్బరు కాలానికి వెనుకటివిగా చెప్పవచ్చు. అబుల్‌ఫజల్‌ను మనం విశ్వసించేటట్లయితే కోటలో కట్టబడిన నిర్మాణాలు 1570 కాలానికి చెందినవి. చాలాకాలం పాటు యువ రాజు సలీంలాగా అక్కడే ఉన్న జహంగీర్ కాలంలో కూడా ఇది ముఖ్యమైన కోటగా ఉన్నది".

అక్బర్ పాలనాకాలంలో హిందువులు

> **"పాకిస్తాన్‌లో ఆ జాతి మతం మీద ఆధారపడి ఉన్నది. అక్కడ అక్బర్ ఒక విలన్. భారతదేశ పాలనా యంత్రాంగాన్ని కూడా పాకిస్తాన్‌లాగా మార్చాలనుకుంటున్న వారికి అక్బర్ లాంటివారు ఒక విలన్. అక్బర్ వివేకం, హేతు వాదం ఉండాలని ఒత్తిడి చేశాడు. మతవాదులుగా ఉన్నవారు అక్బరును వ్యతిరేకించారు."**



హోం శాఖామంత్రి రాజ్‌నాథ్‌సింగ్

గొప్ప అధికారాలు అనుభవించారు అని అక్బరు కాలాన్ని వివరిస్తూ అఖ్తర్ అంటాడు. "అక్బర్ జైపూర్‌లో అమీర్ కోట నిర్మాణానికి పునాది రాయి వేశాడు. మొఘలుల లెక్కలను 'కాయస్త' అనే హిందూ కులానికి చెందినవారు నిర్వహించే వారు. హిందువులకు సమాన అవకాశాలు కల్పిం చబడ్డాయి అనే నమ్మకాన్ని వారిలో కలిగించ డానికి, వారిని సంతోషపరిచే విధంగా పెద్ద సంఖ్యలో సైన్యంలోకి తీసుకోవడంతో పాటు వివాహ సంబంధాల ద్వారా కలుపు కోవటం లాంటివి దానిని దృఢపరిచాయి."

ఎబ్బాకోచ్ తన శాశ్వత నిర్మాణాల (జ్ఞాప కార్థ నిర్మాణాల) పరిశోధనలో మొఘలుల నిర్మా ణం అజ్మీర్‌లో ఇరాన్ రాజవంశ నిర్మాణంలాగా చుట్టూ 8 గదులతో కూడిన హాలు అక్బర్ నిర్మా ణంలో కనిపిస్తుందంటాడు. ఈ రకమైన నిర్మాణ పద్ధతిని హుమాయూన్ సమాధి, ఆ తరువాత తాజ్‌మహల్ నిర్మాణంలో ఉపయోగించారు. అక్బరు పాలనాకాలంలో వాడబడిన నిర్మాణ అంశాలు కూడా అక్కడ దాడికి గురికాబడ్డాయి.

అక్బరు కోటలో ముస్లింలను "ఇతరులు" (బయటివారు)అని వేరుచేసే పారిభాషక పదాలను ఉపయోగించడం దేశ చరిత్రలో ముస్లింల పాత్రను తక్కువ చేయడం కాదా? మొదట ఔరంగ జేబును మత దురభిమానిగా ఆరోపించి, దానిని పెద్దఎత్తున ప్రచారం చేసి హిందూ దేవాలయాలకు ఆయన కేటాయింపులను తక్కువ చేసి చూపారు. ఈనాడు ముస్లింలను బయటివారుగా చూపే ప్రయత్నం చాలా తీవ్రంగా జరుగుతున్నది. వారి సంస్కృతి మన సంస్కృతి కాదు అని చెబుతున్నారు. అంతవరకే పరిమితం కాకుండా ఒక కొత్త "హిందువు"ను సృష్టించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. హిందు అస్తిత్వానికి పూర్తి వ్యతిరేకంగా ఉండే పొడవుపాటి చేతులతో తయారు చేయబడిన కవచం లాంటి గట్టి వస్త్రం ధరించి ఉండేవారని చెబుతున్నారు. అతడు పోరాటం సరిపడని, ఏమీ పట్టని జోకర్‌లాగా, విశాలమైన ఆలోచనకు భిన్నంగా, మొత్తం మీద నిర్వచించడానికి కష్టతరమైన మతాన్ని అనుసరించేవాడుగా ఉంటాడు" అని రెజావా అంగీకరిస్తాడు. స్వాతంత్ర్య సమరయోధుల ఐక్యతకు అక్బర్ ఒక గుర్తు. అతడు ఒక ఆదర్శమూర్తి. అయితే ప్రస్తుతం స్వాతంత్రోద్యమంలో పాత్ర లేనివారు అధికారానికి రావటం వలన ఆయన స్థానాన్ని దిగజారుస్తున్నారు. "స్వాతంత్ర్య పోరాటాన్ని వ్యతిరేకించిన హిందూ మహాసభ అక్బరును ఒక శాపంగా పరిగణించింది" అని రెజావీ అన్నాడు.

అక్బరు సమకాలికుడైన సన్యాసి ఫాదర్ మాన్‌సెరెట్టె అక్బరు అన్ని విశ్వాసాల పట్ల సహనంగా ఉండేవాడు, అన్ని మతాలను గౌరవించాడు అని అన్నాడు. బదాని వంశానికి చెందిన ముస్లిం బృందం అక్బరును వ్యతిరేకించింది. అక్బరును అసహ్యించుకునే హిందూ, ముస్లిం మతవాదులతో పోల్చితే ఇదేమీ ఆశ్చర్యం కలిగించదు. పాకిస్తాన్‌లో ఆ జాతి మతం మీద ఆధారపడి ఉన్నది. అక్కడ అక్బర్ ఒక విలన్. భారతదేశ పాలనా యంత్రాంగాన్ని కూడా పాకిస్తాన్‌లాగా మార్చాలనుకుంటున్న వారికి అక్బర్ లాంటివారు ఒక విలన్. అక్బర్ వివేకం, హేతువాదం ఉండాలని ఒత్తిడి చేశాడు. మతవాదులుగా ఉన్నవారు అక్బరును వ్యతిరేకించారు. విప్లవకారులకు మహారాణా ప్రతాప్ స్ఫూర్తిగా ఉన్నాడని చెబుతున్నారు. కాని 1857లో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో నానాఫడ్నవీస్, ఝాన్సీరాణి మరాఠా పీష్వాలకు కాక బహదూర్‌షా జాఫర్‌కు నాయకత్వాన్ని అప్పగించారు. అప్పటికే వాస్తవ అధికారం లేకుండా ఒక సాధారణ పాలకుడుగా ఉన్నప్పటికీ సాధారణ భారతీయుల మదిలో మొఘలుచక్రవర్తి నిజమైన పరిపాలకుడు గానే ఉన్నాడు." స్వాతంత్ర్యం కోసం పోరాడిన నానా సాహెబ్, ఝాన్సీరాణి ఇద్దరూ వీరులు అమరులయ్యారు. ఆ సమయంలో ఇచ్చిన పిలుపులో రాణాప్రతాప్ లేదా శివాజీ ఎక్కడ?" అని రెజావీ ప్రశ్నించాడు.

**అనువాదం : కె. నాగమల్లేశ్వరరావు**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# సామాజిక వెనుకబాటును బట్టి రిజర్వేషన్లు ఉండాలి

**సందేహాలు సమాధానాలు**



- బి.వి.రాఘవులు

ప్రశ్న : **2017 నవంబర్, మార్క్సిస్టులో సామాజిక న్యాయం కమ్యూనిస్టు దృక్పథం శీర్షికతో కామ్రేడ్ ఎస్. వీరయ్య గారు రాసిన వ్యాసంలోని కుల పోరాటమా - వర్గ పోరాటమా? ఉపశీర్షికలో అగ్ర వర్ణాలు ఆధి పత్యం కోసం కులసంఘాలు పెడుతున్నారు. బడుగు బలహీనవర్గాలవారు హక్కులకోసం కుల సంఘాలు పెడుతున్నారు. ఈ రెండింటి మధ్య తేడా ఉంది. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులకు చెందిన సంఘాల నినాదాల్లో ఆందోళనా పోరాటాల్లో ప్రజా స్వామిక అంశం ఉన్నది. సామాజికన్యాయం కోరుకుంటున్నారు. అందువల్ల అగ్రవర్ణాల కుల సంఘాలను అణగారిన తరగతుల కులసంఘాలను ఒకే గాటన కట్టలేము. అందుకే తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అణగారిన తరగతుల పోరాటానికి కమ్యూనిస్టులు అండగా ఉంటారు సామాజిక న్యాయం కోసం సాగుతున్న ఈ పోరాటంలో ఈ ప్రజాతంత్ర అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. దాని కోసం కమ్యూనిస్టులు కూడా పోరాడతారు. అందుకే సామాజిక శక్తులు, కమ్యూనిస్టుల ఐక్య పోరాటానికి ఇది ప్రాతిపదిక. అనిరాశారు. దీనిని బట్టి నాకు వచ్చిన సందేహమేమంటే - సిపిఎం ఆంధ్రప్రదేశ్‌లో కాపులు ఆధిపత్యం కోసం కులసంఘాన్ని పెట్టారా? లేక సామాజికంగా అణగారిన కులంగా సంఘంగా పెట్టారా? ఏమని అభిప్రాయపడుతున్నది.**

**ముద్రగడ పద్మనాభం గారి నాయకత్వాన కాపుకులాన్ని బిసి కులాల జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో అప్పుడప్పుడు ఉద్యమాలు జరుగుతున్నాయి. ఆధిపత్యం కోసం కాపులు కుల సంఘాన్ని పెట్టారని, ఆ కులం సామాజికంగా అగ్రకులంగానే సమాజంలో పరిగణిం పబడు తోదని అణగారిన కులాలవారు అనుకుం టున్నారు. అలాంటప్పుడు సిపిఎం ముద్రగడ పద్మనాభం గారి నాయకత్వాన అప్పుడప్పుడు జరిగే ఉద్యమాలను సమర్థించటం సమంజసమేనా? సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పి. మధుగారు ఇందుకనుకూలంగా (వార్తా) ప్రకటనలు ఇస్తున్నారు. మరి సిపిఎం స్పష్టమైన వైఖరి ఏమిటనేది నాకర్థం కావటం లేదు. వివరించగలరు.**

**- ఎస్. సూర్యకుమార్, చింతలపూడి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం కాపులకు ఐదుశాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించింది. ఈ నిర్ణయం చర్చనీయాంశం అయింది.

కాపులకు రిజర్వేషన్ కల్పించాలని ముద్రగడ పద్మనాభం నాయకత్వాన, ఇతర కుల సంఘాల ఆధ్వర్యంలో చాలాకాలం నుండి ఆందోళనలు జరుగుతున్నాయి. గత ఎన్నికల సందర్భంగా కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని తెలుగుదేశం పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో పేర్కొంది. జరుగుతున్న ఉద్యమాన్ని ఎదు ర్కొనేందుకు కావొచ్చు, కాపుల్లో ఉన్న ఓటింగ్ బలాన్ని నిలుపుకునేందుకు కావొచ్చు కాపులకు రిజర్వేషన్ల విషయాన్ని పరిశీలించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం మంజునాథ కమిటీని నియమించింది. ఆ కమిటీ కాపులకు రిజర్వేషన్లు ఇవ్వాలని చేసిన సిఫార్సును, సూచనలను పరిగ ణించి సానుకూలంగా నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం చెప్పింది. కాపులకు రిజర్వేషన్లు కల్పించడం పట్ల వెనుకబడిన కులాల్లో (బిసిల్లో) సహజంగానే భయాందోళనలు వెల్లడయ్యాయి. ఇప్పటికే బిసిలకు వర్తిస్తున్న రిజర్వేషన్ల మోతాదు తగ్గిపోతుందన్న భయం వారిలో సహజంగానే కలుగుతుంది. అయితే ఈ భయాందోళనలకు ఆస్కారం లేకుండా వున్న బిసి కోటాకి అదనంగా కాపుల రిజర్వేషన్లు ఉండేట్లుగా మరో కేటగిరి సృష్టించి కాపులకు ఐదుశాతం రిజర్వేషన్లు ఇస్తున్నామని, ఆ రకంగా బిసిలకు నష్టం లేకుండా చూస్తామని ప్రభుత్వం చెబుతున్నది. ఈ వివరణ నిజమైందనుకున్నప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్‌తో రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్లు సుప్రీంకోర్టు విధించిన గరిష్ట పరిమితిని దాటిపోతున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చట్టం ముందు నిలవకపోవచ్చు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం తెలుగుదేశం ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించి నందున, కోర్టులో వీగిపోయే ప్రమాదం పట్ల తెలుగుదేశం ప్రభు త్వానికి పెద్దగా ఆందోళన ఉండదు. రిజర్వేషన్లు ఇవ్వలేకపోవడానికి నెపాన్ని కోర్టుపైకి త్రోసి వేయవచ్చు. అందుకే సాకల్యంగా ఆలోచించ కుండానే హడావుడిగా రిజర్వేషన్లను ప్రభుత్వం ప్రకటించింది.

బిసీలకు రిజర్వేషన్ల పట్ల మార్క్సిస్టు పార్టీకి స్పష్టమైన వైఖరి వున్నది. సామాజిక, విద్య విషయంగా వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కల్పించడం పట్ల మార్క్సిస్టు పార్టీ సానుకూలం. అయితే వెనుకబడిన కులాల్లో సంపన్న తరగతులను, సంపన్న కుటుంబాలను (క్రీమీ లేయర్) మినహాయించాలని సిపియం మొదటనే చెప్పింది. తరువాత సుప్రీం కోర్టు కూడా ఈ ఆలోచనను ధృవీకరించింది. రిజర్వేషన్లు కోరిన ప్రతి కులాన్ని వెనుకబడిన కులాల జాబితాలో చేర్చి రిజర్వేషన్లు కల్పించడానికి సిపియం సుముఖం కాదు. నిజంగా సామాజికంగా, విద్యా విషయంగా వెనుకబడిన వారిని, లోతైన అధ్యయనం ద్వారా ఆవిషయం రుజువైన తరువాతనే ఆ తరగతిని వెనుకబడిన కులంగా గుర్తించి రిజర్వేషన్లు కల్పించాలి. అదికూడా ఇప్పటికే ఉన్న రిజర్వేషన్లకు భంగం లేకుండా చేయాలన్నది సిపియం అభిప్రాయం.

ప్రస్తుతం రాష్ట్రంలో కాపులు అటువంటి వెనుకబడిన జాబితాలోకి చేర్చడానికి అర్హత ఉందా? లేదా? అన్నది పరిశీలించాల్సిన విషయం. అటువంటి అర్హత వుందని మంజునాథ కమీషన్ ఇచ్చిన నివేదిక పాలకపార్టీ రాజకీయ అవసరం కోసం ఇచ్చిందా? శాస్త్రీయ ప్రాతిపదికన పరిశీలించి ఇచ్చిందా? అనే విషయాన్ని చర్చకు పెట్టాల్సిన అవసరం వుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి చర్చను నిర్వహించలేదు. అటువంటి చర్చలు నిర్వహించి, ఏకాభిప్రాయం సాధించి ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకొని ఉండాల్సింది. ప్రభుత్వం ఆ రకంగా చేయలేదు. అందుకే మార్క్సిస్టు పార్టీ ఈ అంశాన్ని మరింత లోతుగా చర్చించాలని, అన్ని పక్షాలతో చర్చించి ఏకాభిప్రాయ సాధన ద్వారా నిర్ణయం తీసుకోవాలని చెప్పింది.

అనేక రాష్ట్రాల్లో అభివృద్ధి చెందిన కులాలుగా భావించబడే పటేళ్ళు, మరాఠాలు, జాట్‌లు, గుజ్జర్లు వగైరా రిజర్వేషన్ల కోసం ఆందోళనలు చేస్తున్నారు. సరళీకరణ విధానాలు అమలు మూలంగా నిరుద్యోగం పెరిగి అగ్రకులాల్లోని నిరుద్యోగ యువకులకు ఉపాధి తగ్గిపోతుండడంతో తమకు కూడా రిజర్వేషన్లు కావాలని లేదా ఇతరులకు రిజర్వేషన్లు తొలగించాలని ఆందోళనలు తలెత్తుతున్నాయి. ఉపాధి కల్పించ

దంలో ప్రభుత్వ వైఫల్యం ఈ రకంగా రిజర్వేషన్ వ్యతిరేక సెంటిమెంట్ వైపు మళ్ళుతున్నది. అగ్రకులాల్లోని పేదల పిల్లల్లో ఇటువంటి ద్వేష భావాలను రెచ్చగొడుతున్నారు. అందుకే ఇటువంటి నిరుద్యోగ యువకులకు కూడా ఉపాధిని కల్పించేందుకు ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు కూడా కొంత రిజర్వేషన్ కల్పించాలని మార్క్సిస్టు పార్టీ కోరుతున్నది. గతంలో బీహార్‌లో కర్పూరీ ఠాకూర్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆయన ఇటువంటి రిజర్వేషన్లను ప్రతిపాదించడం జరిగింది.

నిజంగానే సామాజికంగా, విద్యా విషయంగా వెనుకబడ్డారని తేలిన కులాలను అదనంగా బిసిల్లో చేర్చాలన్నా, అగ్రకులాల్లోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నా ప్రస్తుతం ఉన్న 50 శాతం గరిష్ట పరిమితి ఆటంకం అవుతుంది. రాజ్యాంగ సవరణల ద్వారా ఈ పరిమితిని తొలగిం చడమో, పెంచడమో చేస్తే రిజర్వేషన్లు కావాలంటున్న కొత్త కులాల వారి కోర్కెలకు పరిష్కారం దొరుకుతుంది. లేనియెడల ఉన్న రిజర్వేషన్లలోనే అదనంగా కొత్త కులాలకు భాగం పెట్టాలంటే వివాదాలు, పరస్పర తగాదాలు పెరుగుతాయి. ప్రజల మధ్య ఎన్ని తగాదాలను సృష్టించగలిగితే బూర్జువా పార్టీలకు అంత లాభకరంగా వుంటుంది. అందువలన సమస్యను పరిష్కరించే దానికన్నా బూర్జువా పార్టీలు తమ రాజకీయ అవసరాల కోసం కులాల మధ్య గొడవలు పెట్టేందుకు, ఓటు బ్యాంకును రాబట్టుకునేందుకు రిజర్వేషన్‌సమస్యను వినియోగించుకుంటున్నాయి.

**ప్రశ్న : భారత కమ్యూనిస్టు (మార్క్సిస్టు) పార్టీ భారతదేశ పాలకులను బూర్జువా భూస్వామ్య వర్గాలని సూత్రీకరించింది. నయా ఉదారవాద విధానం దేశంలో అమలుకు వచ్చిన తర్వాత పెట్టుబడిదారులు (బూర్జువాలు) విపరీతంగా బలపడ్డారు.**

**విదేశీ పెట్టుబడిదారులతో వ్యా పారాలలో భాగస్తులవుతున్నారు. విదేశాలలో పెట్టుబడులు పెడుతున్నారు. విదేశీ కంపెనీలను కొనుగోలు చేస్తున్నారు. ఆ విధంగా అంతర్జా తీయ పెట్టుబడిదారులుగా ఎదిగారు. నేడు అంతర్జాతీయ పెట్టుబడిదారులు పదిమందిలో మన పెట్టుబడిదారులు చేరి ప్రపంచానికి తమ పేర్లు తెలియజేస్తున్నారు.**

**వీరు భారతదేశ పాలకులలో మొదటివర్గం రెండోది భూస్వామ్యవర్గం. వీరు వ్యవసాయ అభివృద్ధిలోనూ రాణించలేదు. వ్యవసాయ పారిశ్రామికులుగానూ మారలేదు. విదేశాలలో భూములు కొనుగోలు చేసి వ్యవసాయ అభివృద్ధి చేసి అంతర్జాతీయ భూస్వాములుగా ఎదగలేరు. మన ప్రభుత్వాలు చట్టం ప్రకారంగానూ, చట్ట వ్యతిరేకంగానూ చిన్న, సన్న రైతుల భూములను తీసికొని పారిశ్రామిక అభివృద్ధి పేరుతో విదేశీ పెట్టుబడిదారులకు ఇస్తున్నప్పటికీ ప్రభుత్వానికి నిరసన కూడా తెలపడం లేదు. నేటి భారతదేశ పాలకులలో భూస్వామ్య వర్గ ఉనికి ఏ స్థితిలో వుందో వివరించమని కోరుతున్నాను.**

**– ఇలిపిల్ల సూర్యనారాయణ, విజయవాడ**

బడా పెట్టుబడిదారుల నాయకత్వాన పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గాలు మనదేశంలో రాజ్యాధికారాన్ని చలాయిస్తున్నాయని సిపియం అభిప్రాయం. భూస్వామ్యవర్గం పెట్టుబడిదారీ విధానం వేగంగా విస్తరించేందుకు ఆటంకం కల్పించే అవకాశం ఉన్నప్పటికీ, రాజకీయ అధికారాన్ని పదిలంగా వుంచుకోవాలనే లక్ష్యంతో భూస్వామ్య వర్గంతో పెట్టుబడిదారీ వర్గం జతకట్టింది.

స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం తరువాత ముఖ్యంగా సరళీకరణ విధానాలు ప్రారంభం అయిన తరువాత దేశ పెట్టుబడిదారీ వర్గంలో చాలా మార్పులు వచ్చాయి. వాటి శక్తి పెరిగింది. సంఖ్య పెరిగింది. అంతర్జాతీయ పెట్టుబడితో పెనవేసుకోవడం ఎక్కువైంది. దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులను నియంత్రించగలిగే శక్తిని పెంచుకున్నది. అలాగే భూస్వామ్య వర్గంలోనూ మార్పులు వచ్చాయి. ముఖ్యంగా పాతకాలపు జమిందారీ భూస్వామ్య పద్ధతి దాదాపు అంతరించింది. వేల ఎకరాల జమిందారీలు లేకుండా పోయాయి. అయినా భూకేంద్రీకరణ అంతమైందని చెప్పలేం. ఇప్పటికీ 5 శాతం భూస్వాముల చేతిలో 40 శాతంకు పైగా భూమి కేంద్రీకృతమైంది. 70శాతంకు పైగా ఉన్న చిన్న, సన్నకారు రైతుల చేతుల్లో 20 శాతం కన్నా తక్కువ భూమి మాత్రమే వున్నది. భూ కమతాల సైజు కూడా రోజురోజుకీ తగ్గిపోతున్నది. అందువలన వ్యవసాయంపై, గ్రామీణ జీవనంపై ఇప్పటికీ భూస్వాముల పెత్తనం కొనసాగుతున్నది. పైపెచ్చు భూస్వాములు అచ్చంగా భూమ్మీదనే ఆధారపడి తమ సంపదను కూడబెట్టుకోవడం కాకుండా వ్యాపారులుగా, స్థానిక కాంట్రాక్టర్లుగా, వడ్డీ వ్యాపారులుగా కూడా గ్రామీణ సంపదపై పట్టును సాధించగలుగుతున్నారు. అందువలన గ్రామసీమల్లో నేడు భూస్వాముల యొక్క ఆధిపత్యం భూమినుండేగాక ఇతర కార్య కలాపాల నుండి కూడా జనిస్తున్నది. ఆరకంగా గ్రామీణ జీవనంపై పట్టు బిగించి చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతును రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా తమ గుప్పిట్లో ఉంచుకోగలుగుతున్నారు. భూస్వామ్యవర్గ ప్రభావం నుండి బయటబడి స్వతంత్రంగా వ్యవహరించడం మధ్యతరగతి, చిన్న, సన్నకారు రైతాంగానికి కష్టసాధ్యం. ఇందుకు ఎంతో తీవ్రమైన ఉద్యమాలు, పోరాటాల ద్వారా ఈ తరగతిలో ఆత్మవిశ్వాసం కలిగించాల్సి వుంది.

అయితే తమయొక్క బ్రతుకుదెరువుకే ప్రమాదం ఏర్పడినప్పుడు అటువంటి తెగింపు ఈ తరగతుల్లో కనిపిస్తున్నది. ముఖ్యంగా అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు ప్రత్యామ్నాయం చూపకుండా, సరైన నష్టపరిహారం ఇవ్వకుండా భూములను గుంజుకొనే ప్రయత్నం చేసినప్పుడు రైతాంగం భూస్వాముల పట్టును కూడా లెక్కజేయకుండా తిరగబడుతున్నారు. అలాగే పంటల ధరలు తీవ్రంగా పడిపోయినప్పుడు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైనప్పుడు కూడా రైతులు ప్రాణాలకు తెగించి పోరాటానికి ముందుకు వస్తున్నారు. అందువలన రైతాంగం పోరాటానికి ముందుకు రావడంలేదు అని నిర్ధారణకు రాలేం. ఈరకంగా అసంతృప్తి చెందిన రైతాంగమే గుజరాత్‌లో బిజెపికి గట్టి గుణపాఠం చెప్పింది.

**ప్రశ్న : పార్టీ క్రమశిక్షణా ఉల్లంఘించిన వారి ప్రాథమిక సభ్యత్వం రద్దు చేశారు. పత్రిక ప్రకటన రూపంలో ఇచ్చారు. అయితే వారిని తిరిగి పార్టీలోకి చేర్చుకోవాలంటే వారి ప్రాథమిక సభ్యత్వాన్ని ఏ కమిటి పునరుద్ధరించాలో వివరించగలరు?**

**– బి. దస్తగిరిరెడ్డి,** కడపజిల్లా.

ఒక సభ్యుడ్ని పార్టీనుండి బహిష్కరించడం అనేది పార్టీ రాజకీయ జీవితంలో అత్యంత తీవ్రమైన విషయం. చాలా ప్రత్యేక సందర్భాల్లోనే పార్టీ అటువంటి తీవ్ర చర్యను తీసుకుంటుంది. అందుకు చాలా కచ్చితమైన పద్ధతిని పార్టీ నిబంధనావళిలో చేర్చడం జరిగింది. నిబంధనలకు భిన్నంగా ఏ సభ్యుడ్ని అయినా పార్టీ నుండి తొలగిస్తే కంట్రోల్ కమీషన్ తీవ్రంగా పరిగణించి సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తుంది.

సరైన పద్ధతిని పాటించి ఒకపార్టీ సభ్యుడ్ని పార్టీ నుండి బహిష్కరిస్తూ ఏదైనా ఒక స్థాయిలో నిర్ణయం తీసుకున్నప్పుడు కూడా ఖచ్చితంగా పై కమిటీ ఆమోదం పొందాల్సి వుంటుంది. లేనియెడల ఆ నిర్ణయం చెల్లుబాటు కాదు. పార్టీ నుండి బహిష్కరించబడిన ఒక సభ్యుడు ఆతరువాత కాలంలో తన ప్రవర్తన ద్వారా తిరిగి పార్టీలో చేరడానికి అర్హత సంపాదించుకున్నాడని భావించి పార్టీలోకి తీసుకోదల్చుకుంటే గతంలో తొలగింపును ఏ కమిటీ ఆమోదించిందో ఆ కమిటీయొక్క ఆమోదాన్ని తిరిగి పొందాల్సి వుంటుంది.

❋

# అన్నే అనసూయ

(2వ పేజీ తరువాయి)

జెండాను ఎగుర వేసి దాని చుట్టూ కూర్చొని తాము రాసిన పాటలు పాడారు. ఇది గమనించిన మేట్రిన్ మరో పది మంది వార్డెన్లను తీసుకొని మహిళా నేతలపై దాడికి తీసుకొచ్చింది. మా ప్రాణాలైనా వదులుతాం.. జెండాను ముట్టుకోనివ్వబోమని సూర్యావతి, అనసూయ తెగేసి చెప్పడంతో మేట్రిన్, వార్డెన్లు వెనక్కి తగ్గారు.

జైల్లో ఉన్నకాలంలో ప్రభుత్వం డిటెన్యూకి సాదరు ఖర్చుల నిమిత్తం నెలకు పది రూపాయలు, బట్టల కోసం ఆరుమాసాలకోసారి 150 రూపాయలు ఇచ్చేది. అయితే చేతికి ఇవ్వకుండా వారు కోరిన సామాను తెప్పించి ఇచ్చేవారు. రోజుకు మూడు రూపాయలు రేషన్ కూడా ఇచ్చేవారు. అందులోనే కొంత మిగిల్చి ఇళ్లవద్ద కామ్రేడ్స్‌కు ఉపయోగపడే వస్తువులు కొనుగోలు చేసేవారు. అనసూయ అలా రేషన్ మిగిల్చినప్పుడు పిల్లల రేషన్ మిగల్చవద్దని, పూర్తిగా వారికే పెట్టాలని సూర్యావతి ఒత్తిడి చేసేది. అనసూయ ఒప్పుకునేది కాదు. రేషన్ మిగిల్చిన డబ్బుతో జైలు వాళ్లతోనే గొడుగులు, బ్యాటరీ లైట్ల వంటి వాటిని కొనిపించి జైలుకు తమను చూడవచ్చిన వారికి ఇచ్చి ఇళ్లకు పంపేది.

ఓ రోజున జైల్లో ఇచ్చిన పాలు అనసూయ బాబుకు పడలేదు. బాగా సుస్తీ చేసింది. తనకు పెరోల్ ఇవ్వాలని అనసూయ పిటిషన్ పెట్టింది. పార్టీకి రాజీనామా చేస్తే విడుదల చేస్తామన్నారు. సూర్యావతి సూచనతో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి ఉత్తరం రాసింది. 'మా బిడ్డల ప్రాణం మా ప్రాణం కంటే విలువైనది. కానీ పార్టీని తాకట్టు పెట్టను. మా ప్రాణాలడ్డి మా బిడ్డ ప్రాణం కాపాడుకుంటాం' అని ఆ ఉత్తరంలో రాసింది. ఆ తరువాత 15 రోజులపాటు నిరశన వ్రతం చేసింది. ప్రభుత్వం దిగివచ్చి అనసూయ బిడ్డను మద్రాసు జనరల్ ఆసుపత్రికి పంపింది. పిల్లల డాక్టర్ లక్ష్మణస్వామి మొదలియార్ ఇంకో వారం రోజులు ఆలస్యమైతే బిడ్డ దక్కేవాడు కాదని చెప్పారు. పార్టీ పట్ల అనసూయ విశ్వాసం అలాంటిది.

1949లో కొందరు నేతలు జైలు నుంచి తప్పించుకున్నారు. అప్పటికి జైళ్లలో లాకప్ లేదు. దీన్ని సాకుగా తీసుకొని మహిళా నేతలను లాకప్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. తమను లాకప్ చేయడానికి వీలులేదని ప్రతిఘటించారు. అంతకుముందు 1942, 43 కాలాల్లో మహిళా క్లాసుల్లో నేర్చుకున్న కర్రసాము ఈ సమయంలో వారికి ఉపకరించింది. ఏదైతే అది అవుతుందని అంతకుముందే సంపాదించి ఉంచుకున్న కర్రలను బయటకు తీసి మేట్రిన్, వార్డెన్లు తమ వద్దకు రాకుండా కర్రసాము చేయడం ప్రారంభించారు. అయినా వారి శక్తి చాల్లేదు. అందరినీ లాకప్ చేశారు. అలా అనసూయ మిగతా మహిళా నేతలతో కలిపి రెండేళ్లకు పైగానే జైలు జీవితం గడిపింది.

జైలు నుంచి విడుదలై వచ్చిన తరువాత కమ్యూనిస్టు పార్టీలో పనిచేయనారంభించింది. 1952లో పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ సభ్యురాలుగా ఎన్నికయ్యారు. 1964లో అవిభక్త కమ్యూనిస్టు పార్టీలో చీలిక వచ్చినప్పుడు అనసూయ, ఆమె భర్త వెంకటేశ్వరరావు ఇద్దరూ సిపిఎం పక్షం వహించారు. 1968లో తీవ్రవాద విచ్ఛిన్నం వచ్చినప్పుడు కొద్దికాలం వారు బయటకు వెళ్లినా చివరికి సిపిఎం మాత్రమే నిక్కచ్చి అయిన కమ్యూనిస్టు పార్టీ అని నిర్ధారణకు వచ్చి పార్టీ కోసం చివరి శ్వాస విడిచే వరకూ పని చేశారు. అనసూయ పార్టీ ఏలూరు డివిజన్ కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యురాలిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నేతగానూ పనిచేశారు. అప్పటివరకూ ఒక మహిళ పార్టీలో ఒక తాలూకాకు పార్టీ కార్యదర్శగా పనిచేయడం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేయడం జరగలేదు. ఎమెర్జెన్సీ కాలంలోకూడా ఆమె అజ్ఞాత జీవితం గడిపారు.

ఆమె సిపిఎం ఏలూరు తాలూకా కార్యదర్శిగా ఉన్నప్పుడు చింతలపూడి తాలూకాలో రైతాంగ సమస్యలపై పనిచేశారు. ఏలూరు, చింతలపూడి తాలూకాల్లో భర్త అన్నే వెంకటేశ్వర రావుతో కలిసి నిర్వహించిన భూ పోరాటాల్లో వేలాది ఎకరాలు సాధించి పేదలకు భూమి దక్కేలా చేశారు. అనసూయ సమరశీల కార్యకర్తగా పేరొందారు. ఆ దంపతులిద్దరూ తమ బాధ్యతలను యువతరానికి అప్పగించాలని, అయినా తాము యథావిధిగా పార్టీకి, ప్రజలకు సేవలందిస్తామని తమ బాధ్యతలను స్వచ్ఛందంగా వదులుకున్నారు. బాధ్యతలను వీడినా వెనుకటి వలేనే పార్టీ కార్యక్రమాల్లో పనిచేయడం మానలేదు. తమకు ఓపికున్నంత వరకూ అలుపెరుగకుండా పార్టీలో పనిచేశారు. భర్త మరణించినా, తాను అనారోగ్యంతో పనిచేసే ఓపిక లేకపోయినా అనసూయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉత్సకత చూపేవారు. తాను చనిపోవడానికి కొద్ది రోజుల కిందట సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు తదితరులు తనను చూడవచ్చినప్పుడు ఆయనకు తనకు తోచిన విరాళం ఇచ్చి పార్టీపై అంచంచల విశ్వాసాన్ని ప్రదర్శించిన ధీర వనిత ఆమె.

# సామాజిక సమస్యలు సైద్ధాంతిక స్పష్టత

(15వ పేజీ తరువాయి)


నడుపుతుంది. అందుకే వర్గ దృక్పథం ప్రదర్శిం చడంలో ధైర్యం, నిజాయితీ ప్రదర్శించాలి.

**అవకాశవాదాన్ని తిరస్కరించాలి**

కులం విషయంలో బూర్జువా పార్టీలు అవకాశవాదాన్నే ప్రదర్శిస్తాయి. ఒకవైపు అగ్రకుల పెత్తందారీ ధోరణి ప్రదర్శిస్తూనే మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీలను రెచ్చగొట్టేందుకు ఏమాత్రం వెనకాడరు. కులవివక్ష పట్లా, కుల దురహంకార హత్యల పట్లా వీరు స్పందించరు. మధుకర్, నరేష్ వంటి వారి హత్యల సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఆర్ఎస్ వంటి పార్టీలు స్పందించలేదు. కులవివక్ష అంతం చేయటం వారికి ఇష్టం ఉండదు. కులాన్ని వాడుకోవటం, కులవ్యవస్థను కాపాడటమే వారి లక్ష్యం. భూస్వాములు, పెట్టు బడిదారుల రాజకీయ ప్రతినిధులే కదా వారు. అందుకే కుల వ్యవస్థను కాపాడతారు. కులవివ క్షనూ కొనసాగిస్తారు. కుల కొట్లాటలను రెచ్చ గొడతారు. వర్గ పోరాటం ఉధృతం చేయటం ద్వారానే మతోన్మాదాన్ని కానీ, కుల దురహం కారాన్ని గానీ ఎదుర్కోగలము. కేవలం ఆర్థిక రంగంలో మాత్రమే కాదు, సామాజిక రంగం లోనూ, సాంస్కృతిక రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ వర్గపోరాటం చేయాలి. సామా జిక సమస్యల పట్ల కార్మికవర్గం స్పందించాలి. అన్ని రకాల వివక్షలనూ ఎదిరించాలి. మధుకర్‌ను హత్య చేసింది బీసీలైనా, నరేష్‌ను హత్య చేసింది అగ్రవర్ణాలైనా, మహిళా కలెక్టర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి గిరిజనుడైనా, ఈ వివక్షలన్నింటినీ వ్యతిరేకించవలసిందే. ఈ ఆధిపత్యాలకు వ్యతిరేకంగా పోరాడవలసిందే. అణగారిన తరగతులనూ, శ్రామికులనూ కలిపి నడిపే బంధం కులం కాదు. కలిపి నడిపే బంధం ఆధిపత్యం మీద, కులవివక్ష మీద పోరాటం మాత్రమే. అది దోపిడీ మీద తిరుగుబాటు మాత్రమే. ఆర్థిక, సామాజిక సమస్యల మీద జమిలిగా పోరాడటమంటే అర్థం ఇదే.

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-01-2018 (36 pages) Postal Regd. No VJ/172/2018-20

# దోపిడీ కొనసాగినంత కాలం యుద్ధం కొనసాగుతుంది



**– భగత్ సింగ్**

“**భా**రతదేశంలోని బ్రిటీషు ప్రభుత్వాధినేత అయిన వైస్రాయి ఆర్డినెన్సు ప్రకారం ఏర్పడిన లాహోరు కుట్ర కేసు స్పెషల్ ట్రిబ్యునల్ మాకు 1930లో ఉరిశిక్ష విధించింది. అయిదవ జార్జి చక్రవర్తికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించామనేది మాపైన మోపబడిన అభియోగాలన్నిటిలోకి పెద్దది.

“కోర్టు ఇచ్చిన ఈ తీర్పులో రెండు ప్రధానాంశాలున్నాయి : ఒకటి – ఆంగ్లజాతికి, భారతీయులకీ మధ్య ఓ యుద్ధం నడుస్తున్నది. రెండవది మేం వాస్తవంగా ఆ యుద్ధంలో పాల్గొన్నాము. అందువల్ల మేం రాజకీయ యుద్ధఖైదీలమై వున్నాము.

“ఈ రెండవ నిర్ధారణ మరీ అతియోక్తిగా అనిపించినప్పటికీ అది మమ్మల్ని గౌరవించడంగా భావించకుండా వుండటం కష్టం.

“మొదటి వ్యాఖ్య గురించి కాస్త వివరంగా చర్చిస్తాము. అందులో పేర్కొన్నట్టు పైకి చూస్తే ఎలాంటి యుద్ధమూ జరగడం లేదు. అయినప్పటికి కోర్టువారి ఈ వ్యాఖ్యను విలువైందిగానే తీసుకోదలిచాం. అయితే దాన్ని సరిగ్గా అర్ధం చేసుకోవడానికిగాను మేము వివరణ ఇవ్వాలనుకుంటున్నాము.

“భారత దేశ ప్రజలపై దోపిడీ సాగుతున్నంత కాలం, వారి సహజ వనరులు అతి కొద్ది మంది పరాన్నభుక్కులచే కొల్లగొట్టబడుతున్నంత కాలం ఈ యుద్ధం కొనసాగుతూనే వుంటుంది. వారు బ్రిటీషు పెట్టుబడిదారులే కావచ్చు, లేదా బ్రిటీషు భారతీయ మిశ్రమ వర్గీములే కావచ్చు. లేదా అచ్చమైన భారతీయులే కావచ్చు. వారు ఈదారుణమైన దోపిడీని మిశ్రమ పద్దతిలో గాని లేక పూర్తిగా భారతీయ అధికార యంత్రాంగం ద్వారా గాని సాగిస్తుండవచ్చు. కాని ఎలా జరిగినా వీటి మధ్య పెద్ద తేడా వుండదు. మీ బ్రిటీషు ప్రభుత్వం భారతీయ సమాజంలో కులీన వర్గానికి చెందిన కొంతమంది నాయకులను రాయితీలతో లోబరుచుకిని రాజీలకు వచ్చినా దాని వల్ల తాత్కాలిక నిరుత్సాహం తప్ప ప్రధాన శక్తుల స్ఫూర్తి ఏ విధంగానూ దెబ్బ తినదు. భారతీయ వుద్యమ అగ్రస్ధాంనంలో వున్న పార్టీ ఇప్పుడు మరోసారి యుద్ధ రంగంలో చిక్కుకు పోయింది. మా గురించి ఆ నాయకులు సానుభుతి వ్యక్తం చేసినందుకు మేము కృతజ్ఞతులుగా వుంటాము. కాని వారు ఎంతగా కళ్ళు మూసుకుపోయి వున్నారంటే వారు మీతో జరిపిన శాంతి సంప్రదింపుల్లో నిరాశ్రయులైన, అనాదలైనా, నిర్భాగ్యులైన మహిళా కార్మికులుగా తాము పరిగణించే శత్రువులకు అగ్రగాములుగా వున్నారని వారి భావన. నిజానికి అదంతా గడచిపోయిన ఘట్టం. ఈ వీరనారులు మీ ప్రభుత్వం నిషిద్ద వ్యక్తులుగా ప్రకటించిన తమకు ప్రియతమ భర్తల కోసం సోదరుల కోసం నిస్వార్ధంగా త్యాగాలు చేశారు. చేయడానికి సిద్దపడ్డారు. ఆఖరుకు తమను తాము బలిచేసుకున్నారు. మీ తాబేదార్లు వారి ప్రతిష్టను వారి పార్టీ గౌరవాన్ని దెబ్బతీసేందుకు కట్టుకథలు అల్లే నీచత్వానికి దిగజారవచ్చు గాని వారు వాస్తవంలో నిష్కళంక వ్యక్తిత్వానికి ప్రతీకలుగా వున్నారు. ఈ సమరం కినసాగవలసిందే.

“అది ఆయా దశలలో రకరకాల రూపాల ధరించవచ్చు. కిన్ని సార్లు బహిరంగంగా, మరికిన్ని సార్లు రహస్యంగా వుండవచ్చు. కిన్ని సార్లు ప్రచార రూపంలో వుంటే మరొక సందర్భంలో జీవన్మరణ సంగ్రామంగా మారవచ్చు. అది ఎలా వుంటుందనేది మీ చేతలను బట్టి వుంటుంది. రక్త సిక్తంగా వుంటుందా, సాపేక్షంగా శాంతియుతంగా సాగుతుందా అనేది మీ చేతులను నిర్ణయమవుతుంది. అయితే అది నిర్విరామంగా కొనసాగుతూనే వుంటుంది. అల్పమైన అర్ధరహితమైన నైతిక మీమాంసలతో నిమిత్తం లేకుండా సాగవలసిందే. బహుళా మరింత శక్తివంతంగా, మరింత సాహసోపేతంగా, అచంచల సంకల్పంతో సోషలిస్టు రిపబ్లిక్ స్ధాపించేదాకా సాగవలసిందే. ప్రస్తుత సామాజిక వ్యవస్థ స్ధానంలో ఒక నూతన వ్యవస్ధ ఏర్పడే వరకూ సామాజిక సౌభాగ్యం ప్రాతిపదికంగా అన్ని రకాల దోపిళ్లకు భరత వాక్యం పలికే వరకూ ఆ సమరం సాగవలసిందే. మానవాళికి నవోదయం కలిగేకరకూ ఆ పోరాటం సాగవంసిందే. సమీప భవిష్యత్తులోనే అంతిమ పోరాటం జరిగి తుది పరిష్కారం సాధించుకోవలసి వుంటుంది. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దోపిడికి రోజులు చెల్లన్నుయి. ఈ యుద్ధం మాతో ప్రారంభం కాలేదు. మాతోనే ముగిసిపోదు. చారిత్రిక ఘటనలు, ప్రస్తుత వాతావరణం అనివార్యంగా అందుకు దారీ తీస్తాయి. మేము సవినయంగా చేసే త్యాగాలు ఆ పోరాట హరంలో చిన్న చిన్న లింకుల వంటివి. ఆహారాన్ని జతిక్ దాస్, అనుపమ తాగ్యం, అత్యంత విషాదకరమైనప్పటికీ మహోన్నతమైన భగవతీ చరణ్ త్యాగం, మా ప్రియతముడైనా పోరాట వీరుడు ఆజాద్ మహత్తర అమరత్వం అత్యంత నిశితంగా సుందరవంతంగా తీర్చి దిద్దాయి.

“ఇక మా విధికృతానికి సంబంధించి ఒక విషయం చెప్పదలచాము. మీరు మా ప్రాణాలు తీయదల్చుకుంటే తప్పక చేస్తారు. అధికారం మీ చేతుల్లో వుంది. ప్రపంచంలో అధికారమే అతి పెద్ద సమర్ధనగా వుంటుంది. బలమున్నవాడి మాటే చెల్లుతుందన్న మాట మాకు తెలుసు. మా మొత్తం విచారణక్రమం అందుకు నిదర్శనంగా వుంది. మీ కోర్టు తీర్పు ప్రకారం మేము మీ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించాం. కనక మేము యుద్ధ ఖైదీలం. మమ్ములు్న అలాగే పరిగణించవలసిందిగా మేము కోరుతున్నాము. అంటే మీరూ ఉరి తీయడానికి బదులు మమ్మల్నియుద్ధఖైదీల మాదిరిగా తుపాకితో కాల్చి చంపాలి. మీ కోర్టు చెప్పిన మాట నిజమో కాదో నిరూపించుకుటారో లేదో మీ ఇష్టం.

“మమ్మల్ని తుపాకీతో కాల్చి వేయడానికి ఒక దళాన్ని పంపించవలసిందిగా మీ సైన్య విభాగానికి ఉత్తర్వులివ్వగలరని ఆశిస్తూ అలా చేయవలసిందిగా కోరుతున్నాం.”

*(తెలకపల్లి రవి సంకలనం చేసిన భగత్‌సింగ్ పుస్తకం నుండి ఈ వాక్యాలు సేకరించబడ్డాయి)*

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.12, No.9. Published on January 1, 2018